జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


యుపిలో బాలికలకు రక్షణేది?
నీతి ఆయోగ్ పునర్వ్యవస్థీకరణ
బిజెపి వాషింగ్ మెషిన్
తిరిగొచ్చింది
05


సంపుటి 09, సంచిక: 146 | ఆదివారం | 26-04-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ఎంఎల్‌సిలుగా కోదండరామ్ అజారుద్దీన్

### గవర్నర్ ఆమోదం

సిపిఐ అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

గవర్నర్ కోటా ఎంఎల్‌సిలుగా మహమ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అభ్యర్థిత్వాలను రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదించారు. ఇందుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రివర్గంలో అవకాశం కల్పించింది. మంత్రిగా నియమితులయ్యే వ్యక్తి ఆరు నెలల లోగా శాసనమండలి లేదా శాసనసభలో సభ్యులుగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ ఉభయ సభలలో సభ్యుడు కానందు వల్ల ఈ నెల 30వ తేదీలోపు ఉభయ సభలలలో ఏదో ఒక సభలో సభ్యుడు కాకపోతే మంత్రి పదవి కోల్పోయే అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలో తరువాయి 12లో

## మరో 47 మంది మావోయిస్టులు లొంగుబాటు

తెలంగాణలో ఇక మిగిలింది 'ఆ నలుగురే'!
03

## కార్మికుల సమష్టి ప్రజాస్వామిక

# పోరాట విజయం

ఆర్‌టిసి డిపోల వద్ద కార్మికుల సంబరాలు
ఆర్‌టిసిపై ప్రభుత్వానిది సముచిత నిర్ణయం

గత ప్రభుత్వ చర్యలను సరిదిద్దడం హర్షణీయం
ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కృతజ్ఞతలు
కమిటీతో విలీన ప్రక్రియ ప్రారంభించడం అభినందనీయమని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి సంఘాల జెఎసి నేతలతో శుక్రవారం ఐఎఎస్ అధికారులు, మంత్రుల బృందం జరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో రాష్ట్రంలోని అన్ని ఆర్‌టిసి డిపోల వద్ద పండగ వాతావరణం సంతరించుకుంది. 11 శాతం పిఆర్‌సికి, గుర్తింపు పొందిన సంఘానికి ఎన్నికలు నిర్వహించడానికి ఆమోదం తెలపడంతో కార్మికుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. డిపోల వద్ద కార్మికులు విజయోత్సవాలు నిర్వహించారు. స్వీట్లు పంచుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకోవడం ద్వారా 10 ఏళ్లలో విచ్చిన్నమైన ఆర్‌టిసిని, కార్మికుల మనోగతానికి అనుగుణంగా పరిష్కరించడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం విడుదల తరువాయి 2లో

సమ్మె విజయవంతంపై ఎఐటియుసి జేజేలు 12






ఆర్‌టిసి కార్మికులు జెఎసిగా ఏర్పడి సమ్మెను జయప్రదంగా నిర్వహించడం ద్వారా తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడం హర్షణీయం. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చొరవ, సమయస్ఫూర్తితో మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేసి కార్మికుల డిమాండ్లను అంగీకరించినందుకు కృతజ్ఞతలు. చర్చలో భాగంగా అంగీకరించిన కార్మికుల డిమాండ్లను తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.
– సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



ఆర్‌టిసి ఉద్యోగుల నిజమైన సమస్యలు పరిష్కరించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు. ఐక్యంగా, ధైర్యంగా పోరాడి ఈ విజయాన్ని సాధించుకున్న తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు. ఐక్య పోరాటంతోనే చిరకాల సమస్య లకు పరిష్కారం లభించింది. ప్రాణత్యాగం చేసిన ఆర్‌టిసి డ్రైవర్ శంకర్‌గౌడ్‌కు నివాళి.
– సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ



## ఏరోస్పేస్‌లో ప్రపంచ అగ్రగామిగా

# రాష్ట్రం నిలవాలి

- దేశంలో ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ అవతరించాలి
- అందుకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పెద్ద ఎత్తున కృషిచేస్తోంది
- ఈ రంగాన్ని కీలక వృద్ధిగా పరిగణిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- ఆర్బిటల్ రాకెట్ విక్రమ్–1కు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి జెండా ఊపి ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ అవతరించనుందని, రాష్ట్రం ఏరోస్పేస్ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ హైదరాబాద్ నగరంలోనే రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ప్రైవేటు 'ఆర్బిటల్ రాకెట్ విక్రమ్1'ను శ్రీహరికోటకు సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రయోగ స్థలానికి రాకెట్ లాంఛనంగా బయలుదేరింది. రానున్న నెలల్లో భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ ప్రయోగానికి స్కైరూట్ సిద్ధమవనుంది. ఈ సందర్భంగా స్కైరూట్ బృందాన్ని సిఎం ప్రశంసించారు. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లేందుకు భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్‌ను స్కైరూట్ హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం ఏరోస్పేస్ రంగంలో ఈ రాష్ట్ర వృద్ధికి ఇదొక మైలురాయి అని అభివర్ణించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జిఎంఆర్ ఎరోస్పేస్ పార్క్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ ప్రయోగ తరువాయి 2లో

## 1 నుంచి మెట్రోరైల్ ప్రభుత్వ నిర్వహణలోకి..

సిఎస్ రామకృష్ణారావు చైర్మన్‌గా మెట్రోరైలు కమిటీ ఏర్పాటు
హెచ్‌ఎంఆర్‌ఎల్ నిర్వహణకు 10 మంది సభ్యులతో కమిటీ

ప్రజాపక్షం/ హైదరాబాద్



హైదరాబాద్ మెట్రో రైలు విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మే 1వ తేదీ నుంచి ప్రభుత్వ నిర్వహణలోకి హైదరాబాద్ మెట్రోరైలు రానుంది. ఈమేరకు హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణకు ప్రభుత్వం కమిటీ వేసింది. సిఎస్ రామకృష్ణారావు చైర్మన్‌గా మెట్రోరైలు కమిటీ ఏర్పాటు చేయగా హెచ్‌ఎంఆర్‌ఎల్ నిర్వహణకు 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండిగా ఐఎఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు తీసుకోనున్నారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ డైరెక్టర్లుగా జయేశ్‌రంజన్, వికాస్‌రాజ్, సందీప్ కుమార్ సుల్తానియా, శివధర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జితేశ్ వి.పాటిల్ ఉండగా హెచ్‌ఎంఆర్‌ఎల్ జాయింట్ ఎండిగా శివేంద్రప్రతాప్ నియామకమయ్యారు. కాగా, ఈ నెలాఖరులోగా(ఏప్రిల్) హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు స్వాధీనానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. ఈ మేరకు మొదటి దశ స్వాధీనానికి అవసరమైనటువంటి ప్రక్రియకు సంబంధించి జిఒ నం.127ను మెట్రోపాలిటన్ ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్ శుక్రవారం జారీచేశారు. ఎల్‌అండ్‌టికి ఉన్న 100 శాతం ఈక్విటీ వాటా కొనుగోలు చేయడం, ఐఆర్‌ఎఫ్‌సి నుంచి లోన్, ఒప్పందాల అమలు, ఇతర అంశాలతోపాటు కేబినెట్ సబ్‌కమిటీ చేసిన సిఫార్సులతో హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) ఎండి పలు ప్రతిపాదనలు చేశారు. వీటిపై గురువారం కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి షేర్ పర్చేజ్ అగ్రిమెంట్, ఐఆర్‌ఎఫ్‌సి నుంచి లోన్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ లేఖ, ప్రభుత్వ గ్యారంటీ, ఆర్‌బిఐ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) నుంచి డైరెక్ట్ డెబిట్ మాండేట్, రుణ టర్మ్‌షీట్, త్రైపాక్షిక ఒప్పందం, హెచ్‌ఎండిఎ నుంచి ఈక్విటీ నిధుల సమీకరణతోపాటు పలు అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





# కవిత పార్టీ టిఆర్ఎస్

## తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో నూతన పార్టీ ఆవిష్కృతం

కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలో కుటుంబ పాలన, అవినీతి
గత ప్రభుత్వ కుటుంబ పాలనలో నేనూ ఓ సభ్యురాలినే.. క్షమించండి
రాష్ట్రంలో తల్లిపాలన అందిస్తా
కెసిఆర్ ఒక మరమనిషి
పార్టీ ఆవిష్కరణలో కవిత వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్/మేడ్చల్ మల్కాజ్‌గిరి

తెలంగాణ రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీ ఆవిర్భవించింది.మాజీ ఎంఎల్‌సి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భారీ జన సభలో 'తెలంగాణ రాష్ట్ర సేన' (టిఆర్ఎస్) పేరుతో నూతన రాజకీయ పార్టీని శనివారం ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలలో కుటుంబ పాలన, అవినీతి, బంధుప్రీతితో నిండిపోయాయని, ఈ మూడు పార్టీలపై అలుపెరగని పోరాటం చేసేందుకు 'తెలంగాణ రాష్ట్ర సేన' (టిఆర్ఎస్) సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. తల్లి జేబు చూడదని, కడుపు మాత్రమే చూస్తుందని, అందుకే తెలంగాణ రాష్ట్రానికి తాను ఒక తల్లిగా 'తల్లి పాలన'ను అందిస్తానని, 'పాంచజన్యాలను' కవిత ప్రకటించారు. తాము రాజకీయ శక్తితో పాటు ప్రజా పోరాటాలను తరువాయి 2లో

### టిఆర్ఎస్ పాంచజన్యాలు

1. **ఉచిత విద్య :** రూపాయి భారం పడకుండా ఎంత ఖర్చు అయినా ఉచిత విద్య తమ బాధ్యత.
2. **ఉచిత వైద్యం :** ఏ వ్యాధి వచ్చినా, ఏ పెద్ద ప్రైవేటు ఆస్పత్రిలోనైనా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత వైద్యం ప్రభుత్వం బాధ్యత.
3. **రైతే రాజు :** రైతే రాజు నినాదంతో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక కుర్చీ వేసి సేవలు.
4. **ఉపాధి :** యువతకు బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు ఆర్థిక సాయం. యూత్ ఎంపవర్‌మెంట్ గ్రూప్‌ల ఏర్పాటు. ప్రభుత్వం వచ్చాక తొలి ఏడాదిలోనే ఒకే సారి 4 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ జారీ. 2014 జూన్ 2 కటాఫ్‌తో ఉద్యమకారులకు లక్ష ఉద్యోగాలతో సూపర్ న్యూమరీ పోస్టులు.
5. **సామాజిక తెలంగాణ :** బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, మహిళలకు న్యాయం. బిసిలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం.

# 'డిజిటల్' జనగణన

## నేటి నుంచి మే 10 వరకు స్వీయ నమోదు

ఒక కుటుంబం ఒక మొబైల్ నెంబర్‌తో మాత్రమే నమోదు చేసుకోవాలి
వెబ్‌సైట్‌లో 33 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి
మొదటి దశలో హౌస్ లిస్టింగ్, రెండవ దశలో వ్యక్తిగత వివరాలు సేకరణ
జనగణన రాష్ట్ర డైరెక్టర్ భారతి హోళికేరి




ప్రజాపక్షం/హైదరాబాద్

సుదీర్ఘంగా విరామం తర్వాత 16 ఏళ్ల అనంతరం దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ జనగణన ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రజలు తరువాయి 12లో

## 'రాష్ట్రీయ శరణాగతి సంఘ్'

ఆర్‌ఎస్‌ఎస్‌కు కొత్త భాష్యం చెప్పిన రాహుల్ గాంధీ
నాగ్‌పూర్‌లో నకిలీ జాతీయవాదం, యుఎస్‌లో పూర్తి దాస్యభావమా అంటూ మండిపాటు



**న్యూఢిల్లీ :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను 'రాష్ట్రీయ శరణాగతి సంఘ్'గా అభివర్ణించారు. ఆ సంఘం నాయకుడు రామ్ మాధవ్ ఢిల్లీలో ఆ సంస్థ 'ఫర్జీ (నకిలీ) జాతీయవాదం', అమెరికాలో 'పూర్తి దాస్యభావం' అనే నిజ స్వరూపాన్ని బయటపెట్టారని ఆయన ఆరోపించారు. అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో మాధవ్ మాట్లాడిన ఒక వీడియోను ఆయన ప్రస్తావించారు. ఆ వీడియోలో తరువాయి 12లో

## అమెరికా ప్రతినిధులు

# పాక్ వెళ్లొద్దు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
పాక్ నుంచి వెళ్లిపోయిన ఇరాన్ బృందం..
అమెరికా-ఇరాన్ మధ్య చర్చల్లో అనిశ్చితి



**వాషింగ్టన్ :** ఇరాన్‌తో రెండో విడత చర్చల కోసం అమెరికా ప్రతినిధి బృందం పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్లు వైట్ హౌస్ వర్గాలు తొలుత ప్రకటించాయి. దీంతో పాక్‌కు బయలుదేరేందుకు సిద్ధమవుతోన్న సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. చర్చల కోసం తమ బృందాన్ని పాక్‌కు వెళ్లొద్దని ఆదేశించినట్లు వెల్లడించారు. అమెరికా మీడియా సంస్థతో మాట్లాడుతూ.. ఫలితం లేని చర్చల కోసం అంతదూరం వెళ్లవద్దని తమ బృందానికి చెప్పానని అన్నారు. అయితే, వాళ్లు (ఇరాన్) ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడి తరువాయి 12లో

# లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు

కాల్పుల విరమణ ఉల్లంఘన : ఆరుగురు మృతి



**బీరుట్:** లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన గగనతల దాడిలో ఆరుగురు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఒకవైపు ఇస్లామాబాద్‌లో అమెరికా–ఇరాన్ మధ్య సమస్య పరిష్కారానికి చర్చలు ప్రారంభం కాగా లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన దాడులు ఉధృతం చేసే ఈ చర్యలను విఫలం చేసే ప్రయత్నం ప్రారంభించిందని హెజ్బొల్లా విమర్శించింది. లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అర్థం లేకుండా పోయిందని, ఇదంతా వృథా ప్రయాస అని హెజ్బొల్లా సైనిక నాయకులు విమర్శించారు. ఐతే ఇస్లామాబాద్‌లో చర్చలు సఫలమయ్యేందుకు సహకరించాలని, లెబనాన్‌లో దాడులు ఆపేయాలని అటు అమెరికా యంత్రాంగం, ఇటు లెబనాన్ ప్రభుత్వం కూడా ఇజ్రాయెల్ పాలకులకు విజ్ఞప్తి చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. కాల్పుల విరమణ పొడిగిస్తున్నట్లు ప్రకటన వచ్చిన వెంటనే హెజ్బొల్లా సైనికులు కూడా ఇజ్రాయెల్ లోకి రాకెట్లు ప్రయోగించారు. అమెరికా మధ్యవర్తిత్వంలో వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య శుక్రవారం ఒక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు లెబనాన్‌లో మరో మూడువారాలపాటు కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉంటుందని ట్రంప్ ఒక ప్రకటన చేశారు. ఆ మరుసటిరోజు ఇజ్రాయెల్ సైన్యం తీవ్ర ఉల్లంఘనకు పాల్పడి భారీస్థాయిలో గగనతల దాడులు చేసింది. హెజ్బొల్లా–ఇరాన్ పదాతిదళం మధ్య భారీ పోరాటం కొనసాగుతోంది. మరోవైపు ఐడిఎఫ్ గగనతల దాడులు కూడా కొనసాగుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలు కారణం మీరంటే మీరే... అని ఐడిఎఫ్–హెజ్బొల్లా మధ్య పరస్పర వాగ్వాదం కొనసాగుతోంది. అదేసమయంలో దక్షిణ లెబనాన్‌లో తమ పరిధికి వెంట ఉన్న విస్తారమైన అటవీ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని నిరాఘాటంగా కొనసాగిస్తామని, తమను ఎవ్వరూ అడ్డుకోలేరని ఇజ్రాయెల్ ప్రకటించింది. గాజా తరహాలోనే ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య లెబనాన్ భూభాగం లోపలికి చొచ్చుకువెళ్ళి ఒక బఫర్‌జోన్ ఏర్పాటు చేస్తామని, ఎల్లోలైన్ గీసి సరిహద్దును విస్తరించే ప్రణాళికను అమలు చేస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించింది. లితాని నది, వాడిసల్లానియా, సలుకి ప్రాంతాలలోకి లెబనాన్ ప్రజలను అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

## ప్రపంచదేశాలకు పెరిగిన చమురు కష్టాలు

విదేశీ నౌకలకు 90 రోజులు స్వేచ్ఛ : ట్రంప్



**వాషింగ్టన్:** ఇరాన్‌లో యుద్ధం, ట్రంప్ దాగుడుమూతలవల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు కష్టాలు ఆగకుండా కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ చమురు కష్టాలను నియంత్రించేందుకు ట్రంప్ ప్రభుత్వం అమెరికా ఓడరేవుల మధ్య విదేశీ నౌకల రాకపోకలపై జోన్స్ వేవర్ చట్టాన్ని మరో 90 రోజులు అమలు చేయకుండా నిలిపివేసింది. ఇప్పటికే ఈ చట్టం అమలును 60 రోజులపాటు నిలిపివేయగా, ఈ నిలిపివేతను పొడిగిస్తూ శుక్రవారం మళ్ళీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా సొంత నౌకలకు పునరుజ్జీవనం కలిగించేందుకు 1920 మార్చిలో ఈ జోన్స్ వేవర్ చట్టాన్ని తీసుకువచ్చారు. దీని ప్రకారం అమెరికాలో అంతర్గతంగా సంచరించే విదేశీ తయారీ నౌకలు,విదేశీ సిబ్బందితో నడిచే నౌకల రవాణాను అడ్డుకోకుండా మరో 90 రోజులు స్వేచ్ఛ ఇచ్చారు. ఇరాన్‌పై యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకూ రెండు నెలలుగా చమురు ధరలు అత్యధికస్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరు తర్వాత నుండి చమురు ధర యాభైశాతం పెరిగింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 120 డాలర్ల వరకూ వెళ్ళి ప్రస్తుతం 108 డాలర్లు, 107 డాలర్లుగా కొనసాగుతోంది. యుద్ధంవల్ల హోర్ముజ్ జలసంధి నుండి దాదాపు చమురు,సహజ వాయువు సరఫరాలు నిలిచిపోయాయి. ఐతే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరను స్థిరీకరించేందుకు అమెరికాయేతర నౌకల సులభ రవాణా నిమిత్తం ట్రంప్ మొదట 60 రోజులపాటు ఈ చట్ట కింద నిలివేత ఉత్తర్వులను సడలించారు.

## మొజ్తాబా ఖమేనీ ఆచూకీ గుర్తించిన రష్యా



**టెహ్రాన్:** ఇరాన్ సర్వాధినేత, అమెరికా–ఇజ్రాయెల్ దాడిలో ఫిబ్రవరి 28న మరణించిన అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీ ఎక్కడ ఉన్నారో ఆచూకీ తెలిసిందని రష్యా ప్రకటించింది. ఆయన ఇరాన్‌లోనే సురక్షిత ప్రాంతంలో ఉన్నారని ఇరాన్‌లో ఉన్న రష్యా రాయబారి అలెక్సీ దెడోవ్ చెప్పారు. మొజ్తాబా ఖమేనీ చేతికి శస్త్రచికిత్స జరిగిందని, కాలికి శస్త్రచికిత్స జరిగిందని, ఆయన ముఖానికి కూడా రాబోయే రోజుల్లో ప్లాస్టిక్ సర్జరీ జరుగుతుందని న్యూయార్క్ టైమ్స్ ఒక కథనం ప్రచురించిన తర్వాత అలెక్సీ దెడోవ్ పైవిధంగా చెప్పారు. న్యూయార్క్ టైమ్స్ కథనం–రష్యా రాయబారి ప్రకటన రెండూ రెండు నెలలుగా ఇరాన్ చేస్తున్న వాదనలకు బలం చేకూర్చాయి. అలీ ఖమేనీతోపాటు ఆయన రెండో భార్య, కోడలు,మనవరాలు,అల్లుడు,కూతురు కూడా ఫిబ్రవరి 28వతేదీ అర్థరాత్రి దాటిన తర్వాత జరిగిన దాడిలో మరణించారు. వారికి దూరంగా మరోచోట ఉన్న మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తొలుత వార్తలు వెలువడ్డాయి. మొజ్తాబా ఖమేనీ అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటివరకూ రెండు మూడు ప్రకటనలు చేశారుగానీ, ఆయన ఎక్కడా వీడియోలను విడుదల చేయలేదు. ప్రమాదం ఉందని తెలిసిన తర్వాత తన తండ్రి తరహాలో ఎక్కడా బాహాటంగా ప్రజలకు కనిపించలేదు. కానీ ఆయన సజీవంగానే ఉన్నారని ఇరాన్ పాలకులు మొదటి నుండీ చెబుతూ వచ్చారు. అసలు మొజ్తాబా ఆచూకీ ఇప్పటి వరకూ తెలియదని, ఆయన ఉన్నారో లేరో కూడా తెలియదని, ఆయన పరిపాలనకు పనికిరాడని, ఇరాన్,ఆర్థిక,సైనిక,రాజకీయ, సామాజిక వ్యవస్థలను నడిపించగల సత్తా మొజ్తాబాకు లేదని ట్రంప్ ఆరంభంలో తీవ్రస్థాయిలో నోరు పారేసుకున్నారు. ఇరాన్ పరిపాలన మారుస్తామని, యుద్ధంలో తాము గెలుస్తామని ట్రంప్ కొద్ది గంటల క్రితం కూడా ప్రకటన చేశారు.

# మరో మొస్సాద్ గూఢచారికి ఉరిశిక్ష

**టెహ్రాన్:** విదేశీ గూఢచారి కార్యకలాపాల నేరంపై మరో వ్యక్తిని ఇరాన్ ప్రభుత్వం ఉరి తీసింది. ఈ ఏడాది ఆరంభంలో ఇరాన్‌లో దేశవ్యాప్తంగా అల్లర్లు చెలరేగినప్పుడు ఇజ్రాయెల్ తరపు గూఢచర్యం చేసి అల్లర్లకు ఆజ్యం పోసి ప్రజలను రెచ్చగొట్టాడన్న ఆరోపణలపై ఎర్ఫాన్ కియానీ అనే గూఢచారిని ఉరితీసినట్లు ప్రభుత్వ టీవీ తెలియజేసింది. కింది కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించిన తర్వాత ఈ ఉరిశిక్ష అమలు చేశారు. ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొస్సాద్ తరపున కియానీ గూఢచారి కార్యకలాపాలు నిర్వహిస్తూ అల్లర్ల సమయంలో కీలక పాత్ర వహించాడని కోర్టు ధృవీకరించింది. ఇరాన్ ప్రభుత్వం ఈ ఏడాదిలో ఇప్పటివరకూ దాదాపు 30 మందికి ఉరిశిక్షలు అమలు చేసింది. వీరిలో మహిళలు కూడా ఉన్నారు.

**వాణిజ్య విమానాల పునరుద్ధరణ**

ఇరాన్‌లో వాణిజ్య విమానాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. రెండు నెలల యుద్ధం తర్వాత శనివారం ఇరాన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి వాణిజ్య విమానాల రాకపోకలను పునరుద్ధరించారు. ఫిబ్రవరి 28 నుండి 40 రోజులపాటు ఇరాన్‌లో అమెరికా,ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాదాపు 20,000 లక్ష్యాలపై దాడులు చేసి విధ్వంసం సృష్టించాయి. దీంతో మౌలిక సదుపాయాలన్నీ దెబ్బతిన్నాయి. చర్చల ప్రక్రియ మొదలైన తర్వాత గడచిన 20 రోజులుగా ఇరాన్‌లో అంతర్గతంగా దాడుల విరామం వచ్చింది. ఈ నెలారంభంలో ఇరాన్ పాక్షితంగా తన గగనతలాన్ని తెరిచింది. హోర్ముజ్ జలసంధిలో మాత్రం తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# బస్సులు ఢీ: పెంటగాన్ సిబ్బందికి గాయాలు



**వాషింగ్టన్:** అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని పెంటగాన్ సమీపంలో రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 23 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సహాయ బృందాలు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పెంటగాన్ సౌత్ పార్కింగ్ లాట్ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. ఒక ఓమ్ని రైడ్ బస్, మరో ఫెయిర్ ఫాక్స్ కనెక్టర్ బస్సు ఒకదానితో మరొకటి ఢీకొట్టుకున్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం, పరస్పర హెచ్చరికలు, బెదిరింపుల నేపథ్యంలో ఆ కోణంలోనే ఈ ప్రమాదాన్ని కూడా ఎక్కువమంది పరిశీలిస్తున్నారు. పలు బృందాలు రంగంలోకి దిగి తక్షణ దర్యాప్తు ప్రారంభించాయి. ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్నారు. సిసి ఫుటేజీలను పరిశీస్తున్నారు. గాయపడినవారిలో ఎక్కువమంది పెంటగాన్‌లో పనిచేసే రక్షణరంగ సిబ్బంది ఉండటం ప్రత్యేక విషయం. ఈ ప్రమాదం వల్ల రహదారిపై రవాణా కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. రోజువారీ రహదారిని చాలాసేపు మూసివేశారు.

# ఆర్‌టిసి జెఎసి సమ్మె విజయవంతంపై ఎఐటియుసి జేజేలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్ ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్ గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా జరిగితే కెసిఆర్ వారి సమ్మెను నిర్వీర్యం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల దశాబ్దాల కలను సాకారం చేసిందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ కొనియాడారు. ''రాష్ట్ర వ్యాపితంగా నిరవధిక సమ్మె 3 రోజుల పాటు కొనసాగుతున్న సందర్భంలో మరో ప్రక్క ఆర్‌టిసి కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రకు వ్యతిరేకంగా నర్సంపేట డిపోలో పనిచేసే శంకర్ గౌడ్ మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకొని తీవ్ర గాయాలతో చనిపోయారు. విషయం తెలిసిన ఆర్‌టిసి కార్మికులు మరింత ఉవ్వెత్తున సమ్మెకు సిద్దమైతే మరో ఇద్దరు ఆర్‌టిసి కార్మికులు ఆత్మాహత్య చేసుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల సమ్మెను గౌరవిస్తూ వారి 32 డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి, తక్షణమే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయటం, ప్రైవేటీకరణ ఆపటం, ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించటం వంటి మొత్తం డిమాండ్లను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయటాన్ని ఎఐటియుసి ఆహ్వానిస్తుంది. ఈ సమ్మెలో జెఎసి నాయకత్వాన పాల్గొన్న కార్మికులకు, నాయకులకు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి జేజేలు, విప్లవ జేజేలు పలుకుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా బేషజాలకు పోకుండా ఆర్‌టిసి కార్మికుల అన్ని న్యాయమైన సమ్మెను గౌరవిస్తూ ప్రభుత్వంలోని ముఖ్యమైన మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మ ణ్, వివేక్ వెంకటస్వామి తదితర మంత్రి వర్గం ఆర్‌టిసి జెఎసి నాయకులు అధికారులకు సానుకూలంగా స్పందించి, సమ్మెను నివారించి ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ధన్యవాదాలు తెలియజేస్తుంది. జెఎసిలో ఎఐటియుసి ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ముఖ్యమైన పాత్ర పోషించి సమ్మెను దిగ్విజయం చేసినందుకు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి అభినందనలు తెలిపింది'' అని బాల్ రాజ్ తెలిపారు.

## పోరాట విజయం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన ప్రకటనలో ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి, కార్మిక సంఘాలతో ప్రత్యక్షంగా చర్చలు జరిపిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మ ణ్ లకు అభినందనలు తెలిపారు. తన వంతు పాత్ర నిర్వర్తించిన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి కూనంనేని కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్‌టిసిలో గత ప్రభుత్వం యూనియన్లు లేకుండా చేయడం దుర్మార్గమైన చర్యని, కార్మికులు వారి సమస్యలు చెప్పుకోకుండా యూనియన్లను రద్దు చేశారని, దానిని ప్రస్తుత ప్రభుత్వం సరిదిద్దడం హర్షనీయమన్నారు. విలీనం అంశంలో గత ప్రభుత్వం సాచివేత ధోరణితో వ్యవహరించి కాలయాపన చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు కార్మిక సంఘాలతో కమిటీ వేసి విలీన ప్రక్రియ ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కార్మిక సంఘాలను అప్రజాస్వామికంగా రద్దు చేయగా ఆ చర్యను సరిదిద్ది కార్మికుల కోరికకు అనుగుణంగా తిరిగి యూనియన్ల ఏర్పాటు హక్కును తిరిగి కల్పించడంతో కార్మికులకు స్వేచ్ఛ స్వాతంత్రం వచ్చినట్లైందని, కార్మికుల సమిష్టి ప్రజాస్వామిక పోరాటానికి విజయం లభించిందన్నారు. ప్రభుత్వం కష్టకాలంలో ఉన్నా 11 శాతం పిఆర్‌సిని అమలు చేయడం మంచి పరిణామమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు వెళితే ప్రభుత్వం,ఆర్‌టిసి యాజమాన్యం బెదిరింపు, అణిచివేత ధోరణి తో కాకుండా సామరస్య పూర్వకంగా పరిష్కరిస్తే శంకర్ గౌడ్ ఆత్మహత్య లాంటి ఘటనలు జరగవని కూనంనేని సూచించారు. అదేవిధంగా కార్మికులు కూడా పట్టింపులకు పోకుండా పట్టువిడుపులతో సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఇదేక్రమంలో ఆర్‌టిసి మరింత ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

**శంకర్ గౌడ ఆత్మహత్య దురదృష్టకరం**

సమ్మెలో క్రియాశీలకంగా వ్యవహరించిన నర్సంపేట డిపో ఆర్‌టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి దురదృష్టకరం, ఆయన కుటుంబానికి తీరని శోకం మిగిల్చారని సాంబశివరావు అన్నారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడకుండా ఉంటే బాగుండేదని, చర్చలు సఫలమైనందుకు ఆయన ఎంతో సంతోషపడేవారని పేర్కొన్నారు. శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సాంబశివరావు కోరారు.

# పేలుళ్ళు, కాల్పులతో దద్దరిల్లిన మాలి



**బమాకో:** పశ్చిమాఫ్రికాలోని భూపరివేష్ఠిత దేశం మాలిలో సాయుధ ముఠాలు పరస్పర సమన్వయంతో ఏకకాలంలో దాడులు ప్రారంభించడంతో ఆ దేశ రాజధాని బమాకో శివార్లలో ఉన్న కటి సైనిక స్థావరం శనివారం పేలుళ్ళు, కాల్పులతో దద్దరిల్లింది. ప్రధాన ప్రభుత్వ సైనిక స్థావరంపై సాయుధ ముఠాలు సమన్వయ దాడులు చేశాయి. ''ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నాయి. సాయుధ ముఠాలను తిప్పికొట్టే పనిలో ఉన్నాం'' అని సైన్యం ఒక ప్రకటనలో తెలియజేసినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. ఈ ప్రాంతంలో రహదారులను సైన్యం మూసివేసింది. రాజధానికి వచ్చే విమానాలను కూడా రద్దు చేశారు. ఉత్తర మాలిలోని గావో, కిడార్, మధ్య మాలిలోని సెవారేలో కూడా దాడులు జరిగాయని ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. ఇటీవలికాలంలో దేశంలో జరిగిన అతిపెద్ద జీహాదీ ఇదే అని అక్కడి విశ్లేషకులు చెప్పారు.

## రాష్ట్రం నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నం చేయడానికి స్కైరూట్ సిద్ధంగా ఉండటం హర్షణీయమన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ 2022లో తన తొలి రాకెట్‌ను ప్రయోగించిందని, అయితే, ఇంత తక్కువ సమయంలోనే ఆర్బిటల్ ప్రయోగ దశకు చేరుకోవడం హర్షణీయమన్నారు. ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ భారతదేశంలోనే మొదటి స్థానంలో ఉందని సిఎం పేర్కొన్నారు. బోయింగ్, ఎయిర్‌బస్, సాఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి దిగ్గజాలు తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ఉన్నాయన్నారు. 2047 నాటికి ఏరోస్పేస్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలవాలన్నది తెలంగాణ లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్ రంగాన్ని ఒక కీలక వృద్ధి రంగంగా తమ ప్రభుత్వం పరిగణిస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ 2023 నుంచి ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ అసాధారణ వృద్ధి నమోదు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2023–24, 2024–25 మధ్యలో దేశంలోనే ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ 117.9 శాతం అత్యధిక వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఈ వృద్ధికి విమాన విడిభాగాలు, రక్షణ పరికరాలే ప్రధానంగా దోహద పడ్డాయన్నారు.

**ఏరో స్పేస్ విభాగంలో స్కిల్ యూనివర్సిటీ సేవలను వినియోగించుకోండి**

ప్రపంచ విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక దిగ్గజాలతో భాగస్వామ్యాల ద్వారా ఏరోస్పేస్ రంగం అవసరాల కోసం యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన చర్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అందుకు అవసరమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రతిభతో స్కైరూట్ వంటి కంపెనీలకు మద్దతు ఇవ్వడానికి తమ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రతిభావంతులకు నైపుణ్య శిక్షణ ఇస్తామని సిఎం చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు (ఎటిసి), త్వరలో ఉన్నతీకరించబడనున్న పాలిటెక్నిక్ కళాశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఆయన వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా, ఎటిసిలను, పాలిటెక్నిక్ కళాశాలలు, రెండింటినీ స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తామన్నారు. ఈ సంస్థల్లో శిక్షకులకు అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంపై తాము దృష్టి కేంద్రీకరించినట్టు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎటిసిలలో సిబ్బందికి టాటా టెక్నాలజీస్ ఇప్పటికే శిక్షణ అందిస్తున్నట్టు సిఎం వివరించారు.

**స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పనిచేస్తాం: స్కైరూట్**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పనిచేయడానికి స్కైరూట్ ఏరోస్పేస్ సిఈఓ, కోఫౌండర్ పవన్ కుమార్ చందన ఆసక్తిని వ్యక్తం చేశారు. స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం కావడం తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అంతకు ముందు ఈ విషయంపై సిఎం రేవంత్ రెడ్డి చేసిన సూచనకు సిఈఓ పవన్ కుమార్ చందన స్పందిస్తూ స్కిల్స్ యూనివర్సిటీ ఆలోచన ప్రత్యేకమైనదన్నారు. పరిశ్రమలుగా తాము ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నైపుణ్యత, శిక్షణే అని, స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా తమకు అవసరమైన ప్రతిభావంతులు దొరకడం సుగమమవుతుందని చెప్పారు. హైదరాబాద్‌లోని మల్లేపల్లిలో ఉన్న ఎటిసిని సందర్శించాల్సిందిగా ముఖ్యమంత్రి స్కైరూట్ సంస్థను ఆహ్వానించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పాఠ్యప్రణాళికను మార్చడంలో స్కిల్స్ యూనివర్సిటీ కల్పిస్తున్న వెసులుబాటును ఆయన సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యా వ్యవస్థలోని లోపాలను పరిష్కరించడానికి ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికల గురించి కూడా సిఎం ప్రస్తావించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ఏటా రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడంలేదని, ఈ సమస్యను పరిష్కరించడానికి తాము ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, స్కైరూట్ సహ వ్యవస్థాపకుడు, సిఓఓ నాగభరత్ డాకా తదితరులు పాల్గొన్నారు.

## కవిత పార్టీ 'టిఆర్ఎస్'

(మొదటి పేజీ తరువాయి)

మిళితం చేసి, సామాజిక తెలంగాణను సాధిస్తామన్నారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని 'ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం' (అద్వయ కన్వెన్షన్)లో శనివారం ఉదయం భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానుల కోలాహలం మధ్య కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టిఆర్ఎస్)ను ప్రకటించారు. అనంతరం తెలంగాణ అమరుల స్థూపానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలను సమర్పించి నివాళ్లు అర్పించారు. సందర్భంగా కవిత ప్రసంగిస్తూ 'ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పన, సామాజిక న్యాయం' అనే పంచ సూత్రాలతో తమ పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ ఐదు రంగాలలో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రధాన ప్రతిపక్షంగా తాము ఉద్యమిస్తామని, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉంటామని, మరో రెండేళ్లలో అధికారంలోకి వస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది ప్రజలకు తాను అమ్మగా పరిపాలన అందిస్తానని, అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డల కష్టం తెలుస్తుందని అన్నారు. తెలంగాణలో ఏళ్ల తరబడి నడిచిన భూస్వామ్య వ్యవస్థపై ఎందరో మహానుభావులు పోరాడితేనే సమానత్వం వచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడే ఇల్లు అలికామని, ముందుంది మొసళ్ల పండుగ అని కవిత హెచ్చరించారు.

**'పాంచజన్యం'తో ముందుకు ...**

ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి, సామాజిక న్యాయం అనే అంశాలపై దృష్టి పెడతామని కవిత ప్రకటించారు. కెజి నుంచి పిజి వరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివినప్పటికీ ఆ ఫీజుల భారాన్ని ప్రజలపై ఒక్క రూపాయి కూడా పడనివ్వబోమని చెప్పారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్యకైనా కార్పొరేట్ వైద్యం చేయించుకున్నా, ఆ వైద్య ఖర్చులు భారాన్ని ప్రజలపై పడకుండా ఉచిత వైద్యాన్ని అందించే బాధ్యత తమదని కవిత స్పష్టం చేశారు. రైతుకు గౌరవం వచ్చేలా కృషి చేయడమే, రైతు సంక్షేమమని అన్నారు. తాము రైతులం అని గౌరవంగా చెప్పుకునే పరిస్థితి తీసుకొస్తామన్నారు. ప్రతి కార్యాలయంలో రైతులకు ప్రత్యేకంగా ఒక కుర్చీని వేస్తామన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, యూరియా సహా రైతు సంక్షేమానికి చేయాల్సినవన్నీ చేస్తామని హామీనిచ్చారు. రైతును రాజును చేయడమే తమ లక్ష్యమన్నారు. ఉపాధి విషయంలోనూ తమకు స్పష్టమైన విజన్ ఉందని కవిత ప్రకటించారు. యువతకు ఉపాధి అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, వారి వద్ద మంచి వ్యాపార ఆలోచన ఉంటే రూ. 2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వమే రుణం అందించి, వారిని ప్రోత్సహిస్తుందని తెలిపారు.

టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే నాలుగు లక్షల ఉద్యోగాలతో కూడిన ఒకటే నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని, అలాగే తెలంగాణ ఉద్యమకారుల నిమిత్తం జూన్ 2, 2014ను కటాఫ్ తేదీగా నిర్ణయిస్తూ లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలను కల్పిస్తామని కవిత హామీ ఇచ్చారు. సామాజిక న్యాయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. హిందీలో తియ్యగా మాట్లాడుతూ మైనార్టీలను బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోసం చేశాయని ఆరోపించారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకూ రాజకీయ అధికారం కోసం తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు చిరు ఉద్యోగులు, వ్యాపారులు, కాంట్రాక్టర్లను కడుపులో పెట్టుకుని చూసుకుంటామన్నారు.

**కెసిఆర్ పాలనలో ముక్కలైన తెలంగాణ రథ చక్రం**

తెలంగాణ సాధించుకున్న తర్వాత కెసిఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రథ చక్రం దారి తప్పిందని, తెలంగాణ ప్రజల ఆశలు, ఆర్తిని అర్థం చేసుకోవడంలో బిఆర్ఎస్ పూర్తిగా విఫలమై, సామాజిక తెలంగాణ రథ చక్రం పూర్తిగా విరిగి ముక్కలైందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావిస్తే రైతులకు బేడీలు వేశారని, ఇసుక దందాపై ప్రేమతో దళితులపై లాఠీలు విరిగాయని గుర్తు చేశారు. ఫోన్లు ఎక్కడ వింటారోననే భయంతో వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా బతకాల్సి వచ్చిందని, దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికిందని కవిత విమర్శించారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు అన్యాయం జరిగిందని, ఉద్యమకారులకు కనీసం ఒక దేవాలయ కమిటీ చైర్మన్ పదవులు కూడా ఇవ్వలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమను అవహేళన చేసి లాఠీలతో కొట్టించిన వారే మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పెత్తనం చెలాయించారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రాజకీయ పరిణతి కోల్పోయిన కెసిఆర్**

ఎన్నికల్లో ఓడించి ప్రజలే తప్పు చేశారన్నట్టుగా కెసిఆర్ రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడుతున్నారని కవిత అన్నారు. తాను ఎన్ని మాట్లాడిన బిఆర్ఎస్ నేతలకు సమాధానం చెప్పడం చేతకావడంలేదని విమర్శించారు. ఇప్పుడు కూడా వారు సమాధానం చెప్పకపోతే ప్రజలే వారిని బయటకు లాగి సమాధానం చెప్పేలా చేస్తారన్నారు. ఆనాటి కెసిఆర్ చేనేత కార్మికులు చనిపోతే భిక్షాటన చేసి సాయం చేశారని, కానీ మారిన, మర మనిషి కెసిఆర్ ఇప్పుడు ప్రజలు కష్టాల్లో ఉన్నా బయటకు రావడంలేదని వ్యాఖ్యానించారు. వెలుగుమట్లలో, హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చేస్తుంటే అక్కడి బాధితులు 'అన్నా' అని పిలిచినా ఆ 'సార్' బయటకు రావడంలేదన్నారు. ఎక్కడ ఎవరికి చిన్న కష్టం వచ్చినా ఆ 'సార్' బయటకు రారని, ఎందుకంటే ఆయన ఆత్మలేని మర బొమ్మ అని మండిపడ్డారు. ఆనాడు సింగరేణిలో కార్మికుడు చనిపోతే వెళ్లి పరామర్శించిన కెసిఆర్, నేడు చేవెళ్లలో బస్సు ప్రమాదంలో చాలా మంది చనిపోయినప్పటికీ పట్టించుకోలేదని విమర్శించారు. అధికారం వచ్చిన తర్వాత ప్రేమ, మమకారం పోయిందా అని ఆమె ప్రశ్నించారు. కాళేశ్వరంలో అవినీతి జరుగుతుందని తాను చెబితే, ఆ అవినీతి చేసిన పందికొక్కులను పక్కన పెట్టుకుని తనను బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఎస్ ద్వారా నీళ్ల కోసం ఆనాడు పాదయాత్ర చేసిన కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని ఎందుకు పట్టించుకోలేదని ఆమె ప్రశ్నించారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకపోయి ఉంటే పాలమూరు–రంగారెడ్డి పూర్తయ్యేదని, బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో నీళ్ల కోసం రూ.1.89 లక్షల కోట్లను ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని, రాష్ట్రంలో ఏదో చేసినట్టు పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారని కవిత విమర్శించారు.

**సామాజిక న్యాయానికి బిజెపి వ్యతిరేకం**

బిజెపి అంటేనే సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి అని కవిత విమర్శించారు. ఆ పార్టీ పెద్దలకు అసలు తెలంగాణ ఏర్పాటే ఇష్టం లేదన్నారు. ఒకరు తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని వ్యాఖ్యానిస్తే, మరొక తలకాయ లేని ఎంపి తెలంగాణ ఏర్పాటును ఇండియా, పాకిస్తాన్ విభజనతో పోల్చారని మండిపడ్డారు. తెలంగాణను అవమానించేలా మాట్లాడినప్పటికీ ఇక్కడి బానిస బిజెపి ఎంపిలు తమ నోర్లు మెదపడం లేదన్నారు. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపారని, పోలవరం కారణంగా భద్రాచలం వద్ద ఐదు గ్రామాలు మునిగిపోయే పరిస్థితి ఉందని, బిజెపి ఎంపిలు తెలంగాణ బిడ్డలైతే ఆ ఐదు గ్రామాలను తెలంగాణకు తీసుకురావాలని కవిత సవాల్ చేశారు.

**రేవంత్ రెడ్డి ఒక కర్కోటకుడు**

కర్కోటక, రాక్షస రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తరిమేసేందుకు టిఆర్ఎస్ పాంచజన్యాన్ని పూరిస్తున్నామని కవిత చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డి ఒక కర్కోటక, నియంత సిఎం అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలుగుమట్లలో అన్ని అనుమతులు ఉన్నప్పటికీ అక్కడి ప్రజల ఇళ్లను కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధతో ఒక గర్భిణీకి అబార్షన్ అయితే ఆమె తండ్రి రోదన కళ్ల ముందు ఇంకా మెదులుతుందన్నారు. రెండు నెలల చిన్నారిని కాళ్లతో తన్ని చంపితే ఇప్పటికీ కూడా కేసు నమోదు చేయలేదని, గురుకులాల్లో విషం పెట్టి విద్యార్థులను చంపుతుంటే ఈ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు.

**కెసిఆర్ మన మనిషి కాదు... మారిన 'మర మనిషి' గుంటనక్కల చేతిలో బంది..**

'ఉద్యమకాలంలో ప్రజల కోసం పరితపించిన కెసిఆర్.. ఇప్పుడు గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో బంది అయ్యారు. ఆయన మన కెసిఆర్ కాదు. మర మనిషి' అని కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణకు ఏదైనా జరిగితే ప్రాణం పెట్టి పనిచేసే రాజకీయ పార్టీ కావాలని, అందుకు తాను టిఆర్ఎస్‌ను ఏర్పాటు చేస్తున్నానన్నారు.

**ఆ పార్టీల అజెండాలే వేరు**

'రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా. పెద్ద సార్ ఫామ్ హౌస్‌లో ఉండి చిన్న సార్‌ను సిఎంను చేయాలన్నదే బిఆర్ఎస్ ఎజెండా. ఇక సామాజిక న్యాయాన్ని ఖతం పట్టించడమే బిజెపి సింగిల్ ఎజెండా' అని కవిత అన్నారు.

**ఆ కుటుంబంలో భాగస్వామిని.. క్షమించండి**

ఆనాడు పరిపాలన చేసిన కుటుంబంలో తాను కూడా కుటుంబ సభ్యురాలిగా భాగమేనని, అందుకే తనను క్షమించాలని తెలంగాణ ప్రజలను కవిత కోరింది. కేవలం క్షమాపణ మాత్రమే చెబితే సరిపోదని, వాటిని సరిదిద్దుకునేందుకు వీలుగా సామాజిక తెలంగాణలో కోసం కష్టపడి పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. తమ పనితీరు ఎలా ఉంటుందో ముందు ముందు ప్రజలు చూస్తారని, ప్రజలకు మంచి చేయాలంటే రాజకీయ అధికారం కావాల్సి ఉంటుందన్నారు. ఏ పార్టీకైనా ఆత్మ నేపథ్యం ఉండాలని బిఆర్ఎస్ ఆత్మ కోల్పోయిందని కవిత వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ ఆత్మను కోల్పోయినందుకే 'తెలంగాణ రాష్ట్ర సేన' ఏర్పాటు చేశామని వివరించారు.



# అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- రూ.64 కోట్ల 77 లక్షల వ్యయంతో 597 కల్యాణలక్ష్మి, 50 షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, శాఖల మంత్రి, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్ వెల్దుర్తి రోడ్‌లో ఉన్న సాయి కృష్ణ కళ్యాణ మండపంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డిలతో కలిసి కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపిల్లల పాలిట వరం అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో పటిష్టంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో వారి డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత కెసిఆర్ హయాంలో అమలు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మంత్రి వెంకటస్వామిని మహిళకు రూ.2500 అదేవిధంగా తులం బంగారం ఎప్పుడూ ఇస్తున్నారని అడిగారు? మంత్రి వెంకటస్వామి కలగజేసుకొని కెసిఆర్ ప్రభుత్వంలో అప్పులు చేశారు. అందుకే రూ.2500 ఇవ్వడం లేదని అన్నారు. అయితే ఎమ్మెల్యే సునీతారెడ్డి లేచి ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయొద్దని హెచ్చరించారు. ప్రస్తుత రోజుల్లో అమ్మాయిలు బాగా చదువుకోని అన్ని రంగాలు రాణిస్తున్నారని తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రజలకు చేరువ చేయడానికి జిల్లాలో సమర్థవంతంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి, సిడిపిఓ హేమ భార్గవి, తహసిల్దార్ శ్రీనివాస్, కమలాద్రి, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, టిఆర్ఎస్ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రం గౌడ్, మన్సూర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాలపై కార్మికులతో కలిసి సంబరాలు జరపాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి సమ్మె విరమణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలలో ఆర్‌టిసి కార్మికులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎజెండాగా తీసుకుని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, అధికార ప్రతినిధులు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రతినిధులతో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన జూమ్ సమావేశంలో మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి పరిష్కారం చేసి సమ్మె విరమింపచేశారన్నారు. ఆర్‌టిసి కార్మికుల అంశాలపై ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ క్యాడర్ మొత్తం భాగస్వామ్యమై సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. వారి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని, ముఖ్యంగా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించడంతో పాటు ఉద్యోగులకు 11 శాతం పిఆర్‌సి ప్రకటన చేసిందన్నారు. ఆర్‌టిసి కార్మికుల మిగితా సమస్యలను కూడా పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో 55 రోజుల సమ్మెలో 30 మందికి పైగా మరణించినా ఏ ఒక్క హామీ కూడా బిఆర్ఎస్ నెరవేర్చలేదని గుర్తు చేశారు. కార్మికులతో మనకు శతృత్వం లేదని, వారు మన కుటుంబ సభ్యులన్నారు. ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బండి సంజయ్ శవ రాజకీయాలు చేయడం సరైంది కాదన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, సమ్మె సమయంలో బిజెపి, బిఆర్ఎస్‌లు వ్యవహరించిన తీరు మంచిదికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్‌టిసి ఉద్యోగులకు 2013 బాండ్స్, 2017 పిఆర్‌సి, డిఎల ప్రకటన, సిసిఎస్, పిఎఫ్ బకాయిలు చెల్లించడం, కొత్త బస్సులు కొనుగోలు, ఉద్యోగాల నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుండి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని వివరించారు.

# ప్రభుత్వానికి ఎపి పిటిడి యూనియన్ అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమ్మె చేసిన తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించిన తెలంగాణ ప్రభుత్వానికి ఎపి పిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయిస్ యూనియన్ అభినందనలు తెలియజేసింది. తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించి విజయం సాధించిన తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగులందరికీ విప్లవ అభినందనలు తెలిపింది. గత ప్రభుత్వం 2019లో తెలంగాణలో ఆర్‌టిసి యూనియన్లను రద్దు చేయడం అనేది దురదృష్టకరమైన చర్యగా అని, ప్రస్తుత సమ్మె నేపథ్యంలో యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించడం హర్షణీయమని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర రావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ వేతన సవరణల పరిష్కారం దిశగా అడుగులు పడటం, ఇతర సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గంతో పాటు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యోగుల భవిష్యత్తుకు మేలు చేసే నిర్ణయమని తెలిపారు. విలీన ప్రక్రియలో ఉద్యోగుల హక్కులు దెబ్బతినకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపట్టే ప్రతి పోరాటానికి ఎపి పిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయిస్ యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు.

# మహిళల పట్టుదల, కృషి సమాజానికి ఆదర్శం

- మైనారిటీస్ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల పట్టుదల, కృషి, ప్రతిభ సమాజానికి ఆదర్శమని రాష్ట్ర మైనారిటీల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. మహిళలు కుటుంబాలనే కాకుండా పరిపాలన, నాయకత్వం, సమాజ భవిష్యత్తును నిర్మిస్తున్నారని కొనియాడారు. హైదరాబాద్‌లో ఐఎఎస్‌ఎపి హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ డే వేడుకల్లో మంత్రి పాల్గొని, వారి పరిపాలనా సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంస్థ విజయవంతంగా నడవడంలో అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వారు కేవలం సహాయక సిబ్బంది మాత్ర మే కాదని, ప్రతి విజయవంతమైన వ్యవస్థకు వెన్నెముకలాంటివారని పేర్కొన్నారు. నాయకత్వం, అమలు వ్యవస్థల మధ్య వారే వారధిలా పనిచేస్తారని, వారి నిశ్శబ్ద సేవల వల్లే సంస్థలు బలంగా, స్థిరంగా నిలుస్తాయన్నారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండటం, కొత్త పరిస్థితులకు అలవాటు పడటం, సాంకేతికతను స్వీకరించడం, సమస్యలను తెలివిగా పరిష్కరించడం నిజమైన నైపుణ్యమని చెప్పారు. క్రీడల అనుభవాన్ని ప్రస్తావిస్తూ, విజయం ఒక్క నాయకుడి వల్ల కాకుండా ప్రతి సభ్యుడు కట్టుబాటుతో పనిచేసినప్పుడే సాధ్యమవుతుందని చెప్పారు. అదే విధంగా అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ కూడా ప్రతి సంస్థలో నిజమైన ఛాంపియన్‌లని, ప్రతి సంస్థలో గౌరవం, ప్రతిభ, గుర్తింపు కలిగిన వాతావరణాన్ని నిర్మించాలని మంత్రి అజారుద్దీన్ పిలుపునిచ్చారు.

# మర మనిషి మాటను ఉపసంహరించుకోవాలి

- మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :** తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌ను మర మనిషి అని మాట్లాడిన కవిత తక్షణమే తన మాటను ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2001లో కెసిఆర్ ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీని స్థాపించి సమాజాన్ని జాగృతం చేసి, అన్ని పార్టీలను ఏకం చేసి తెలంగాణ సాధించారన్నారు. కవిత కూడా తెలంగాణ ఉద్యమ బలోపేతానికి జాగృతి ద్వారా, ప్రజలను జాగృతం చేశారన్నారు. బీఆర్ఎస్‌తో విభేదాలు రావొచ్చు.. కానీగత వాస్తవాలను విస్మరించడం సరైంది కాదన్నారు. కేసీఆర్‌కు హృదయం లేకుంటే ఇవాళ తెలంగాణ రాష్ట్రం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్వయంగా భారత ప్రధానితో ప్రశంసలు పొందడంతో జాతీయ బ్యాంకుల సాయంతో నిర్మాణం జరిగిందన్నారు. కేవలం కేసీఆర్‌ను దోషిగా ఎత్తి చూపే ప్రయత్నంలో భాగంగా రెండు పిల్లర్లు కుంగితే మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ కాలయాపన చేస్తుందన్నారు. వర్షాభావంతో కరువు ఏర్పడితే రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. కేసీఆర్‌తో కలిసి ప్రయాణం చేసి, ఆయన ఉద్యమ స్ఫూర్తితో నాయకురాలిగా ఎదిగి తప్పు పట్టడం సరికాదని కవితకు హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలని కేసీఆర్ తపన పడుతున్నారని వివరించారు. కేసీఆర్ సూచనల మేరకు కేటీఆర్, హరీష్‌రావు, బిఆర్ఎస్ నాయకులు అందరూ హైడ్రాను నిలువరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మున్న, రాధకిషన్ రావు, సతీష్, దుర్గయ్య, తదితరులు ఉన్నారు.

# రైతు బంధూ లేదు, విద్యుత్ సరఫరా లేదు, సమయానికి వడ్లూ కొనడం లేదు

- సిరిసిల్లలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రంలో రైతులకు రైతు బంధు లేదు, సరిపడా విద్యుత్ సరఫరా లేదు, సమయానికి వడ్లు కొనుగోలు చేయడం లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శనివారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల పరిస్థితి దారుణంగా మారిందని మండిపడ్డారు. వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలిచి, వడ్లు కొనుగోలు అయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. నెల రోజులుగా రైతులు వడ్లను కేంద్రాలకు తీసుకువస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనలేదని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు 1000 టన్నుల వడ్లు కూడా కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ యజమానులకు ఇచ్చినట్లే కౌలు రైతులకు కూడా రైతు బంధు ఇస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ అమలు కాలేదని, రైతు కూలీలకు రూ.1000 ఇస్తామని చెప్పిన వాగ్దానం కూడా నెరవేర్చలేదని అన్నారు. వడ్ల కొనుగోళ్ల కోసం వెంటనే కాంటాలను ఏర్పాటు చేసి, రైస్ మిల్లులను కేటాయించాలని, రూ.500 బోనస్‌తో కలిపి కనీస మద్దతు ధరను రూ.2350గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలిచి, వడ్లు కొనుగోలు అయ్యే వరకు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ 2026 క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ సిరిసిల్ల డాల్ఫిన్స్‌కు కప్పు అందజేసి అభినందించారు.

# మరో 47 మంది మావోయిస్టులు లొంగుబాటు

- ఆపరేషన్ కగార్‌లో 818 మంది లొంగుబాటుతో తెలంగాణ రికార్డు
- తెలంగాణలో ఇక మిగిలింది 'ఆ నలుగురే'!






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మావోయిస్టు పార్టీ నేతలు, కార్యకర్తలు 47 మంది తెలంగాణ డిజిపి బి.శివధర్‌రెడ్డి ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి ఇన్‌చార్జితో హేమ్లా ఐతు (45)తో పాటు 27 మంది, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్‌కు చెందిన నలుగురు, సౌత్ బస్తర్ 9,30 ప్లాటూన్‌లకు చెందిన 16 మంది మావోయిస్టులు ఉన్నారు. వారు 32మరో తుపాకులను ప్రభుత్వానికి అప్పగించారు. డిజిపి కార్యాయలంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిజిలు మహేష్ భగవత్, అనిల్‌కుమార్, ఎస్ఐబి చీఫ్ బి.సుమతితో కలిసి డిజిపి బి.శివధర్‌రెడ్డి లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడించారు. ఈ లొంగుబాటుతో ఛత్తీస్‌ఘడ్ బెటాలియన్1 పూర్తిగా లొంగిపోయినట్లుగా తెలిపారు. వీరి వద్ద నుంచి ల్యాండ్ మైన్లలో వాడే వైర్లు 3 బండిళ్లు స్వాధీనం చేసుకున్నామని సౌత్ బస్తర్ డివిజన్‌కు చెందిన కీలక మావోయిస్టు లొంగిపోయారని తెలిపారు. లొంగిపోయిన వారిలో తెలంగాణ వారు ఎవరూ లేరని, వీరిలో తెలంగాణకు చెందిన వారెవరూ లేకపోయినా తెలంగాణలో వారు కార్యాకలాపాలు సాగించినట్లు డిజిపి తెలిపారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీని, అదనంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం కూడా అందిస్తామన్నారు.

**తెలంగాణ పోలీసుల కృషికి ప్రశంసలు**

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ పోలీసులు అంకితభావం, సమన్వయంతో చేసిన బి.సుమతి కృషిని డిజిపి ప్రశంసించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ పోలీసులు వృత్తిపరమైన నైపుణ్యంతో నిరంతరం చేసిన కృషి వల్ల 47 మంది అజ్ఞాతం వీడారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టు క్యాడర్ల సంఖ్య, వారు అప్పగించిన ఆయుధాలను బట్టి చూస్తే మావోయిస్టు పార్టీ క్రమంగా క్షీణించడమే కాకుండా సంపూర్ణంగా పతనం అయిందనే విషయం స్పష్టం అవుతోందన్నారు.

**రికార్డు స్థాయిలో 818 మంది...** "కగార్ ఆపరేషన్ ప్రారంభమైన తరువాత దేశంలోనే అత్యధికంగా మావోయిస్టులు లొంగిపోయిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. రెండున్నరేళ్లలో తెలంగాణలో దశలవారిగా 818 మంది మావోయిస్టులు లొంగిపోగా 334 ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించారు. ఇక 2023లో తెలంగాణకు చెందిన 125 మావోయిస్టులు అజ్ఞాతంలో ఉండగా ప్రస్తుతం నలుగురు మాత్రమే మిగిలారు. వీరి లో సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటి సభ్యులు ముప్పాల లక్ష్మ ణ్ అలియాస్ గణపతి ముఖ్యమైన వారు కూడా ఉన్నారు. గణపతి బతికే ఉన్నాడని అడవుల్లో మాత్రం లేరని పట్టణ ప్రాంతంలో తల దాచుకున్నారు'' అని డిజిపి తెలిపారు.

# ఎన్ని పార్టీలు వచ్చినా మాకేం భయం లేదు

- కవిత కొత్త పార్టీ ప్రకటనపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో తాజా పరిణామంగా కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ప్రకటించడంపై బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు వచ్చినా, కొత్త పార్టీలు ఏర్పడినా బిజెపికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తెలంగాణలో బిజెపికి అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో 12 ఏళ్లుగా అవినీతి రహిత పాలన కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక పార్టీలు ఉన్నాయని, తాజాగా మరో పార్టీ వచ్చిందన్నారు. తెలంగాణలో చివరకు బిజెపి అధికారంలోకి వస్తుందని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# పోటీ పరీక్షలలో ప్రేరణపై బిసి స్టడీ సర్కిల్ ప్రత్యేక గీతం

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉన్నత విద్యావంతులైన యువత ప్రజలకు సేవ చేయడానికి ప్రభుత్వ ఉద్యోగం ఒక చక్కని అవకాశమని, అలాంటి ప్రభుత్వ ఉద్యోగాలలో సివిల్ సర్వీసెస్, గ్రూప్ పరీక్షలు, బ్యాంకింగ్, రైల్వే, ఉపాధ్యాయులు లాంటి ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షల కోచింగ్ కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తూ అభ్యర్థులకు శిక్షణను అందిస్తోందని, ఈ శిక్షణను సక్రమంగా ఉపయోగించుకుని యువత ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ లాంటి అఖిల భారత ఉద్యోగాలను అత్యధిక సంఖ్యలో తెలంగాణ యువత విజయం సాధించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, దాని కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో 'రాజీవ్ అభయ హస్తం' పేరిట ప్రతి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ అర్హత సాధించిన అభ్యర్థికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ, తెలంగాణ యువత కలల్ని సాకారం చేసే ప్రయత్నం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ దిశగా బిసి స్టడీ సర్కిల్ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తుందని, సివిల్స్ 2025 కోసం 40 రోజుల 'సంకల్ప సాధన దీక్ష' పేరిట ప్రత్యేక శిక్షణ, మోడల్ టెస్ట్ నిర్వహణ లాంటి అంశాల ద్వారా అభ్యర్థులను సన్నద్ధం చేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా యువత పోటీపరీక్షల వైపు దృష్టి సారించి ప్రభుత్వ ఉద్యోగ సాధనలో మరింత కృషి చేసే ఉత్సాహాన్ని ప్రేరణను కలిగించే పోటీ పరీక్షల థీమ్ సాంగ్‌ను ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ బిసి స్టడీ సర్కిల్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ సారధ్యంలో ఈ పాట రూపకల్పన జరిగినందుకు మంత్రివర్యులు ఆయనని అభినందించారు.

# కూరగాయలు, పప్పుధాన్యాలు సాగు పెంపునకు సమగ్ర ప్రణాళిక రూపకల్పన

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పప్పు ధాన్యాల సాగు రోజు రోజుకు క్షీణిస్తుండడం, వరి సాగు అంతకు అంతా పెరగడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆందోళన వ్యక్తం చేశారు. వీటి సాగును పెంచేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆధికారులను ఆదేశించారు. రానున్న వర్షకాలంలో ఎల్‌నివో ప్రభావం ఉండనున్న నేపథ్యంలో ముందస్తు సాగు ప్రణాళికలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 2013–14 సంవత్సరం నుండి ఈ సంవత్సరం వరకు వరి సాగు విస్తీర్ణం 131.7 శాతం పెరగగా, మొత్తంగా పప్పుధాన్యాల సాగు 39 శాతం పడిపోయిందని తెలిపారు. ఇందులో కూరగాయాల సాగుతో పాటు పెసళ్లు 75.2, మినుములు 71.5, ఉలవలు 71.6, సజ్జలు 95, బొబ్బర్లు 72.4, నువ్వులు 94.9, పొద్దుతిరుగుడు 98.5, ఆముదం 98.5, వేరుశనగ సాగు 51శాతానికి క్షీణించిందని, రాష్ట్రంలో అనుకూలమైన సాగు పరిస్థితులు ఉన్నప్పటికి తగ్గుముఖం పట్టడం ఆందోళన కరమన్నారు. కూరగాయలు, పప్పుధాన్యాలు, మిల్లెట్లు, నూనె గింజల వంటి పంటల సాగు విస్తీర్ణాలు గణనీయంగా తగ్గిపోతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలపై ఆధారపడకుండ ఉండేలా పప్పుధాన్యాల సాగును మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పెంచేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయశాఖ అధికారులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులను మంత్రి ఆదేశించారు. ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నా మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభించేలా రకాలను ఎంపిక చేయాలని సూచించారు.

**మే 15నాటికి వాతావరణశాఖ నుంచి ఖచ్చితమైన నివేదిక తీసుకోవాలి**

రానున్న వర్షకాలంలో ఎల్‌నివో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశమున్న నేపథ్యంలో మే 15 కల్లా వాతావరణ శాఖ నుండి ఖచ్చితమైన నివేదిక తెప్పించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. తద్వారా జిల్లా వారీగా అక్కడి వాతావరణం, వర్షపాతాల అంచనాల ఆధారంగా రైతులు ఏఏ పంటలు వేయాలో తెలిపే విధంగా సమగ్ర పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వాతావరణశాఖ నిపుణుల అంచనాలతో... మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఈ సందర్భంగా సాధారణంగా రాష్ట్రంలో దక్షిణా తెలంగాణ కన్నా ఉత్తర తెలంగాణలో అధిక వర్షపాతం నమోదు అవుతుంటుందని, అయితే ఈ ఏడాది ఎల్‌నివో ప్రభావంతో ఉత్తర తెలంగాణలో తక్కువ వర్షపాత నమోదు కానుండగా దక్షిణ తెలంగాణ మరింత తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో సీడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, ఐఎండి డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఇటీవల మరణించిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళ్లు అర్పించి ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ రావును పరామర్శిస్తున్న దృశ్యం...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
పురపాలక సంఘం ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్.
E1/03/MCA/2026-27, టెండర్ నోటీస్ తేది: 25-04-2026
మిషన్ భగీరథ లీకేజీలు అరికట్టుటకు తాత్కాలికముగా వర్కర్లను మే-2026 నుండి మార్చ్ 2027 వరకు ఎంగేజ్ చేయుటకుగాను, వివిధ ప్రదేశాలలో ఆర్.సి.సి పైపులు వేయుటకు, యం.ఆర్.ఓ కార్యాలయం వద్ద గల పబ్లిక్ టాయిలెట్ ఔట్‌లెట్ కనెక్షన్ ఏర్పాటు చేయుటకు మరియు వివిధ వార్డులలో మోటార్లు & ప్యానల్ బోర్డుల మరమ్మత్తులు చేయుటకుగాను టెండర్లు కోరుచున్నాము. మిగితా వివరాల కొరకు తెలంగాణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ https://tender.telangana.gov.in లో లేదా పురపాలక సంఘ కార్యాలయము నందు పని వేళల్లో మున్సిపల్ ఇంజనీర్ గారిని సంప్రదించగలరు.
సం/- కమీషనర్, పురపాలక సంఘం, ఆర్మూర్.
DIPR R.O. No. : 1411-PP/CL/ADVT/2026-27, Date: 25-04-2026

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: మాదాపూర్ సర్కిల్-50
Lr: 03/EE/CIR-50/KPZ/CMC/2026-27/(Item No.1) తేది: 24.04.2026
NIT No. Lr: 03/EE/CIR-50/KPZ/CMC/2026-27/(Item No.1), తేది: 24.04.2026, పని పేరు: సివిల్ పనులు, అంచనా విలువ: రూ.12.00లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 27.04.2026 మ.02.00గం.ల నుండి 30.04.2026 మ.02.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50. సెల్ నెం. 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, సిఎంసి.
DIPR R.O. No. : 1439-PP/CL/ADVT/2026-27, Date: 25-04-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్.
Short Tender Notice No. 6/EE.Div.NO.28/GHMC/2026-27 తేది: 25.04.2026
NIT No. Short Tender Notice No. 6/EE.Div.No.28/GHMC/26-27, తేది: 25.04.2026, పని వివరణ: నిర్వహణ పనులు (02 నెం.లు), అంచనా విలువ: రూ.6.80లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 25.04.2026 మ.03.00గం.లకు, స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 29.04.2026 మ.03.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీమతి ఆర్.ఇందిరా బాయి, సెల్ నెం. 9963025505. పని వివరాల కాపీలు జతచేయబడినవి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 1467-PP/CL/ADVT/2026-27, Date: 25-04-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25-సంతోష్‌నగర్, చార్మినార్ జోన్.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నిర్వహణ పనులు
NIT No. 02/EE-25/CRZ/GHMC/2026-27, పని పేరు: క్ర.సం. 1 నుండి 1 వరకు, అంచనా విలువ: రూ.3.75లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 27.04.2026 మ.02.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 30.04.2026 మ.02.15గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీమతి కె.మాధవి, ఇఇ (ఎఫ్ఏసి) & డిప్యూటీ ఇఇ, సర్కిల్-25, చార్మినార్ జోన్, మస్కతి గ్రాండ్, దరబ్‌జంగ్ కాలనీ, సంతోష్‌నగర్, హైదరాబాద్. ఫోన్ నెం. 9701365510. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25-సంతోష్‌నగర్, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 1477-PP/CL/ADVT/2026-27, Date: 25-04-2026



## పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులే లక్ష్యం

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని 701 మంది లబ్ధిదారులకు రూ.7.02కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సిఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, అధికారులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రత నుండి జాగ్రత్తలు



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఎండాకాలం వేడి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసులకు చలువ అద్దాలు, బాటిల్స్, వైట్ క్యాపులు అందజేసి ఆయన మాట్లాడారు. ఎండకు డీ హైడ్రేషన్ బారిన పడకుండా ఎక్కువగా మంచినీళ్లు తీసుకోవాలన్నారు. మజ్జిగ, ఓఆర్ఎస్ లాంటివి కూడా తీసుకోవడం మంచిదన్నారు. సిబ్బందికి ఇబ్బంది లేకుండా షిఫ్టుల వారీగా విధులు కేటాయించాలని అధికారులకు సూచించారు. పోలీసు సిబ్బంది విధుల నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎండ సమయంలో బైక్‌లపై ఎక్కువ దూరం ప్రయనించవద్దని చెప్పారు. వెంట మంచి నీళ్ళ బాటిల్స్ తీసుకెవెళ్లాలని, ప్రయాణ సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, అర్మడ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఆర్ఎస్ఐ అఖిల్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని డిఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకటరమణ అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రత్యేక అవగాహన సదస్సు పట్టణంలోని రాజీవ్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇండ్ల చుట్టూ, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ బాటిల్స్, గ్లాసులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలు వాడటం ద్వారా మలేరియాను నివారించవచ్చని సూచించారు. చలితో కూడిన జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అన్ని ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా మలేరియా పరీక్షలు, చికిత్స అందించబడుతుందన్నారు. క్లోరోక్విన్ ఔషధం ప్రభావవంతంగా పనిచేస్తుందని తగిన మోతాదులో వైద్యుల సలహా మేరకు తీసుకోవాలని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో చివరి మలేరియా కేసు మార్చి 2026న నమోదుదైందని 2030 నాటికి మలేరియా పూర్తిస్థాయిలో తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ జి. చంద్రశేఖర్, మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్ధ, యంహెచ్‌యన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాజియా, వైద్యాధికారిణి డాక్టర్ వాసవి, సిబ్బంది పాల్గొన్నారు.

## నెలాఖరు కావస్తున్నా చేయూత పెన్షన్లు ఎక్కడ? : దూళిపాళ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నెలఖారు కావస్తున్న చేయూత పెన్షన్లు ఎక్కడని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఇచ్చే జీతభత్యాలు లక్షలాది రూపాయలు ప్రతి నెల 1వతేదీన క్రమం తప్పకుండా తీసుకుంటున్నారని అన్నారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్లు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర బడ్జెట్ లేదని సాకు చెబుతున్నారని, నెలాఖరు వరకు పోస్టా ఆఫీస్ చుట్టు, గ్రామ పంచాయతీ చుట్టు తిప్పుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనేక మంది పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఉన్నారని, అర్హులైన అందరికి పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని సక్రమంగా అమలు చేయలేకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందన్నారు. ఆయన వెంట రావుల సత్యం, కొమ్మరాజు వెంకట్ పాల్గొన్నారు.

## మరమ్మతు పనుల పర్యవేక్షణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని వెంకటాద్రిపాలెం గుబిలి కాలనీలో నిర్వహించిన డబుల్ బెడ్ రూమ్స్ ఇండ్ల మరమ్మతు పనులను శనివారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, విద్యుత్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాల కల్పనకు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు పనులపై నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. వారి వెంట తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, డీఈ వెంకన్న తదితరులు ఉన్నారు.



# డీజిల్ సంక్షోభం

ఎక్కడ చూసినా 'నో స్టాక్' బోర్డులు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు




**ప్రజాపక్షం/సూర్యాపేట** : డీజిల్ సంక్షోభం మళ్లీ తలెత్తింది. ఏ బంక్‌లో చూసినా నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సూర్యాపేట జిల్లాలో దాదాపు ఆయా కంపెనీలకు చెందిన 200ల వరకు పెట్రోల్, డిజిల్ బంక్‌లు ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధానికి ముందు డీజిల్ కొరత అసలు ఉండేది కాదని ఆయా కంపెనీల వారు తాము అడిగిందే తడువుగా డబ్బులు చెల్లించగానే డిజిల్‌ను ప్రతిరోజు 12వేలు, 14, 20, 25వేల లీటర్ల వరకు ట్యాంకర్ల ద్వారా పంపేవారని బంక్ యజమానులు చెబుతున్నారు. హొర్ముజ్ జల సంధి వద్ద నెలకొన్న యుద్ధవాతావరణంతో ఈ పరిస్థితులు తలెత్తడంతో ప్రతిరోజు రెండుసార్లు దిగుమతి అయ్యే డీజిల్ వారం రోజులైనా ఒక్క ట్యాంకర్ కూడా రావడంలేదని వచ్చినా గంట వ్యవధిలోనే అయిపోతుందని వాపోతున్నారు. ఏ బంకులో చూసినా డీజిల్ నో స్టాక్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. వేసవి కాలం కావడంతో పాటు మామిడి, నిమ్మ, వరి ధాన్యం, కూరగాయలు, ఇతర నిత్యవసర సరుకుల ఎగుమతులు, దిగుమతులు చేసే వాహనాలు, ప్రజారవాణా చేసే ఆటో, బస్సులు, కార్లు, జీపులు డిజిల్ కొరత తీవ్రంగా ఉండడంతో వీటిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ పరిస్థితి ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందో కూడా ఎవరూ చెప్పలేని పరిస్థితి. డీజిల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీజిల్ లేక వాహనాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోతున్నాయి. డీజిల్ కొరతతో నిత్యవసర వస్తువుల ధరలతో పాటు ఇతర వస్తువుల ధరలు పెరిగే అవకాశం కూడా లేకపోలేదు.

# ఆర్‌టిసి బస్సు స్టీరింగ్ పట్టిన 'బీర్ల'

యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో విజయోత్సవాలు





**ప్రజాపక్షం/యాదాద్రి :** ఆర్టీసీ కార్మికుల సమ్మె విరమణ కావడంతో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో వద్ద పండుగ వాతావరణం సంతరించుకుంది. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, 11 శాతం ఫిట్మెంట్‌కు ఆమోదం తెలపడంతో కార్మికుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఈ విజయోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వయంగా ఆర్టీసీ బస్సును నడిపి కార్మికులకు ఘనమైన సంఘీభావం ప్రకటించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గార్ల చిత్రపటాలకు కార్మికులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం ఏకంగా 50 రోజుల పాటు వీరోచిత సమ్మె చేసినా, అప్పటి పాలకులు కనీసం వారి గోడు వినలేదని, పైగా సంస్థను నష్టాల్లోకి నెట్టారని విమర్శించారు. దానికి భిన్నంగా నేడు అధికారంలో ఉన్న 'ప్రజా ప్రభుత్వం' కార్మికుల సమస్యలను అర్థం చేసుకుని, కేవలం మూడు రోజుల్లోనే చర్చలను కొలిక్కి తెచ్చి సమస్యను పరిష్కరించడం హర్షించదగ్గ విషయమన్నారు. సమ్మె కాలంలో ప్రాణాలు కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, 10 లక్షల ఆర్థిక సాయం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించడం సీఎం రేవంత్ రెడ్డి మానవీయ పాలనకు నిదర్శనమని కొనియాడారు. కార్మికుల 32 డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఉద్యోగ భద్రత విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. అనంతరం ప్రయాణ ప్రాంగణంలోని ప్రయాణికులకు మజ్జిక పంపిణీ చేసి, సమ్మె విరమణతో బస్సులు పునఃప్రారంభమయ్యాయని, ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రజలు సురక్షితంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం, కార్మికులు సమన్వయంతో పనిచేసి ఆర్టీసీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి భరత్ గౌడ్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# స్వీయ గణన విధానం ప్రతి ఒక్కరూ సద్వినియోగం

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ** : జనగణన 2027 ప్రక్రియలో భాగంగా ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు.శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో స్వీయ గణన ప్రక్రియ 26 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు నిర్వహించడం జరుగుతుందని, జనగణనను ప్రభుత్వం రెండు దశల్లో నిర్వహిస్తున్నదని మొదటి విడత మే 11 నుండి జూన్ 9 వరకు హౌస్ లిస్టింగ్ హౌస్ సెన్సెస్ ఉంటుందని, ఫిబ్రవరి 9, 2027 నుండి ఫిబ్రవరి 28, 2027 వరకు జనగణన ఉంటుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముఖ్యమైన స్వీయ గణనలో అందరూ భాగస్వాములు కావాలని,ప్రజలు తమ వివరాలను స్వయంగా అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒకరు 15 నుండి 20 నిమిషాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని,జిల్లాలో 5 లక్షల 3 వేల గృహాలు ఉన్నాయని, 3729 హౌసింగ్ బ్లాక్‌లను, 479 సర్కిల్లను ఏర్పాటు చేయడం జరిగిందని, 3179 గణకులను 531 మంది సూపర్‌వైజర్లను, 41 మంది చార్జి అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి నిర్వహిస్తున్న ఈ జనగణన పూర్తిగా డిజిటల్ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, సిపిఓ శ్రీనివాస్ నాయక్, డిపిఆర్ఓ యు. వెంకటేశ్వర్లు, హాజరయ్యారు.

## అలర్ట్ మధ్య అలసత్వం...

## సాగర్ ప్రాజెక్ట్ వద్ద భద్రతా లోపాలు...

నిబంధనలు పక్కన పెట్టిన సిబ్బంది -సాగర్ భద్రతపై సందేహాలు...

**ప్రజా పక్షం/నందికొండ:** దేశం లోనే అత్యంత కీలకమైన బహుళార్థ సాధక ప్రాజెక్టులలో ఒకటైన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ వద్ద భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. డ్యామ్ భద్రతను పర్యవేక్షించాల్సిన సిబ్బంది తమ విధులను పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే డ్యామ్ భద్రతా బాధ్యతలను నిర్వహిస్తున్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌సిబ్బంది డ్యామ్‌పై విధుల్లో ఉన్న సమయంలోనే గాలాలతో చేపల వేటకు దిగారు. డ్యామ్ రక్షణ గోడపై నుండి గాలాలు వేసి చేపలు పడుతూ ఉండటం చర్చనియాశంగా మారింది నియమ నిబంధనల ఉల్లంఘన నిబంధనల ప్రకారం, సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో 5 కిలోమీటర్ల వరకు చేపల వేటపై నిషేధం ఉంది. రక్షణ పరంగా ఇది అత్యంత కీలకమైన ప్రాంతం కావడంతో ఇక్కడ కఠినమైన ఆంక్షలు అమలులో ఉంటాయి. అయితే, రక్షణ కల్పించాల్సిన భద్రతా సిబ్బందే ఈ నిబంధనలను బేఖాతరు చేయడంపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి సాగర్ ప్రాజెక్టుకు ఉగ్రవాద ముప్పు ఉందని ఇప్పటికే ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేసినా కూడా అప్రమత్తంగా ఉండాల్సిన ఇలాంటి కీలక సమయంలో భద్రతా సిబ్బంది తమ విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం డ్యామ్ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి భద్రతా సిబ్బంది బాధ్యతారాహిత్యంపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించి, భద్రతకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.






## దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : దివ్యాంగులు తమ జీవితాన్ని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా దివ్యాంగ లబ్ధిదారులకు రెట్రో ఫిట్మెంట్ స్కూటీలను, అంగన్‌వాడీ టీచర్లకు 5జి స్మార్ట్ ఫోన్లను తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదితలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, మహిళలు ఆత్మవిశ్వాసంతో తమ స్వశక్తితో ఇంకా అభివృద్ధి చెందాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు అందించిన 5జి స్మార్ట్‌ఫోన్లతో నైపుణ్యాన్ని పెంచుకొని వాటి ద్వారా చిన్న పిల్లలకు ఆటలు, పాటలు, రైమ్స్ నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, ఆర్‌డిఓ వేణుమాధవ్, సంక్షేమ అధికారి కె. నరసింహారావు, దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముట్టినేని వీరయ్య, అధికారులు, సిడిపిఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## మేడేను జయప్రదం చేద్దాం

సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను పిలుపు




**ప్రజాపక్షం/మునుగోడు** : కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడేందుకు మే1న నిర్వహించే మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను పిలుపునిచ్చారు.శుక్రవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐటీయూసీ కార్మికుల ఆధ్వర్యంలో మేడే గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా తొలగిస్తూ, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను తీసుకువస్తోందని విమర్శించారు.నరేంద్ర మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కులను అణిచివేసే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మే 1న నిర్వహించే మేడే కార్యక్రమానికి అన్ని కార్మిక సంఘాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి బెల్లం శివయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పందుల చిన్న నరసింహ, మిల్లు హమాలి కార్మిక సంఘం నాయకులు దామ కాసిం, చందపాక యాదయ్య, ఇరికి లింగస్వామి, నాగేష్, రుగోని మారయ్య, మాలాద్రి, ఏరుకొండ నాగేష్, వెంకన్న, బొల్లు సైదులు పాల్గొన్నారు.

## సమ్మె విజయానికి అండగా నిలిచిన సిపిఐకి ఆర్‌టిసి జెఎసి కార్మికుల అభినందనలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** టిఎస్ ఆర్టీసీ జేఏసీ కార్మికుల సమ్మె విజయవంతం కావడానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు జేఏసీ నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు సీపీఐ జిల్లా కార్యాలయానికి చేరుకుని జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, సపట్టణ కార్యదర్శి కత్ర సైదిరెడ్డి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనలో సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతూ, కార్మిక వర్గానికి అండగా నిలుస్తోందని కొనియాడారు. సమ్మె సమయంలో కార్మికులకు నైతిక బలం అందించడమే కాకుండా,వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావడంలో పార్టీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.ప్రత్యేకంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమ్మె కాలంలో కార్మికుల పక్షాన నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకటయ్య, బి.నరేందర్, ఎన్ఆర్‌సీ రాజు, కె.లింగ నాయక్, యారా చంద్రయ్య, కె.కుమార్ పాల్గొన్నారు.



## డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/మోటకొండూర్** : ఆర్టీసీ సమ్మెలో భాగంగా ఆత్మహత్యకు పాల్పడిన డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తూ, అతని కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శనివారం మోటకొండూరు మండల కేంద్రంలో ముసుకు పెంటారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో జిల్లా సహయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అమరుడైన శంకర్ గౌడ్‌కు సంతాపం తెలిపి శంకర్ గౌడ్ కుటుంబానికి పగాడ సానుభూతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను విజి రాంజీగా పేరు మార్చుతూ, పథకంలో అనేక మార్పులు చేస్తూ క్రమంగా ఆ పథకం ను ఎత్తివేసే ఆలోచన చేస్తున్నదని, పాత పద్ధతిలోనే అమలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో 125 రోజులకు తగ్గకుండా పనికల్పించాలని, కూలీలు పని చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలని భారత రాజ్యాంగం కల్పించిన జీవనోపాధి కల్పన హక్కులకు సామాజిక భద్రత కల్పించాలని, ఉపాధి హామీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రేగు సిద్దయ్య, సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల కార్యవర్గ సభ్యులు ఆలేటి బాలరాజు, బోల్ల శీను, పల్లె వెంకన్న, బీరకాయల మల్లేష్, మంచాల రాధమ్మ, ఎండి శంషుద్దీన్, శనిగల భాగ్యమ్మ, నల్ల రాములు, జీవికులపల్లి పాండు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఆరు నెలల జైలుశిక్ష

**ప్రజాపక్షం/నిడమనూరు:** దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ నిడమనూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి టి స్వప్న తీర్పు చెప్పారు.కేసుకు సంబంధించి నిడమనూరు ఎస్సై యు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు మండల కేంద్రానికి చెందిన బత్తుల గణేష్ ఇంట్లో డిసెంబర్ 2017 లో కనగల్ మండలం దోరేపల్లి గ్రామానికి చెందిన మాధగోని ముఖేష్ (సురేష్ )దొంగతనానికి పాల్పడి ఆరు లక్షల 22 వేల 360 రూపాయలు అపహరించినట్లు అప్పటి నిడమనూరు ఎస్సై బి యాదయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు, శనివారం కేసు విషయంలో తూది తీర్పు ఇస్తూ నిడమనూర్ న్యాయమూర్తి టి స్వప్న నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష నాలుగువేల రూపాయల జరిమానా విధిస్తూ శనివారం తీర్పు చెప్పారు.

# ఉష్ణోగ్రతలు పైపైకి...

**వడగాలుల నివారణకు ఐఎండి మార్గదర్శకాలు విడుదల**

**న్యూఢిల్లీ :** దేశంలో అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో, వడగాలుల నివారణకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) వివరణాత్మక మార్గదర్శకాలు, సలహాలను విడుదల చేసింది. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఎక్కువసేపు నేరుగా ఎండలో ఉండకుండా ఉండటం, శరీరానికి తగినంత నీరు అందించడం, తేలికైన, గాలి ఆడే దుస్తులు ధరించడం, అధిక ఉష్ణోగ్రతలు ఉన్న సమయాల్లో శ్రమతో కూడిన బహిరంగ కార్యకలాపాలకు దూరంగా ఉండటం వంటివి వీటిలో ఉన్నాయి. పిల్లలు, వృద్ధులు, ముందునుంచే అనారోగ్య సమస్యలు ఉన్న వ్యక్తుల వంటి బలహీన వర్గాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐఎండి సూచించింది. 'వడదెబ్బ, వడఘాతము వంటి వేడి సంబంధిత అనారోగ్యాలను తగ్గించడంలో ముందస్తు అవగాహన, నివారణ చర్యలు కీలకమని వాతావరణ శాఖ నొక్కి చెప్పింది' అని ఒక అధికారి తెలిపారు. తన తాజా అంచనాలో, వాయువ్య, మధ్య, ద్వీపకల్ప భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉన్నాయని, రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని ఐఎండి పేర్కొంది. అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఇది దేశంలోని కొన్ని ప్రాంతాలలో వడగాలి ఒత్తిడి పరిస్థితి ఏర్పడుతోందని సూచిస్తోంది. రాబోయే రోజుల్లో జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో వడగాలుల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) సూచించినట్లు ఆ అధికారి తెలిపారు. తీరప్రాంత, తూర్పు ప్రాంతాలలో వేడి, తేమతో కూడిన పరిస్థితులు ఉండగా, ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో రాత్రిపూట వెచ్చని వాతావరణం ఉండే అవకాశం ఉంది. ఏప్రిల్ 27 వరకు వాయువ్య భారతదేశంలో గరిష్ట ఉష్ణోగ్రతలలో గణనీయమైన మార్పు ఉండదని, ఆ తర్వాత క్రమంగా తగ్గుతుందని, అయితే మధ్య, ఇతర ప్రాంతాలలో ఈ అంచనా కాలంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగి, ఆపై తగ్గుముఖం పట్టవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసిందని అధికారి తెలిపారు.

# యుపిలో బాలికలకు రక్షణేది?

**ఘాజీపూర్‌లో బాలికపై హత్యాచార ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి : రాహుల్‌గాంధీ**



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో బాలికలకు రక్షణ లేకుండా పోయిందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఘాజీపూర్‌లో విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన బాలికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి తక్షణ న్యాయం జరగాలని కోరారు. తమ కుమార్తెపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించుకోవడానికి కూడా తల్లిదండ్రులు వేడుకోవలసిన దేశంలో, రాష్ట్రంలో అధికారంలో కొనసాగడానికి ప్రభుత్వానికి నైతిక హక్కు లేదని ఎక్స్‌లో పేర్కొన్నారు. దోషులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి రక్షణ కల్పించాలని కూడా రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. 'ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో, విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన కుమార్తెపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా కుటుంబాన్ని బెదిరింపులు, హింసకు గురిచేశారు. హత్రాస్, కతువా, ఉన్నావ్, ఇప్పుడు ఘాజీపూర్.. ఇది ఒక పద్ధతిగా కనిపిస్తోంది. న్యాయం కోసం ఎదురుచూస్తూ మణిపూర్‌కు చెందిన కుమార్తె తుది శ్వాస విడిచింది' అని ఆయన ఎక్స్‌లో హిందీలో పెట్టిన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రతిసారీ అదే ముఖం, బాధితులు దళితులు, వెనుకబడినవారు, గిరిజనులు పేదవారే బాధితులు ఉంటున్నారని ఆయన అన్నారు. 'ప్రతిసారీ అదే నిజం— నేరస్థులకు రక్షణ, బాధితులపై వేధింపులు. అధికారంలో ఉండి మాట్లాడాల్సిన వారి నుంచి ప్రతిసారీ అదే నిశ్శబ్దం. తమ కుమార్తెపై కనీసం ఒక ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించుకోవడానికి కూడా తల్లిదండ్రులు వేడుకోవలసిన దేశంలో, రాష్ట్రంలో, ఆ దేశ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదు' అని గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దోషులైన పోలీసు అధికారులపై చర్య తీసుకోవాలని, బాధితుల కుటుంబానికి రక్షణ కల్పించాలని ఉన్నత స్థాయి విచారణ జరగాలని, తక్షణమే న్యాయం జరగాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లను ప్రశ్నిస్తూ, 'మోదీ జీ, ముఖ్యమంత్రి జీ, సమాధానం ఇవ్వండి.. మీ పాలనలో కుమార్తెలు ఎందుకు ఇంత అభద్రతగా ఉన్నారు? అని నిలదీశారు. ఇలాంటి పరిస్థితుల్లో న్యాయం కోసం యాచించరు, దాన్ని లాక్కుంటారు.. తాము దాన్ని లాక్కుంటాం అని హెచ్చరించారు. ఘాజీపూర్‌లో ఒక బాలిక హత్య కేసులో కేసు పెట్టడానికి విముఖత చూపడం, ఆ తర్వాత బాధితురాలి కుటుంబానికి బెదిరింపులు, శక్తివంతులు సృష్టించిన గందరగోళం వంటివి ఆ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పరాకాష్టకు చేరాయని చూపిస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా అన్నారు. 'బిజెపి పాలనలో ఇది ఇప్పుడు అలిఖిత చట్టంగా మారింది: ఏ మహిళ అయినా అఘాయిత్యానికి గురైనప్పుడు, బాధితురాలినే మరింత వేధిస్తారు' అని ఆమె మండిపడ్డారు. మహిళల గురించి ప్రధానమంత్రి చేసే గొప్ప ప్రకటనలు కేవలం ప్రదర్శన మాత్రమే అని ఆరోపించారు. ఉన్నావ్, హత్రాస్, ప్రయాగ్‌రాజ్, లేదా ఘాజీపూర్.. ఎక్కడైతే మహిళలు అన్యాయానికి గురయ్యారో, అక్కడ బిజెపి తన పూర్తి శక్తిని ఉపయోగించి బాధితురాలికి వ్యతిరేకంగా అణచివేసేవారి పక్షాన నిలిచిందని, దేశవ్యాప్తంగా మహిళలు ఈ చీకటి పాలనను చూస్తున్నారని ప్రియాంకా గాంధీ ఎక్స్‌లో హిందీలో పెట్టిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈనెల 15న ఘాజీపూర్ జిల్లాలోని కరందా ప్రాంతంలో ఒక యువతి మృతదేహం లభ్యం కాగా, ఆమెపై లైంగిక దాడి చేసి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగా, బంధువులు, స్థానికులు న్యాయం కోసం గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# నీతి ఆయోగ్ పునర్‌వ్యవస్థీకరణ

**వైస్ చైర్మన్‌గా అశోక్ కుమార్ లాహిరి**



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్‌ను పునర్వ్యవస్థీకరించింది. అశోక్ కుమార్ లాహిరిని వైస్ చైర్మన్‌గా, ఆర్థికవేత్త కె.వి. రాజు, ఎయిమ్స్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్, శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరండికర్ సహా ఐదుగురిని పూర్తికాల సభ్యులుగా నియమించింది. లాహిరికి, శాస్త్రవేత్త గోబర్ధన్ దాస్, మాజీ క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా సహా కొత్త పూర్తికాల సభ్యులకు ఫలవంతమైన, ప్రభావవంతమైన పదవీకాలం ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. భారత విధాన రూపకల్పన వ్యవస్థలో నీతి ఆయోగ్ ఒక కీలకమైన స్తంభంగా ఆవిర్భవించిందని, ఇది సహకార సమాఖ్యవాదాన్ని పెంపొందిస్తూ, సంస్కరణలను ముందుకు తీసుకెళ్తూ, జీవన సౌలభ్యాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. ఇది అన్ని రంగాలలో ఆవిష్కరణలకు, దీర్ఘకాలిక వ్యూహాత్మక ఆలోచనలకు ఒక చైతన్యవంతమైన వేదికగా పనిచేస్తుందని ఆయన అన్నారు. అయితే ప్రధానమంత్రి నీతి ఆయోగ్ చైర్మన్‌గా ఉన్నారు. తన నియామకం అనంతరం లాహిరి శనివారం ప్రధానమంత్రి మోదీని కలిశారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ఎమ్మెల్యే అయిన ఆయన, ప్రభుత్వానికి మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. భారత రాష్ట్రపతి, 15వ ఆర్థిక సంఘంలో సభ్యుడు.

# రైతులకు రుణమాఫీ చేస్తాం

- 24 గంటలలోపే వారి పంటలకు చెల్లింపు చేస్తాం
- ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ హామీ



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో 2027లో తమ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, చెరకు రైతులకు వారి పంటకు 24 గంటల్లోపే చెల్లింపులు అందుతాయని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ హామీనిచ్చారు. చట్టం ద్వారా రుణ మాఫీలతో పాటు, పంటల బీమా, ఉచిత నీటిపారుదల, రైతులకు హామీతో కూడిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పిస్తామన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరైన ప్రాంతీయ వ్యవసాయ సదస్సు జరిగిన మరుసటి రోజు, లక్నోలో పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో అఖిలేష్ మాట్లాడారు. ప్రతిపాదిత రూ.15,000 కోట్ల రైతు రివాల్వింగ్ ఫండ్‌తో సహా రైతుల కోసం చేయనున్న పలు చర్యలను యాదవ్ వివరించారు. చెరకు చెల్లింపులు 24 గంటల్లోపే జరుగుతాయని, రైతుకు రసీదు అందిన వెంటనే, డబ్బు నేరుగా వారి ఖాతాల్లోకి బదిలీ చేయబడుతుందని మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపాదిత రూ.15,000 కోట్ల నిధితో రైతులు చెల్లింపుల కోసం వేచి ఉండాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. ప్రభుత్వం పారిశ్రామికవేత్తల నుంచి బకాయిలను వసూలు చేస్తాదని, దీంతో రైతులు నష్టపోరన్నారు. ఎస్‌పి ప్రభుత్వ హయాంలో రైతులకు అందించిన ప్రయోజనాలను ప్రస్తుత ప్రభుత్వం ఉపసంహరించుకుందని ఆరోపించారు. ఎక్స్‌ప్రెస్‌వేల వెంబడి మండీలను అభివృద్ధి చేస్తున్నారని, అభివృద్ధి వేగం స్తంభించిపోయిందని, ఇప్పుడు రైతు బజార్లను కూడా నిర్మించడం లేదని విమర్శించారు. లక్నోలోని రైతు సౌకర్యాలను దుర్వినియోగం చేశారని, రైతు బజార్లలో కేఫ్‌లు వెలిశాయని, రైతుల కోసం ఉద్దేశించిన గృహాలను వాణిజ్య అవసరాలకు అప్పగించారని ఆయన ఆరోపించారు. పాలక పార్టీని లక్ష్యంగా చేసుకుంటూ 'రైతులపై రుణ భారం పెరుగుతోంది. ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరలు పెరిగిపోవడంతో వ్యవసాయం లాభదాయకం కాకుండా పోయింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఇది దేశీయ రైతులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది' అని అఖిలేష్ ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి, మెరుగైన విత్తనాల కోసం రైతులను ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలతో అనుసంధానించడానికి ప్రయత్నాలు చేస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని సవాలు చేస్తూ 'స్మార్ట్ సిటీలను నిర్మించగలిగినప్పుడు, స్మార్ట్ గ్రామాలను ఎందుకు నిర్మించలేము? ఎస్పీ ప్రభుత్వం ఈ దిశగా పనిచేస్తుంది' అని అన్నారు.

# ఎలుకలు నాశనం చేశాయా?

**అవినీతి కేసులో స్వాధీనం చేసుకున్న కరెన్సీ నోట్లను...**

**'సుప్రీంకోర్టు' విస్మయం**

**సంబంధిత రాష్ట్రానికి ఇది ఒక 'భారీ ఆదాయ నష్టం'అని వ్యాఖ్య**




**న్యూఢిల్లీ :** బిహార్‌లో నమోదైన ఒక అవినీతి కేసులో నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కరెన్సీ నోట్లను ఎలుకలు నాశనం చేయడంపై అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ ఇటువంటి కరెన్సీనోట్లు సురక్షితమైన ప్రదేశంలో లేకపోవడం వల్ల ఎన్ని కరెన్సీ నోట్లు నశించిపోతున్నాయోనని ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ దీనిని రాష్ట్రానికి 'భారీ ఆదాయ నష్టంగా' అభివర్ణించింది. అవినీతి కేసులో దోషిగా నిర్ధారించబడి నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరుపుతున్నప్పుడు ఈ విషయం ధర్మాసనం ముందు తలెత్తింది. 2014 సంవత్సరంలో ఆ సమయంలో బాలల అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న మహిళ ఫిర్యాదుదారు నుంచి రూ.10,000 లంచం డిమాండ్ చేసి, స్వీకరించిందనే ఆరోపణలు వచ్చాయి. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ లొంగిపోవడం నుంచి ఆమెకు మినహాయింపునిచ్చిన సుప్రీంకోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేసి, పాట్నా హైకోర్టు విధించిన శిక్షను నిలిపివేసింది. 'మల్ఖానా' పరిస్థితి సరిగా లేకపోవడం వల్ల ఎలుకలు, ఇతర కీటకాలు స్వాధీనం చేసుకున్న కరెన్సీ నోట్లను నాశనం చేశాయని గత ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు ఇచ్చిన తీర్పులోని ఒక పేరాలో పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'మేం విస్మరించకూడని ఒక విషయాన్ని కూడా గమనించాం' అని ధర్మాసనం తెలియజేసింది. ఏప్రిల్ 24న ఇచ్చిన ఉత్తర్వులో ధర్మాసనం ఇలా పేర్కొంది. 'ఎలుకల వల్ల కరెన్సీ నోట్లు నాశనం అవడం మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ రకమైన నేరాలలో స్వాధీనం చేసుకున్న ఇలాంటి కరెన్సీ నోట్లలో ఎన్ని నాశనం అవుతున్నాయోనని మేం ఆశ్చర్యపోతున్నాం. ఎందుకంటే వాటిని సురక్షితమైన ప్రదేశంలో ఉంచరు. దీనివల్ల రాష్ట్రానికి భారీ ఆదాయ నష్టం వాటిల్లుతుంది. కరెన్సీ నోట్లను ధ్వంసం చేయడంపై ఇచ్చిన వివరణ కూడా ఏమాత్రం విశ్వాసం కలిగించడం లేదు' అని ధర్మాసనం పేర్కొంది. ప్రధాన విషయం విచారణకు వచ్చినప్పుడు ఈ సమస్యను పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. ఈ కేసులో తనను దోషిగా నిర్ధారిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ట్రయల్‌కోర్టు పిటిషనర్‌ను అన్ని ఆరోపణల నుండి నిర్దోషిగా విడుదల చేసిందని, దాని తర్వాత హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారని ధర్మాసనం పేర్కొంది.

# మళ్లీ మమతే సిఎం

**ఆర్‌జెడి నేత తేజస్వీ ఆశాభావం**



**కోల్‌కతా :** మమతా బెనర్జీ వరుసగా నాలుగోసారి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి అవుతారని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఉత్తర 24 పరగణాల జిల్లాలో టిఎంసి నిర్వహించిన రోడ్‌షోలలో పాల్గొన్నారు. శుక్రవారం కోల్‌కతా చేరుకున్న యాదవ్, జగద్దల్, భట్‌పారా, ఖర్దహా అసెంబ్లీ నియోజకవర్గాలలో వరుసగా రోడ్‌షో లలో పాల్గొన్నారు. 'ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బ్యారక్‌పూర్ లోక్‌సభ ప్రాంతం పరిధిలో ఉన్న భట్‌పారా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిఎంసి అభ్యర్థి అమిత్ గుప్తాకు, జగద్దల్ నుంచి టిఎంసి అభ్యర్థి సోమనాథ్ శ్యామ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించినట్లు తేజస్వీ ఎక్స్‌లో పోస్టు చేశారు. టిఎంసి అభ్యర్థి దేవ్దీప్ పురోహిత్‌కు మద్దతుగా ఖరదాహా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న అనంతరం, ఆర్‌జెడి నాయకుడు మాట్లాడుతూ 'ప్రజల అచంచలమైన ప్రేమ, దృఢమైన విశ్వాసం, అఖండమైన ప్రజా మద్దతు చూస్తుంటే, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి వరుసగా నాలుగోసారి భారీ మెజారిటీతో విజయాన్ని అందించాలని బెంగాల్ ప్రజలు నిశ్చయించుకున్నారని స్పష్టంగా తెలుస్తోంది' అని అన్నారు. కోల్‌కతాకు చేరుకున్న తర్వాత, ఆప్ నుండి బిజెపిలోకి రాఘవ్ చాధా ఫిరాయించడంపై వ్యాఖ్యానించమని యాదవ్‌ను అడగ్గా, 'కొంతమంది రాజీ పడతారు. ఆయన భయంతోనో లేదా దురాశతోనో బిజెపిలో చేరి ఉంటారు' అని బదులిచ్చారు.

# పార్టీ సరైన మార్గంలో నడిస్తే.. ఎంపిలు ఆప్‌ను వీడేవారు కాదు

**సామాజిక కార్యకర్త అన్నా హజారే**



**ముంబయి :** ఆప్ 'సరైన' మార్గంలో నడిచి ఉంటే, రాఘవ్ చద్దా, ఆ పార్టీకి చెందిన మరో ఆరుగురు రాజ్యసభ సభ్యులు పార్టీని వీడి ఉండేవారు కాదని సామాజిక కార్యకర్త అన్నా హజారే పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్‌కు) భారీ షాక్ తగలడంపై సామాజిక కార్యకర్త స్పందించారు. ప్రజాస్వామ్య ంలో ప్రతి ఒక్కరికీ తమదైన అభిప్రాయాన్ని కలిగి ఉండే హక్కు ఉంటుందని, వారు (చద్దా, ఇతరు లు) ఏదో ఒక ఇబ్బందిని ఎదుర్కొని ఉంటారు, అ ందుకే వారు పార్టీని విడిచిపెట్టారని మహారాష్ట్రలో ని అహిల్యానగర్ జిల్లాలో విలేకరులతో మాట్లాడు తూ హజారే పేర్కొన్నారు. ఆప్ రాజ్యసభ సభ్యులు రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్ శుక్రవారం ఢిల్లీలో సంయుక్త విలేకరుల సమావేశం నిర్వహించి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆ పార్టీని వీడి బిజెపిలో చేరనున్నట్లు ప్రకటించారు. ఆప్ రాజ్యసభ సభ్యులలో దాదాపు మూడింట రెండు వంతుల మంది పార్టీని వీడారని, వారు ఒక ప్రత్యేక వర్గ ంగా పనిచేస్తారని చద్దా పేర్కొన్నారు. 'ఇది వారి (ఆప్ నాయకత్వం యొక్క) తప్పే. ఆ పార్టీ గనుక సరైన పద్ధతిలో నడిచి ఉంటే, వారు పార్టీని విడిచిపెట్టి ఉండేవారు కాదు' అని హజారే అన్నారు. ఆ ప్‌లో ఉన్నప్పుడు చద్దా, ఇతరులు కచ్చితంగా కొ న్ని ఇబ్బందులను ఎదుర్కొని ఉంటారని, అందుకే వారు పార్టీని వీడారని హజారే పునరుద్ఘాటించారు. వారు ఆప్‌ను వీడటానికి ఏదో ఒక కారణం క చ్చితంగా ఉండి ఉంటుందని, ప్రజాస్వామ్యంలో, ఎక్కడ కొనసాగాలి, ఎక్కడ విడిచిపెట్టాలి అనే విషయంపై ప్రతి వ్యక్తికీ ఒక అభిప్రాయం ఉంటుందన్నారు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా లభించిన ఊపుతో 2012లో ఆవిర్భవించిన కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీకి, చద్దా నేతృత్వంలో జరుగుతున్న ఈ వలస ఒక గణనీయమైన ఎదురుదెబ్బగా పరిణమించింది.

# ఐదుగురు పోలీసులపై ఇసి సస్పెన్షన్ వేటు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాలలో ఐదుగురు పోలీసు అధికారిపై ఎలక్షన్ కమిషన్ సస్పెన్షన్ వేటు వేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తీవ్రమైన దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని, తటస్థంగా వ్యవహరించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, డైమండ్ హార్బర్‌లోని ఐదుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసి, వారిపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. పోలీసు సిబ్బంది ప్రవర్తనపై పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ చర్య తీసుకున్నట్లు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి పంపిన ఒక లేఖలో పేర్కొంది. సస్పెండ్ అయిన అధికారులలో అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సందీప్ గరాయ్, ఎస్‌డిపిఒ సజల్ మండల్, డైమండ్ హార్బర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జ్ మౌసమ్ చక్రవర్తి, ఫల్తా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జ్ అజయ్ బాగ్, ఉస్తి పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్‌ఛార్జ్ సుభేచ్ఛా బాగ్ ఉన్నారు. 'ఈ విషయానికి సంబంధించిన వాస్తవాలు, పరిస్థితులను పరిశీలించిన మీదట, 2026 పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల సమయంలో తీవ్రమైన దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు, తటస్థతను పాటించడంలో విఫలమైనందుకు ఈ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, వారిపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని కమిషన్ ఆదేశిస్తోంది' అని ఇసి తన ఉత్తర్వులో పేర్కొంది. ఐపిఎస్ అధికారి అయిన అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గరాయ్‌పై హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని ఆయన కేడర్ నియంత్రణ అధికార సంస్థకు నివేదిక పంపాలని కూడా ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే ఉత్తర్వులో, ఎన్నికల సంబంధిత విధులలో కింది స్థాయి అధికారుల మధ్య 'క్రమశిక్షణ, నిష్పక్షపాతాన్ని నిర్ధారించడంలో విఫలమైనందుకు' డైమండ్ హార్బర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇషానీ పాల్‌కు హెచ్చరిక జారీ చేయాలని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

# హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసిన షాపై కేసు వేస్తాం : మమతాబెనర్జీ



**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లో హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తాము చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నామని ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అన్నారు. కేంద్ర హోంమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదని ఆమె అన్నారు. హోంమంత్రి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవిగా ఉన్నాయని విమర్శించారు. అలాంటి వ్యాఖ్యలతో బెంగాల్‌లో గెలువాలనుకుంటే ఎప్పటికీ గెలువలేరని స్పష్టంచేశారు. బెంగాల్ ప్రజలు అలాంటి వ్యాఖ్యలను ఏమాత్రం అంగీకరించరని చెప్పారు. హుగ్లీలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో తాబెనర్జీ ప్రసంగించారు. ఈ సందర్భంగా శుక్రవారం కేంద్రహోంమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బెంగాల్‌లోని టిఎంసి గూండాలను తలకిందులుగా వేలాడదీస్తామని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను మమత తీవ్రంగా తప్పుపట్టారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా పశ్చిమబెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 23న తొలి విడత ఎన్నికల పోలింగ్ పూర్తయ్యింది. ఏప్రిల్ 29న రెండో విడత పోలింగ్ జరుగనుంది.

# దేశంలో అధిక ఉష్ణోగ్రతల మధ్య... రికార్డు స్థాయిలో 252.07 గిగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్

- పెరిగిన ఏసీలు, డెసర్ట్ కూలర్లు, శీతలీకరణ పరికరాల వాడకం
- విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశంలో నానాటికీ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తీవ్రతరం అవుతున్న వేడిగాలుల కారణంగా ఏసీలు, ఎడారి (డెసర్ట్) కూలర్ల వంటి శీతలీకరణ పరికరాల వాడకం పెరగడంతో దేశంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ శుక్రవారం 252.07 గిగా వాట్ల (జిడబ్ల్యు)కు చేరింది. విద్యుత్ మంత్రిత్వ శాఖ తాజా గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. 2024 మేలో 250 జిడబ్ల్యు గరిష్ఠ విద్యుత్ డిమాండ్ అత్యధికంగా నమోదు అయ్యింది. దేశంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ( ఒక శతాబ్దంలో అత్యధిక సరఫరా) ఏప్రిల్ 24న 252. 07 గిగావాట్లు నమోదైంది. దీనిని అల్ టైమ్ గరిష్ఠంగా అధికారులు చెబుతున్నారు. 2026 ఏప్రిల్ 23న నమోదైన 240.12గిగా వాట్ల కంటే ఇది ఎక్కువ అని విద్యుత్ మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. ఏప్రిల్ 22న అత్యధిక విద్యుత్ సరఫరా 239.70గిగా వాట్లుగా నమోదు అయ్యింది. విద్యుత్ మంత్రిత్వ శాఖ గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేసింది. ఈ ఏడాది వేసవికాలంలో ఒక రోజులో అత్యధికంగా 270 గిగా వాట్ల సరఫరా జరిగింది. తీర్చబడిన వాస్తవ డిమాండ్ అంచనా కంటే చాలా తక్కువగా ఉంది. గత సంవత్సరం వేసవికాలంలో 2025 జూన్‌లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 242.77 జిడబ్ల్యుగా నమోదైంది. ఈ నెల మొదటి పక్షం రోజుల్లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 2025 ఏప్రిల్‌లో నమోదైన 235.32 గిగా వాట్ల కంటే తక్కువగా ఉంది. దేశంలో పెరుగుతోన్న ఉష్ణోగ్రతలను తట్టుకోవడానికి గృహ, వాణిజ్య వినియోగదారులు ఎయిర్ కండిషనర్లు, ఎయిర్‌కూలర్లు, ఇతర ఉపకరణాలను తరచుగా ఉపయోగించడం వల్ల వడగాలుల తీవ్రత పెరిగి విద్యుత్ డిమాండ్, వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకారం ఈ వారాంతం వరకు వాయవ్య, మధ్య తూర్పు భారతదేశంలోని చాలా ప్రాంతాలలో వడగాలుల పరిస్థితులు కొనసాగుతాయి. ఈసారి వేసవి తీవ్రంగా ఉంటుందని ఐఎండి అంచనా వేసిందని, దాని ప్రభావం ఇప్పటి నుంచి ముఖ్యంగా మే, జూన్ నెలల్లో కనిపిస్తుందని నిపుణులు తెలిపారు. 2024 మేలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారుగా గిగావాట్లలో ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకుంది. అంతకంటే ముందు సర్వకాలిక గరిష్ఠ డిమాండ్ 2023 సెప్టెంబరులో 243.27 గిగా వాట్లుగా ఉంది. గత వేసవి కాలంలో (2025 ఏప్రిల్ నుండి) జూన్‌లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 242.77 గిగా వాట్లకు చేరుకుంది. కానీ ప్రభుత్వ అంచనా అయిన 277 గిగా వాట్ల కంటే తక్కువగానే ఉంది.

# బిజెపి వాషింగ్ మెషిన్ తిరిగొచ్చింది



**న్యూఢిల్లీ :** బిజెపి వాషింగ్ మెషిన్ వ్యాఖ్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఏడుగురు ఆప్ ఎంపిలు బిజెపిలో ఫిరాయించడంపై కాంగ్రెస్ స్పందిస్తూ మోదీ వాషింగ్ పౌడర్‌తో పాటు బిజెపి వాషింగ్ మెషీన్ కూడా తిరిగి వచ్చిందని ఎద్దేవా చేసింది. కేసులు ఎదుర్కొంటున్న వివిధ ఇతర పార్టీల నాయకులను బిజెపిలో చేర్చుకుని, వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తోందని ఆరోపించింది. పార్టీని వీడిన ఏడుగురు ఆప్ ఎంపిలలో ఒకరైన అశోక్ మిట్టల్, కొద్ది రోజుల క్రితమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులను ఎదుర్కొన్నారు. 'మోదీ వాషింగ్ పౌడర్‌తో పాటు బిజెపి వాషింగ్ మెషీన్ కూడా తిరిగి వచ్చింది. సద్గుణం, నిజాయితీ, సిద్ధాంతాలకు ప్రతీకలుగా తమను తాము ప్రదర్శించుకున్న వారు దారుణంగా బట్టబయలయ్యారు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్ బ్లాగ్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

# గణితంలో దిట్ట... శ్రీనివాస రామానుజన్



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దిగ్గజ గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్, భారతదేశం కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత గణిత శిఖరం. గొప్ప గణితశాస్త్ర ధ్రువతారలుగా ప్రపంచంలో నిలిచిన వరాహమిహిరుడు, ఆర్యభట్ (మొదటి భాస్కరుడు), భాస్కరుడు, బ్రహ్మగుప్తుడు, ఐన్‌స్టీన్ చేత శహభాష్ అనిపించుకున్న సత్యేంద్రుడు, కాప్రేకర్, జె.బి.ఎస్.హాల్డేన్, అయిలర్, గాస్, జాకోబిల సరసన నిలిచిన మహా మేధావి శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్. ఆయన అనారోగ్యాన్నీ మరణాన్నీ సహితం లెక్కచేయకుండా గణితమే జీవితంగా చరమాంకం వరకు గడిపాడు. లెక్కల్లో కొత్త సూత్రాలను నేర్పాడు. చిత్తు కాగితాల ను కూడా ఎంతో జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే సర్వస్వంగా బతికిన గొప్ప ఆధునిక గణితశాస్త్రవేత్త. సున్నను సున్నతో భాగిస్తే వచ్చేది అనంతం (ఇన్ఫినిటి) అని మొదటిసారిగా చెప్పిన భాస్కరుని స్ఫూర్తి పదేళ్ళ వయసులోనే ఆయనను అపార గణిత పరిశోధనల బాట పట్టించింది.

రామానుజన్ తిండి గడవని నిరుపేద కుటుంబంలో పుట్టాడు. సనాతన సంప్రదాయం, సంస్కృతీ, కట్టుబాట్లను పాటించే కుటుంబం. తమిళనాడులోని 'కుంభకోణం' అనే పట్టణానికి సమీపంలో ఉన్న 'ఈరోడ్' అనే గ్రామంలో 1887 డిసెంబర్ 22న అమ్మమ్మ వారి ఇంట్లో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు కోమల టమ్మాళ్‌కే. శ్రీనివాస అయ్యంగార్. రామానుజన్‌కు 1889 డిసెంబర్లో మశూచి వ్యాధి సోకింది, ఆ రోజుల్లో ఇది భయంకర ప్రాణాంతక వ్యాధి. అయితే ఈ వ్యాధి నుంచి ఆయన అదృష్టవశాత్తు క్రమంగా కోలుకున్నాడు.

15 ఏళ్ళలో.... 6000 సిద్ధాంతాలకు నిరూపణలు: 10వ తరగతి చదివే రోజుల్లో అతడు బీజ గణితం, త్రికోణమితి, కలన గణితం, వైశ్లేషిక రేఖా గణితం మొదలైన వాటిని అధ్యయనం చేశాడు. 13 ఏళ్ళ వయసులోనే 'లోని' రూపొందించిన 'ట్రిగ్నమెట్రి' సమస్యలను అతి సులభంగా పరిష్కరించాడు. 15 ఏళ్ళ వయసులో 'జార్జ్ స్ట్యూచ్ సిడ్జ్వోర్' రూపొందించిన 'సినాప్సిస్ ఆఫ్ ఎలిమెంటరి రిజల్ట్స్ ఇన్ 'ప్యూర్ అండ్ అప్లైడ్ మ్యాథమెటిక్స్' అనే గ్రంథంలోని దాదాపు 6000 సిద్ధాంతాలకు నిరూపణలు తెలిపాడు. అత్యంత ప్రతిభకలిగిన విద్యార్థి అయిన రామానుజన్ ఒకసారి తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఒక సంఖ్యను అదే సంఖ్యతో భాగిస్తే ఒకటి వస్తుందని చెప్పాడు. అప్పుడు రామానుజన్ సున్నాను సున్నతో భాగించినపుడు ఒకటి ఎలా వస్తుందని ప్రశ్నించాడు.

ఈయన గణితంలో ప్రదర్శిస్తున్న అపార ప్రజ్ఞను, అమోఘ మేధాసంపత్తిని గుర్తించి ఏ డిగ్రీలు లేకపోయినా మద్రాసు విశ్వవిద్యాలయం వారు 1903లో స్కాలర్షిప్పు ఇచ్చారు. ఈ క్రమంలో 'ఇండియన్ మ్యాథమెటికల్ సొసైటీ' స్థాపకుడైన రామస్వామి అయ్యర్ మద్రాసు డిప్యూటి కలెక్టర్ నుంచి కూడా ఉపకార వేతనాన్ని ఇప్పించాడు.

కాగా మితిమీరిన లెక్కల అధ్యయనం, పరిశీలన, పరిశోధనల వల్ల వేరే పనిమీద ధ్యాస పెట్టక పోవడంతో కొడుకు పిచ్చివాడవుతాడని తండ్రి అందోళన చెందాడు.... ఈ క్రమంలో 22 ఏళ్ళ వయసులో రామానుజన్‌కు 1909 జులై 14న 9 ఏళ్ళ జానకి అమ్మాళ్‌తో వివాహం జరిపించారు తల్లిదండ్రులు.

**ఇంగ్లాండ్‌కు ఆహ్వానం:** 'నేవెల్లీ' అనే గణిత శాస్త్రజ్ఞుడు రామానుజన్ ఇంగ్లాండ్ వెళ్ళడం వలన హార్డీ పరిశోధనలకు ఎలా ఉ పయోగ పడతాడో వివరించి రామానుజన్‌ను ఇంగ్లాండ్ వెళ్ళడానికి ఒప్పించాడు. నేవెల్లీ ప్రోత్సాహంతో మద్రాసు విశ్వవిద్యాలయం 1914లో రామానుజన్ ఇంగ్లాండ్ వెళ్ళేందుకు 250 పౌండ్ల ఉపకార వేతనంతో పాటు ఉచిత ప్రయాణపు ఏర్పాట్లను చేసింది.... ఇలా 1914 మార్చి 17న ఇంగ్లాండు వెళ్ళిన రామానుజన్‌కు అక్కడ ట్రినిటి కళాశాలలో మరో 50 పౌన్ల ఉపకార వేతనం ఇవ్వడంతో ఆయనకు డబ్బు గురించి ఆలోచించే పరిస్థితే లేకుండా పోయింది. ఇలా ప్రతికూల పరిస్థితిలో సహితం రామానుజన్ 30కి పైగా పరిశోధనా వ్యాసాలు రాశాడు. వీటిని అప్పట్లో ఇంగ్లాండ్‌లోని ప్రముఖ పత్రికలు ప్రచురించడంతో వాటిని పరిశీలించిన ఆ దేశ మేధావులు రామానుజన్ అపార గణిత ప్రతిభను వేనోళ్ళ పొగిడారట.... 1918 ఫిబ్రవరి 28న రామానుజన్ను 'ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ'గా ఎన్నుకున్నారు. ఇదే సంవత్సరం అక్టోబర్లో ఈయనను 'ఫెలో ఆఫ్ ది ట్రినిటి కాలేజ్'గా ఎన్నుకొని గౌరవించారు. ఇది అరుదైన విషయం. ప్రపంచంలో ఈ గౌరవాన్ని పొందిన మొదటి భారతీయుడు రామానుజన్ అనీ, అతన్ని ఎంతగానో ప్రపంచ మేధావులు అభినందించారు.

**యూలర్, జాకోబిల కోవలో :** ఈయన బీజ గణితంలో సాధించిన సమీకరణాల వల్ల 'యూలర్', 'జాకోబి' వంటి గొప్ప దిగ్గజ గణితశాస్త్రజ్ఞుల కోవలో చేరాడని కేంబ్రిడ్జిలో ఎంతో మంది రామానుజన్ ప్రజ్ఞపై మహోన్నతంగా, గొప్పగా చెప్పుకునేవారు.

రామానుజన్‌లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన 'హార్డీ'.... అసలు తాను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజన్ మహనీయుని కనుగొని ఆదుకోవడమేనని వ్యాఖ్యానించారు. ఇంకా ఆయన ఇలా అన్నాడు. గణిత మేధావులను వారి మేధో సంపత్తి ఆధారంగా వర్గీకరిస్తే తనకు (హార్డీకి) 25 మార్కులు, ప్రొఫెసర్ లిటిల్వుడ్‌కు 30 మార్కులు, హిల్బర్డుకు 80 మార్కులు, మన రామానుజన్‌కు 100 మార్కులు ఇవ్వవచ్చునని అభిప్రాయపడ్డారు. ఇది రామానుజన్ ఎంతటి తారా స్థాయికి ఎదిగాడో, ఎంతటి ప్రతిభా పాటవాలు కలిగి ఉన్నాడో.... అతని శిఖరాయమాన మహోన్నత స్థానం తెలుపుతూ ఉంది. ఇంగ్లాండ్‌లో రామానుజన్ 6 ఏళ్ళపాటు కఠోరమైన శ్రమ చేసి 32 పరిశోధనా పత్రాలు సమర్పించాడు. ఇతని పరిశోధనలు అన్ని సంఖ్యావాదానికి సంబంధించినవి.

**అవసాన దశ:** క్షయ ముదిరి చికిత్సకు ఎంతకూ నయంకాకపోవడంతో రామానుజన్.. మృత్యువు దరిచేరి తనను కబళిస్తుందని... తన అవసాన దశ సమీపించిందని గ్రహించాడు. భారతమాత ఒడిలో చేరడానికి, ఆ తల్లి కంఠాన మణిహారమై మహోజ్వలంగా శాశ్వతంగా ప్రకాశించడానికి ఇంగ్లాండ్ వదిలి తన స్వదేశానికి (భారతదేశానికి) బయలుదేరాడు శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్. 1920 ఏప్రిల్ 26వ తేదీన కుంభకోణం (మద్రాస్)లో ఆయన తన 33వ ఏట తిరిగిరాని లోకాలకు తరలిపోయాడు....

జాతీయ గణితశాస్త్ర దినోత్సవం: తన జీవితాన్ని గణితశాస్త్రానికి అంకితం చేసిన ఆయన విశేష సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 1962లో రామానుజన్ 75వ జయంతినాడు స్మారక తపాళా బిళ్లను విడుదల చేసింది. అలాగే డిసెంబర్ 22 ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని 'జాతీయ గణితశాస్త్ర దినోత్సవం' (ఇండియన్ మ్యాథమెటిక్స్ డే)గా ప్రకటించింది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఇతని విజయ పరంపరలకు గుర్తుగా డిసెంబర్ 22ను 'రాష్ట్ర సాంకేతిక దినోత్సవం'గా ప్రకటించి ఏటా ఘన నివాళులతో నిర్వహిస్తోంది.

**రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ :** మద్రాసు విశ్వవిద్యాలయం రామానుజన్ గౌరవార్థం ఆయన పేరిట ఒక స్మారక అవార్డును ఏర్పాటు చేసి... అలాగే రామానుజన్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పింది.

*(ఏప్రిల్ 26 వర్ధంతి సందర్భంగా సంస్మరణ..)*

**తాళ్ళపల్లి యాదగిరి గౌడ్,** 9949789939

# కవిత కొత్త టిఆర్ఎస్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమ సారథి, బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుని హోదా అనుభవిస్తున్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కవిత, ముందుగా ప్రకటించినట్లే శనివారం ఉదయం 10 గంటలకు ఆహూతుల సమక్షంలో, తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించారు. దాని పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన' – ఇంగ్లీషు పొడి అక్షరాల్లో దాని సంక్షిప్త ఉచ్చారణ ఒకనాడు తెలంగాణ రాష్ట్రోద్యమాన్ని ఉర్రూతలూగించిన ''టిఆర్ఎస్''. కెసిఆర్ జాతీయ నాయకత్వ ఆకాంక్షతో టిఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) పేరును భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్)గా మార్చినందున, ' ఆ పేరు ఇప్పుడు ఫ్రీగా ఉంది, ఎవరైనా వాడుకోవచ్చు' అని కొద్దిరోజుల క్రితం శ్రీమతి కవిత అన్నారు. పూర్తి కాపీ అయితే ఎన్నికల కమిషన్‌తో రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులు వస్తాయనుకున్నారేమో – 'సమితి' స్థానంలో 'సేన' చేర్చారు. తెలంగాణ ఉద్యమ వారసత్వం గుర్తుచేస్తూ ఇంగ్లీషు పొడి అక్షరాల్లో టిఆర్ఎస్ వచ్చేలా 'సేన'ను ఎంచుకున్నారు. ఇది బిఆర్ఎస్‌కు ఇబ్బందికరమైన విషయం.

అదలావుంచితే, ఆమెను బిఆర్ఎస్‌నుంచి సస్పెండ్ చేసిన నాటి నుంచీ పార్టీలో ఇమడలేని స్థితి వ్యక్తమవుతూ వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో మహిళలను కదిలించిన 'తెలంగాణ జాగృతి' వేదికనుంచి ఆమె కార్యకలాపాలు మొదలుపెట్టారు. తండ్రిపట్ల గౌరవం ప్రదర్శిస్తూనే తమ్ముడు కెటిఆర్‌పై, అంతకన్నా ఎక్కువగా మామ హరీశ్‌రావుపై వ్యక్తిగత దాడి చేస్తూ వచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణ హరీశ్ రావుపై ఆమె తొలి తూటా. పార్టీనుంచి సస్పెన్షన్‌కు అదే కారణం. తండ్రి పిలిచి మాట్లాడతారన్న ఆమె ఆశలు అడియాసలైనాయి. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో దిగువకోర్టు నుంచి విముక్తి లభించిన దరిమిలా ఆమె తన రాజకీయ కార్యక్రమాలను ఉధృతం చేశారు. పార్టీ ప్రకటన సభలో ప్రసంగంలో ఆమె ప్రధానంగా కెసిఆర్‌పై దాడి చేశారు. 'ఆయన ఉద్యమం నాటి కెసిఆర్ కాదు...మారిన మనిషి...మర మనిషి. ఆయన చుట్టూ గుంటనక్కలు, పందికొక్కులు చేరాయ్ అన్నారు. వారి చేతిలో ఆయన బందీ అని సూచనప్రాయంగా విమర్శించారు. అధికారం వచ్చాక ఉద్యమ లక్ష్యం ఎక్కడో దారితప్పిందన్నారు. ఆ ఉద్యమంలో భాగమైన తాను కూడా ఇందుకు బాధ్యత వహిస్తున్నానన్నారు. తెలంగాణ అమరవీరులను, ఉద్యమ కారులను పదేపదే స్మరించుకుంటూ ప్రజల సానుభూతికోసం ప్రయత్నించారు.

మూడు పార్టీలను – కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్‌లను తమ పార్టీ ప్రత్యర్థులుగా ప్రకటించారు. వచ్చే అన్ని ఎన్నికల్లో పోటీచేస్తామని, మన కార్యక్రమం అమలు చేయాలంటే రాజకీయ అధికారం ముఖ్యం గనక అధికారం కోసం శక్తివంచన లేకుండా పోరాడతామన్నారు. టిఆర్ఎస్/బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిన తెలంగాణ ఉద్యమకారులను అధికార వ్యవస్థల్లో భాగస్వాముల్ని చేస్తానని హామీ ఇచ్చారు. ఆ ఉద్యమ పునాదిని, విస్మృతిని ఆకట్టుకునే ఉద్దేశం ఆమె ప్రసంగం ప్రస్ఫుటం చేసింది.

తెలంగాణ కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, మహిళలకు సంక్షేమ కార్యక్రమాలు తప్ప 'తెలంగాణ రాష్ట్ర సేన'కు ప్రత్యేక సిద్ధాంతం ఏమీ ఉన్నట్లు వెల్లడి చేయలేదు. 'పాంచజన్యం' పేరుతో శ్రీమతి కవిత ప్రకటించిన ఐదు ప్రాముఖ్య అంశాలు అదే కోవలో ఉన్నాయి. విద్య, వైద్యం, ఉపాధులు, సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ నిర్మాణం తమ ముఖ్య ఎజండాగా ఆమె ప్రకటించారు. తాను దేన్నయినా అధ్యయనం చేయకుండా ప్రకటించబోనన్న ఆమె తాను పూరించబోయే పాంచజన్యానికి రాష్ట్ర వనరులతో పొంతన కనిపించదు. పాంచజన్యంలోని మొదటిది విద్య – ఊరుకొకబడి, క్లాసుకొక టీచర్ ప్రభుత్వ విద్య పటిష్టతకు మార్గం అన్నారు. అయితే స్కూలు విద్యలో సగానికి సగం మంది విద్యార్థులు ప్రైవేటు సూళ్లలో ఉన్న వాస్తవం తెలిసీ, ప్రైవేటు స్కూళ్లలో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు వెచ్చించే సొమ్మును తామే భరిస్తామన్నారు. ఫీజు రీఇంబర్స్‌మెంట్ భరించలేకే ప్రభుత్వాలు సతమతమవుతున్నాయి. అటువంటప్పుడు ఈ అతిపెద్ద కొత్త భారాన్ని ప్రభుత్వం భరించగలదా? రెండు, వైద్యం – తెలంగాణలోని పేదలు ఏ రోగమొచ్చినా, ఏ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నా, ఆ ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది. ఇప్పుడు అమలులో ఉన్న ఆరోగ్యశ్రీ కు మెరుగుదల కావచ్చు. మూడు, ఉపాధులు – తమ ప్రభుత్వం రాగానే ఒకేసారి 4 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇస్తుందని కవితగారు అరచేతిలో స్వర్గం చూపించారు. అదే సమయంలో ఉద్యోగం అంటే ప్రభుత్వ ఉద్యోగమే కాకూడదని, యువతకు ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ తోవలో రాణించేందుకు రూ.2లక్షల వరకు బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే రుణం ఇస్తుందన్నారు. నాలుగు, బిసిలు – జనాభా ప్రకారం రాజకీయాధికారం సహా అన్ని రంగాల్లో 57 శాతం రిజర్వేషన్ కల్పిస్తారట. ఐదు, సామాజిక న్యాయం. ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిలు ప్రత్యేక కార్పొరేషన్లతోపాటు నిధుల కేటాయింపు వగైరా. ఈ కార్యక్రమం సంబంధిత ప్రజల్లో ఆకర్షణీయం కావాలంటే మాటలు కాదు – ఆదాయ వనరులు చూపాలి. రానున్న దినాల్లో మీడియా ముందుకు వచ్చినపుడు ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలతో సిద్ధంగా ఉండాలి. అన్నిటికీ మించి సంస్థాగత నిర్మాణం లేకుండా గాలివాటు ప్రచారం పనిచేయదని గ్రహించాలి. మూడు స్థిరపడిన రాజకీయ పార్టీలను ఒకేసారి ఎదుర్కోవటం పద్మవ్యూహంలో ప్రవేశించిన అభిమన్యుని తంతు అవుతుందేమో జాగ్రత్తవహించకపోతే ప్రమాదం. ఆమె రాజకీయాల్లో రెండు దశాబ్దాలకు పైగా అనుభవమున్న నాయకురాలు. అన్నీ ఆలోచించే ఆచితూచి అడుగు ముందుకు వేశారని భావించుదాం!

# నిరంకుశ కార్మిక కోడ్‌లపై రాజీలేని పోరు

## 'మే డే' రోజున ప్రతిన బూనుదాం



**అమర్‌జీత్ కౌర్**
ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి

చుట్టూ సంక్షోభాలు ముసురుకున్న ప్రస్తుత తరుణంలో, ఆర్ఎస్ఎస్ — బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడంలో నిమగ్నమై ఉంది. ప్రత్యర్థులపై అన్ని వ్యవస్థలను తీవ్రంగా దుర్వినియోగం చేసిన తర్వాత, ఎన్నికల విధానం అనే వ్యవస్థనే ఉల్లంఘించి దానిని అపహాస్యం చేసింది. 'ఎస్ఐఆర్' నాటి పరిస్థితి, ఇప్పుడు కేంద్రంలోని అధికార ప్రభుత్వం పూర్తి మద్దతుతో రాష్ట్ర ఎన్నికలలో ఎన్నికల యంత్రాంగం చేస్తున్నదంతా చూస్తుంటే, ఏ విధంగానైనా అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అనుసరిస్తున్న ఫాసిస్టు పద్ధతుల వాసన వస్తోంది. తదుపరి చర్య పేద ప్రజల పౌరసత్వ హక్కును లాక్కోవడమే. డీలిమిటేషన్ బిల్లుతో జతచేయబడిన మహిళా రిజర్వేషన్ బిల్లు అనే పేరుతో వచ్చిన ప్రయత్నం ఇదే దిశగా సాగింది. దీనిని ప్రతిపక్షం సరైన రీతిలో ఓడించింది. కానీ ఈ ప్రభుత్వం చేసే ఈ ప్రయత్నాలు ఆగవు, పైగా భవిష్యత్తులో ఒక మాయారూపంలో ముందుకు వస్తాయి.

ప్రజల ఐక్యత, వీధుల్లో పోరాడడమే దీనికి సమాధానం. ఈ ఆందోళనకరమైన పరిస్థితులలో కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఈ విషయం ప్రస్తుత ప్రభుత్వానికి కూడా అర్థమైంది. వాటిని బలహీనపరిచే దిశగా అది కదులుతోంది.

పెరుగుతున్న ధరలు, పెరిగిన నిరుద్యోగంతో ప్రజలలో నిరాశ పెరిగిపోతోంది. యూనియన్‌లు కార్మికుల హక్కుల కోసం పోరాడటానికి ఒక సంఘటిత శక్తిగా పనిచేస్తాయి. అలాగే సమాజంలోని ఇతర వర్గాలకు న్యాయం జరిగేలా వారికి మద్దతు ఇస్తాయి. ఇది కార్పొరేట్ అనుకూల ప్రభుత్వానికి నచ్చడం లేదు. అందుకే 'సులభతర వ్యాపారం' అనే లక్ష్యంతో కార్మిక వ్యతిరేక కార్మిక చట్టాలను తీసుకువచ్చింది. ఈ చట్టాలు యూనియన్‌ల గొంతు నొక్కడానికి, పని ప్రదేశంలో జరిగే ఉల్లంఘనలను చట్టబద్ధం చేయడానికి, యజమానులను నేరరహితం చేయడానికి, యూనియన్‌లు,వాటి నాయకులను నేరస్థులను చేయటానికి ఉద్దేశించినవి.

ఇటీవల నోయిడా, మానేసర్, భివాడి, నీమ్రానాలలో మనం చూసింది నిస్సహాయ కార్మికుల ఆక్రందన మాత్రమే. వాస్తవం ఏమిటంటే, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పటికీ గత 10 సంవత్సరాలు గా అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలను సవరించలేదు. చాలా పారిశ్రామిక కేంద్రాలలో, ఒప్పంద కార్మికులు లేదా వలస కార్మికులు ప్రాథమిక సౌకర్యాలు లేని అభద్రతా పరిస్థితులలో జీవిస్తున్నారు.

ఈ ఆందోళనలు వేరువేరుగా చూడలేము.

* కేవలం రెండు నెలల ముందు బిహార్‌లోని బరౌని రిఫైనరీ (చమురు శుద్ధి కేంద్రం) ప్రాంతాలలో వేలాదిమంది కాంట్రాక్ట్ కార్మికులు ఇలాంటి ఆందోళనకే దిగారు. వారిలో చాలామంది కాంట్రాక్ట్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. ఒకవేళ గళం విప్పితే ఉద్యోగం కోల్పోతామనే భయం వారిని వెంటాడుతున్నప్పటికీ, వారు న్యాయంకోసం వీధుల్లోకి వచ్చారు. 8 గంటల పని, ఎక్కువ గంటలు పనిచేస్తే రెట్టింపు ఓవర్‌టైమ్, కనీస వేతనాల పెంపు, పని ప్రదేశంలో భద్రత, గౌరవం, రెగ్యులర్ కార్మికులతో సమానంగా సెలవులు, సామాజిక భద్రత, జాబ్ కార్డులు, పే స్లిప్‌లు మొదలైనవి వారి డిమాండ్‌లలో ఉన్నాయి.
* ఆ తర్వాత పానిపట్‌లో వేలాది మంది కార్మికులు ఆందోళన చేశారు. మళ్ళీ వారి డిమాండ్‌లలో కనీస వేతనం పెంపు, 8 గంటల పని, ఎక్కువ పనికి ఎక్కువ చెల్లింపు, వేతనాల లెక్కింపు కోసం నగరం శ్రేణిని పెంచడం మొదలైనవి ఉన్నాయి.
* ఆ తర్వాత సూరత్‌లో ఇలాంటి నిరసనలే జరిగాయి. మళ్ళీ వేలాదిమంది అవే డిమాండ్లతో వీధుల్లోకి వచ్చారు. వీరిలో చాలామంది కార్మికులు ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చినవారే.
* కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ మానేసర్‌లోని కార్మికులు తమ తమ ఫ్యాక్టరీ గేట్ల వద్దకు చేరుకున్నారు. పదేళ్ల విరామం తర్వాత ఏర్పడిన రాష్ట్ర కనీస వేతన బోర్డు సిఫార్సులలో పని గంటలు, ఓవర్‌టైమ్, పని ప్రదేశంలో భద్రత, కార్మికుల పట్ల దురుసుతనాన్ని విడనాడటం, ప్రాథమిక సౌకర్యాలు మొదలైన ఇతర సమస్యలు వంటి డిమాండ్‌లు చేశారు. ట్రేడ్ యూనియన్ జాయింట్ కౌన్సిల్ కార్మిక శాఖ అధికారులతో సమావేశమైనప్పటికీ, యాజమాన్యాలు, కార్మిక పరిపాలన నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో కార్మికులు వీధుల్లోకి వచ్చారు. పోలీసులు దూకుడుగా వ్యవహరించారు. ఇది మరింత అశాంతికి దారితీసింది.వందలాదిమంది కార్మికులను అరెస్టుచేసి, వారిపై కేసులు పెట్టా రు.

ఆ తర్వాతే హర్యానా ప్రభుత్వం తాము నోటిఫై చేసిన వాటిని అమలు చేస్తామని చెప్పింది. రాష్ట్ర కనీస వేతన బోర్డు సిఫార్సు కంటే ఈ నోటిఫికేషన్ తక్కువ మొత్తంలో ఉంది.

* కనీస వేతనం పెంపు, 8 గంటల పనిదినం, అదనపు పనికి చట్ట ప్రకారం రెట్టింపు ఓవర్‌టైమ్, సామాజిక భద్రత, ప్రాథమిక సౌకర్యాలు, కార్మికులకు వేధింపులు లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ నోయిడాలోని ఫ్యాక్టరీల కార్మికులు కూడా ఇదే బాటలో నడిచారు. మహిళా కార్మికులు వేధింపులపై ఫిర్యాదులు చేశారు. ప్రాథమిక నిత్యావసర వస్తువులు, సేవల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ, 2012 నుండి ఉత్తర్‌ప్రదేశ్‌లో కనీస వేతనాల సవరణ జరగలేదనే విషయం గమనించాలి.

కార్యాలయాల్లో కార్మిక చట్టాల ఉల్లంఘనలు సర్వసాధారణమని, తనిఖీలు జరగవని, అధిక పనిభారం, వేతనాలు చెల్లించకపోవడంతో పాటు, కార్యాలయ భద్రతకు భంగం వాటిల్లి అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం, చాలామంది తమ పని సామర్థ్యాలను కోల్పోవడం, యూనియన్ల ఏర్పాటుకు అనుమతి లేకపోవడం, యూనియన్‌గా ఏర్పడటానికి ప్రయత్నించిన వారు ఉద్యోగాలు కోల్పోవడం వంటివన్నీ జరుగుతున్నాయని కేంద్ర కార్మిక సంఘాలు పదేపదే చెబుతున్నాయి.

ఒక విధంగా కార్మిక హక్కులను పూర్తిగా నిరాకరించడం, సామాజిక సంభాషణ, సామూహిక బేరసారాలు లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. పలు సందర్భాల్లో లేవనెత్తిన ఈ సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘనలను చట్టబద్ధం చేయడానికి కఠినమైన నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చింది. ఫలితంగా 15 కేంద్ర కార్మిక చట్టాలు రద్దవడమే కాక, మరో 29 కేంద్ర చట్టాలను రద్దు చేసి, వాటిని ఈ నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చనుంది.

ఈ కోడ్‌లు కార్మిక శక్తిని బానిసత్వంలోకి నెట్టడానికి, పని గంటలను పెంచడానికి, సమ్మె చేసే హక్కును అక్షరాలా అంతం చేయడానికి, నిర్ణీత కాల ఉద్యోగాన్ని ఒక నియమంగా మార్చడానికి, ఉద్యోగ భద్రత లేకుండా చేయడానికి, అర్హత ప్రమాణాలను పెంచి, రక్షణ పొందుతున్న కార్మికులను కూడా కార్మిక చట్టాల రక్షణల నుండి బయటకు నెట్టడానికి, యూనియన్‌గా ఏర్పడటాన్ని ఒక కష్టమైన ప్రక్రియగా చేయటానికి, రిజిస్ట్రేషన్ రద్దు, గుర్తింపు రద్దును చాలా సులభంగా చేయడానికి, తనిఖీలను అంతం చేయడానికి,యజమానులు/వ్యాపారాలకు సహాయపడటానికి మధ్యవర్తులను (ఫెసిలిటేటర్లను) ప్రతిపాదించడానికి ఉద్దేశించినవి.

గడిచిన మూడు నెలల్లో మనం చూసింది కార్మికుల నిస్సహాయత. మీరు యూనియన్‌లను అనుమతించనప్పుడు, చర్చలకు తావులేని పరిస్థితి ఏర్పడినప్పుడు, అది అశాంతికి దారితీస్తుంది, పారిశ్రామిక శాంతికి భంగం కలుగుతుంది.

నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వం తక్షణమే భారత కార్మిక సదస్సు(ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్) ను పిలవాలనే డిమాండ్‌ను మేము పునరుద్ఘాటిస్తున్నాము. కార్మికులను వారి ప్రాథమిక హక్కులకు దూరం చేసి, బానిసత్వ పరిస్థితుల్లోకి నెట్టేందుకు ఇప్పటికే నోటిఫై చేయబడిన నాలుగు కార్మిక చట్టాల నేపథ్యంలో, ఈ ఏడాది కూడా 'మే డే'ను పాటించాల్సి వస్తోంది.

***ఈ 'మే డే' నాడు మనం బలంగా చాటి చెప్పుదాం:***

- యూనియన్‌గా ఏర్పడటం, యూనియన్‌లు మన రాజ్యాంగ హక్కులు.
- సమష్టి బేరసారాలు మన కార్మిక హక్కు.
- డిమాండ్‌ల సాధనకు పోరాడటం మన ప్రజాస్వామ్య హక్కు.
- కార్మిక హక్కులే మానవ హక్కులు.
- కార్మికులు యూనియన్‌గా ఏర్పడటాన్ని, తమ డిమాండ్‌లను లేవనెత్తే హక్కును, వాటి సాధన కోసం పోరాడే హక్కును అనుమతించే సమాజాలు, దేశాలను మాత్రమే ప్రజాస్వామ్య దేశాలుగా పిలవగలం.
- కాబట్టి అందరి స్వేచ్ఛ, గౌరవం కోసమే కార్మికుల పోరాటాలు.
- భారత రాజ్యాంగం మూల విలువలను కాపాడటానికి పోరాడండి.

# పరిగెత్తే ఫీజులు, తల్లడిల్లే రోజులు

## కార్పొరేట్ల ఇష్టారాజ్యం - పట్టించుకోని అధికార యంత్రాంగం



**కసిరెడ్డి మణికంఠ రెడ్డి**
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

ప్రైవేట్ స్కూళ్లల్లో ,కళాశాలల్లో పరుగెత్తే ఫీజులు, ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు తల్లడిల్లే రోజులు నేడు సమాజంలో చూస్తున్నాం.

వచ్చే 2026–27 విద్యాసంవత్సర అడ్మిషన్లు ఎప్పటి నుండో ప్రారంభం చేశారు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల వారు. విద్యను వ్యాపారంగా చేసి ఆఫర్ల పేరుతో ఇప్పుడే అడ్మిషన్ తీసుకుంటే 30 నుండి 50% రాయితీ ఉంటది, భవిష్యత్‌లో ఎలాంటి అదనపు ఫీజు ఛార్జీలు ఉండవంటూ విద్యార్థిని, విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రలోభ పెడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి రెండునెలల ముందే కార్పొరేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలల వారు ముందస్తు ప్రవేశాలకు తెరలేపారు. ప్రస్తుతం పదో తరగతి వార్షిక పరీక్ష రాసిన విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ విద్యార్థులకు సీటు రిజర్వు చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటు న్నా, అడ్మిషన్లు ప్రారంభం అని ప్రచారాలు చేస్తున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కార్పొరేట్ కళాశాలలు,పాఠశాలలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, ప్రధాన పట్టణాలతోపాటు పలు ప్రాంతాల్లో పీఆర్ఓలను నియమించుకున్నాయి. వీరు పదో తరగతి విద్యార్థులు తల్లిదండ్రులను మచ్చిక చేసుకొని ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ముందస్తు ప్రవేశాలకు మాత్రమే ఫీజులో రాయితీ ఉంటుందని నమ్మబలుకుతూ కనీసం 60 శాతం ఫీజును ముందే తీసేసుకుంటున్నారు. ఆ మాత్రమైనా చెల్లించకపోతే ఐడి నెంబర్ రాదని భయపెడుతున్నారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలు అడ్మిషన్లు అయిపోయాయి అని బోర్డ్ లు కూడా పెట్టాయి

**భారీగా ఫీజుల వసూళ్లు..** అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుత సంవత్సర ఉన్న ఫీజుల కంటే వచ్చే విద్యా సంవత్సరం ఫీజులు ఒక్కో పాఠశాల, కళాశాల వారు 15 నుండి 20% పెంచారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు పాఠశాలల్లో ఎల్కేజీ, యుకెజిలకే లక్ష రూపాయలపైన ఫీజు, అడ్మిషన్ ఫీజు 20 వేలు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా పాఠశాల ఆవరణలోని పుస్తకాలు, యూనిఫామ్స్ ఇతర స్టేషనరీ వస్తువుల పేరు లక్ష వరకు దండుకుంటున్నారు. ఇంటర్‌లో కార్పొరేట్ కళాశాలలు వివిధ బ్రాంచిల పేరుతో అడ్డగోలుగా ఫీజు లు వసూలు చేస్తున్నాయి. ఇంటర్ కళాశాలలు సైతం నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ ఫీజులు, యూనిఫామ్ ఫీజులు, వారే కళాశాలలో పుస్తకాలు అమ్మడం లాంటి దోపిడి చేస్తున్నారు. ఎంపిసి, బైపిసి (ఐఐటి, నీట్) పేరుతో ఏడాదికి డే స్కాలర్ విద్యార్థికే రూ.90 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ఫీజులు నిర్ణయించారు. మాదాపూర్ వాటి ప్రాంతాల క్యాంపస్‌లకు 2,3 లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒక గ్రూప్ విద్యార్థులు ప్రత్యేక క్యాంపస్ హాస్టల్ అని చదువుకోవదలిస్తే ఒక్క సంవత్సరానికే రూ.2.50,000 నుండి 3లక్షల వర కు ఖర్చవుతుంది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని కొన్ని కళాశాలల్లో రెండు సంవత్సరాల ప్యాకేజ్ పేరుతో 6 లక్షల రూపాయలు వసూలు చేస్తున్న వైనం. సిఇసి, ఎంఇసి, హెచ్ఇసి గ్రూప్ సివిల్స్ ఫౌండేషన్ పేరుతో కొత్త కోర్సును పరిచయం చేస్తూ సుమారు రూ.1.65 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. సిఇసి, ఎంఇసి గ్రూప్స్ సిఎ, ఇతర పేర్లు జోడించి రూ.2.లక్షలపైగా డిమాండ్ చేస్తున్నారు.

**నిబంధనలకు పాతర...** అడ్మిషన్ల కోసం విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక పాఠశాలల్లో, ఇంటర్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేశాక ఇంటర్ ప్రవేశాలు తీసుకోవాలి. అంతవరకు ఎలాంటి ప్రచారాలు చేయకూడదు. అడ్మిషన్లు తీసుకోవద్దు, పిఆర్వోల ద్వారా అడ్మిషన్లు చేసుకోకూడదు. కానీ పాఠశాలల వారు, ఇంటర్ కళాశాలల వారు నిబంధనలను తుంగలో తొక్కి కార్పొరేట్ సంస్థలు అడ్డగోలు ప్రచారానికి తెరలేపుతున్నాయి. తోక పేర్లతో, అడ్మిషన్లు ప్రారంభమంటూ, అనుమతి లేని ప్రాంతాలల్లో విద్యాసంస్థల నిర్వహణ పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో , కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నప్పటికీ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడరు. వాటిపై చర్యలు తీసుకోలేని స్థితిలో ఉన్నారు.

**మళ్ళీ డబ్బులు తిరిగి ఇవ్వరు...** ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ముందస్తు ప్రవేశాలు తీసుకున్న విద్యార్థుల్లో కనీసం 30 శాతం మంది తీరా పరిసరాలకు అలవాటు పడ లేక అనారోగ్యం పాలవడంతో తిరిగొచ్చే సందర్భాలు ఉంటాయి. ఏ కారణంతో మానేసినా ఫీజు తిరిగి తెచ్చుకునేందుకు చుక్కలు చూడాల్సిందే. అప్పటికిఅసలు పాఠాలే ప్రారంభం కావు కానీ కొంత ట్యూషన్ ఫీజు, కొంత హాస్టల్ ఫీజు తగ్గించి మిగతా డబ్బులు ఇస్తామని అవి కూడా వాయిదా పద్ధతిలో ఇస్తామని చెపుతారు. ఇక అడ్మిషన్ ఫీజు మొత్తానికే మర్చిపోవాల్సిందే

**అడ్మిషన్ల కోసం గిఫ్ట్‌లు, తాయిలాలు...** విద్యార్థులు చదువుతున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులకు భారీ తాయిలాలు ముట్టచెప్పేలా ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారు. వందకు పైగా పదో తరగతి విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలల నిర్వాహకులకు ముడుపులు, లేదా ఆ స్థాయి బహుమతులు అందించేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నందున ఆ పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలో చదివే విద్యార్థులను తాము చెప్పే కళాశాలల్లో చేరేలా వారిని వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్నారు. చేరాక ఏదైనా సమస్య వస్తే వారు మాకు ఏం తెల్వది అని చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో కార్పొరేట్ విద్యాసంస్థల బాధితులుగా విద్యార్థులు తల్లిదండ్రులు మారుతున్నారు

**కట్టడి చేయాలి...** కార్పొరేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న విద్య దోపిడిని అరికట్టాలి. ఫీజులను నియంత్రణ చేస్తామని పాలకులు చట్ట సభల్లో మాట్లాడటమే తప్ప ఫీజు నియంత్రణ చట్టాలు అమలు చేయించడంలో విఫలం అవుతున్నారు .రాష్ట్రంలో విద్యాశాఖ సిఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న నేపథ్యంలో ఫీజు నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేసేలా ఈ విద్యాసంవత్సరం నుండైనా చర్యలు తీసుకోవాలి. విద్యాశాఖ, ఇంటర్ బోర్డు అధికారులు పాఠశాలలను ,కళాశాలలను తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలు, వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు తెలుసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహారిస్తు అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను, కళాశాలలను సీజ్ చేయాలి.

అధికారులు చూసిచూడనట్లు వత్తాసుగా వ్యవహరించడం వల్లే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలవారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.అధికారులు ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారం, అడ్మిషన్లు నిర్వహిస్తు ,లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై ఉక్కుపాదం మోపాలి.

# అణు విస్ఫోటన విధ్వంసాల పట్ల అవగాహన కలిగి ఉందాం!

అణు శక్తి అత్యంత శక్తివంతం, అపార విధ్వంసాలకు మారు పేరు. అణు శక్తిని మానవాళి సంక్షేమానికి, ప్రపంచ శాంతి స్థాపనకు ఉపయోగించడంతో పాటు అనాలోచితంగా అణు బాంబుల రూపంలో విధ్వంసానికి కూడా వాడడం జరుగుతుంది. నేటి అమెరికా/ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధానికి ముఖ్య కారణంగా ఇరాన్ అణు శక్తి సామర్థ్యాలను, యురేనియం నిల్వలను కట్టడి చేయడమే అని వింటున్నాం. నాటి చెర్నోబిల్ అణు రియాక్టర్ విపత్తు నేటికీ వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నాటి ప్రజలు, జంతువులు, పంటలు, మౌలిక సదుపాయాలు ప్రభావితం అయ్యాయి. అణుశక్తి వల్ల కలిగే లాభ నష్టాలను గురించి ప్రపంచ ప్రజలకు అవగాహన కల్పించడానికి, నాడు చనిపోయిన అమాయకులను స్మరించుకోవడానికి ఐరాస చొరవతో ప్రతి ఏటా 26 ఏప్రిల్ రోజు ప్రపంచ దేశాలు అంతర్జాతీయ చెర్నోబిల్ విపత్తు స్మరణ దినోత్సవం (ఇంటర్నేషనల్ చెర్నోబిల్ డిజాస్టర్ రిమెంబరెన్స్ డే)ను 2016 నుంచి నిర్వహించడం కొనసాగుతోంది. ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన మానవ నిర్మిత విపత్తుల్లో ఒకటిగా 'చెర్నోబిల్ విపత్తు' నిలుస్తున్నది. అణు విద్యుత్ కేంద్రాల భద్ర తా చర్యలను కట్టుదిట్టం చేయడానికి ప్రయత్నాలు నిరంతరం జరగాలి. 40 ఏండ్ల క్రితం జరిగిన ఈ ప్రమాదకర విస్ఫోటనం గురించి, అది మిగిల్చిన విషాదాల గూర్చి, తీసుకోవలసిన చర్యల గురించి, వారి జీవితాల ను మెరుగుపరచడానికి కావలసిన మార్గాలను ఎంపిక చేసుకొని అమలు పరచడం జరగాలి. ఈ విపత్తులో దాదాపు 180 మిలియన్లకు పైగా క్యూరీ రేడియోధార్మిక న్యూక్లైడ్‌లు వాతావరణంలోకి ప్రవేశించాయి. మిలియన్ల ఎకరాల అటవీ, సాగు భూములు కలుషితం అయ్యాయి. తరతరాల ప్రజలపై ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు, పశువులు వైకల్యంతో జన్మించడం కొనసాగుతోంది. ఇలాంటి భయంకర దుర్ఘటన మరే ప్రాంతంలో జరగకుండా చూసుకోవడం మన కనీస బాధ్యత. ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడడం మన కర్తవ్యం. చేతులు కాలకముందే ఆకులు సిద్ధం చేసుకుందాం. మన అలసత్వం లక్షల ప్రజల ప్రాణాలను తీయకుండా జాగ్రత్తపడదాం. అణు విస్ఫోటనాలు కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

*(26 ఏప్రిల్ 'అంతర్జాతీయ చెర్నోబిల్ విపత్తు స్మరణ' దినోత్సవం సందర్భంగా)*

## ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చల్మేడ గ్రామంలో రామయంపేట సొసైటీ కొనుగోలు కేంద్రాన్ని అలాగే నిజాంపేట వ్యవసాయ మార్కెట్ లో కొనుగొలు కేంద్రాన్ని, కల్వకుంట గ్రామంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం 33 కల్యాణ లక్ష్మి షాది మెబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ప్రజాపాలన ప్రభుత్వంలో రెండు కోట్ల వ్యయంతో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత కరెంటు, ఇలాంటి అనేక అభివృద్ధి పథకాలతో తెలంగాణ ముందంజలో ఉందని కొనియాడారు. మండల తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజిరెడ్డి, ఏఓ సోమలింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మాట బాబు, సర్పంచుల పోరం అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, అమర్ సేనారెడ్డి, ముత్యంరెడ్డి, పంజా మహేందర్, నసీరుద్దీన్, శ్యామల మహేష్, స్వామి, రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు దళారులను ఆశ్రయించోవద్దు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** రైతులు దళారులను ఆశ్రయించుండా కొనుగోలు కేంధ్రాలలోనే పండించిన వరిధాన్యాన్ని విక్రయించుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెన్నాపూర్, శివ్వంపేట, లింగోజిగూడ, కొత్తపేట గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంధాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, సర్పంచ్‌లు కొమురయ్య, వెంకటేశ్వర్, బాసంపల్లి అమృత, లింగనబోయిన రాములు, బీఆర్ఎస్ నాయకులు, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడంపై హర్షం



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్:** ఆర్టీసి కార్మికుల దశాబ్దాల కల నెరవేరుస్తూ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై నిర్మల్ డిపోలో సంబరాలు మిన్నంటాయి. శుక్రవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఆర్టీసి జేఏసి నాయకులు యాజమాన్యం మరియు ప్రభుత్వ అధికారుల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చలు విజయవంతమయ్యాయి. ఈ చర్చల్లో కార్మికుల 32 ప్రధాన డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడమే కాకుండా, ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు కీలక ప్రకటన చేయడంతో కార్మికులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతగా శనివారం నిర్మల్ డిపో ప్రాంగాణంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌ల చిత్ర పటాలకు కార్మికులు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. మిఠాయిలు తినిపించుకుంటూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ప్రభుత్వంలో విలీనం ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అలాగే చర్చల్లో కుదిరిన ఒప్పందాల ప్రకారం రావాల్సిన అన్ని బకాయిలను సకాలంలో చెల్లించాలని ఈ సందర్భంగా కార్మికులు అభిప్రాయపడ్డారు. ఈ ఉత్సాహ భరిత కార్యక్రమంలో జేఏసి రీజినల్ నాయకులు ఆర్ గంగాధర్, కె.రమేష్, రాజేశ్వర్ మరియుపెద్ద సంఖ్యలో ఆర్టీసి ఉద్యోగులు కార్మికులు పాల్గొని జయప్రదం చేశారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ:కలెక్టర్

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలో 252 జీవో ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ హరిత తెలిపారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2026 సంవత్సరానికి గాను మొదటి విడతలో 94 నూతన అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తుదారులు జీవోలో పేర్కొన్న విధంగా అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జనాభా గణన ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. 2027 మే 11 నుండి మొదటి విడత జనాభా గణన ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విద్యావంతులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రక్రియ కోసం జిల్లాలో 994 మంది ఎన్యుమరేటర్లు, 174 మంది సూపర్ వైజర్లను నియమించామని, 1689 ఇళ్ల బ్లాకులను గుర్తించామని వివరించారు. ప్రజల్లో ఈ అంశంపై అవగాహన కల్పించడంలో మీడియా ప్రతినిధులు క్రియాశీల పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయం

- దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు
- మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ధాన్యం విక్రయాలలో అపోహలు నమ్మవద్దని రైతులు పండించిన పంట చివరిగింజ వరకు ప్ర భుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మెదక్ ఎ మ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రమైనపాపన్నపేట,కొత్తపల్లికుర్తివాడ, నాగసాన్ పల్లి గ్రా మాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం విక్రయ కేం ద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రతి రైతు ధైర్యంగా ఉండాలన్నారు. గత పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ఇది ప్రజల ప్రభుత్వమనిపేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం కొంపల్లి లోని ర్వహిస్తున్న గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా రైతు నాయకుడు ప్రభాకర్ రెడ్డి, సర్పంచులు పావని నరేందర్ గౌడ్, శ్రీధర్, పాపయ్య, నాయకులు మల్లప్ప, శ్రీనివాస్, మురళి, కిష్టయ్య, సంగమేష్, గౌస్, సతీష్, రాజశేఖర్ తో పాటు వివిధ గ్రామాల కార్యకర్తలు రైతులు ఉన్నారు.

## జీరో మలేరియా కేసుల స్థితికి కృషి



**ప్రజాపక్షం/మందమర్రి :** మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం ఉన్న జీరో మలేరియా కేసుల స్థితిని అలాగే కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మందమర్రి మున్సిపల్ పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్. అనిత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీ, శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి రోగులను గుర్తించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి వారం రెండుసార్లు 'డ్రై డే' పాటించాలని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. అనంతరం మలేరియా నియంత్రణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ఈ. ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సిహెచ్‌ఓలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు టోపీల పంపిణీ



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ఎండల్లో సైతం విధులు నిర్వహిస్తు న్న జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టోపీలను పంపిణీ చేయడం జరిగిందని మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మంచాల జ్ఞానేందర్ గుప్తా అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ లో మం చాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు టోపీల ను పం పిణీ చేశారు.శంకరయ్య ట్రస్టుద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ట్రస్టు సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరిచేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్‌లో టోపీలు పంపిణి చేసినందుకు మంచాల జ్ఞానేందర్‌కు కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు.ప్రెస్‌క్లబ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, టోపీల పంపిణీకి సహకారమందించిన ప్రెస్‌క్లబ్ పూర్వాధ్యక్షులు చింతల గంగాదాస్, ప్రెస్‌క్లబ్ కమిటి సభ్యులు, పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలే మనకు రక్ష

ఎంపి రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/రామాయంపేట:** కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచమంతా వణికిపోతుంటే భారతీయులు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ధైర్యంగా నిలబడిగలిగారంటే దానికి ప్రదాన కారణం మన ఆహారపు అలవాట్లు, మన సంస్కృతి సంప్రదాయాలేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ కేంద్రంలో ఐసిడిఎస్ అద్వర్యంలో శనివారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అథితులుగా ఎంపీ రఘునందన్‌రావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నేడు మార్కెట్లో మిల్లెట్స్ పేరుతో అధిక ధరలకు అమ్ముడవుతున్న ఆహారం నిజానికి మన పూర్వీకులు భుజించిన గట్క, గంజి జొన్న రొట్టెలేనని, పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి మన ఆరోగ్యకరమైన ఆహారాన్ని వదులుకోవద్దని సూచించారు. మాతాశిశు సంరక్షణలో పౌష్టికాహారం అత్యంత ప్రదానమని పేర్కొన్నారు. అంగన్‌వాడీల అద్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించిన ఆయన ప్రతి అంగన్‌వాడీ కేంద్రం వద్ద సేంద్రీయ పద్దతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చిన్నారులు, గర్భిణీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ఉండే చిన్నారులకు పౌష్టికాహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లను ఎంపీ, ఎమ్మెల్యేలు టీచర్లకు అందించారు. చిన్నారుల ప్రదర్శించిన నృత్యాలు చూసిన అథితులు మంత్ర ముగ్దులయ్యారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో షాజీలొద్దిన్, తహశీల్దార్ రజని కుమారి, టిఎన్‌జివో నాయకులు, సీడీపీవో, సూపర్‌వైజర్లు సృజనతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

## మలేరియాపై ప్రతి గ్రామంలో విస్తృత అవగహన

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మలేరియా నిర్మూలనకూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆద్వర్యంలో వై ద్య సిబ్బంది ,నర్సింగ్ పారా మెడికల్ కళాశాల విద్యార్థిని విద్యార్థులచే ర్యాలీ ,సమావేశమును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అ తిథిగా జిల్లా అదనపు కలెక్టర్ పాండు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ స్థానిక జి ల్లా పరిషత్ కార్యాలయము నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వరకు ని ర్వహించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శా ఖ ప్రతి సంవత్సరము ఏప్రిల్ 25 ప్రపంచ మలేరియా దినోత్సవము జరుపుతున్నామని ,ప్రాణాంతకమైన మలేరియా వ్యాది భారిన పడి చాలా మంది ప్రజలు అనారోగ్యం పాలవతున్నారని ,జిల్లా వైద్య సిబ్బంది మలేరియా వ్యాదిపట్ల ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించటానికి ప్రతి గ్రామములో ప్రతి అవసర సమావేశాలు నిర్వహించాలని కోరారు. వర్ష కాలం ప్రారంభం నుండే పరిసరాల పరిశుభ్రత ,నీరు నిలువ ఉంచకుండ చూడటం ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం దోమ తెరలు వాడటం వంటి చర్యల ద్వారా ప్రజలు మలేరియా భారిన పడకుండా ఉండవచ్చని ,చలి జ్వరం, తల నొప్పి వోళ్ళు నోప్పులు వంటి లక్షణాలతో జిల్లాలో ఎవరైనా బాదపడుతున్నట్లైతే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదికారి డా. వసంతరావు . రక్త పరీక్షలు చేయించుకోవటం ద్వారా మలేరియా వ్యాది అవునో కాదో నిర్దారణ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రజలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించుట ద్వారా ఆరోగ్యం గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ,నర్సింగ్ విద్యార్థులను ఆయన కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ పాండు, ,జిల్లా ఆరోగ్య విద్యాదికారి శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్, మంగమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి వీరేశం వైద్య సిబ్బంది ,అందోల్ ప్రభుత్వ నర్సింగ్, కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు.




## దేవాపూర్‌లో పోలీసుల తనిఖీలు

వాహనాలు, కలప స్వాధీనం

**ప్రజాపక్షం/తలమడుగు:** ప్రజల రక్షణ కోసం తలమడుగు మండలం దేవాపూర్ గ్రామంలో శనివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఆదిలాబాద్ డిఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది సిబ్బందితో చేపట్టిన ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు.రూ. 50 వేల విలువైన అక్రమ కలప, 62 లీటర్ల మద్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హెచ్చరించారు. నియంత్రణకు గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, సిఐలు రమేష్, ఎస్ఐ రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.



## హెచ్‌పివి వ్యాక్సిన్.. బాలికలకు తప్పనిసరి



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని బషీరాబాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జమున మహేష్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలందరికి హెచ్‌పివి వ్యాక్సిన్ వేయటంతో భవిష్యత్తులో వారికి గర్భస్త, నోటి తదితర స్త్రీలకు సంబంధించిన క్యాన్సర్ రాకుండా ముందస్తుగానే నివారించవచ్చునని తెలిపారు. దీనిపై తల్లిదండ్రులు స్పందించి బాలికలకు సామాజిక బాధ్యతగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూమేశ్వర్, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్‌లైనలో జనగణన స్వీయ నమోదు

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జాతీ య జనగణన 2027 ప్రా రంభం నేపథ్యంలో ప్రజలు ఫోన్‌లో డిజిటల్ స్వీయ నమోదు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సిం గ్ సూచించారు. కేంద్ర ప్రభు త్వం అందుబాటులోకి తీసుకువచ్చిన http: //se. census. / పోర్టల్ ద్వారా ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం వంటి అంశాలను సులభంగా ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్ ద్వారా ఓటిపి సహాయంతో లాగిన్ అయి, జిల్లా, గ్రామ వివరాలను ఎంపిక చేసి, మ్యాప్‌లో నివాసాన్ని గుర్తించి ప్రశ్నలకు సమాదానాలు నమోదు చేయాలని తెలిపారు. నమోదు అనంతరం వచ్చే ఎస్ ఈ ఐడి ని భద్రపరచుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదు చేసినప్పటికీ ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలను ధృవీకరిస్తారని, ప్రజలు సమకరించాలని కోరారు. జనగణన సమాచారం ఆదారంగా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవుతాయని, ప్రతి కుటుంబం తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి



**ప్రజాపక్షం / భైంసా :** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. శనివారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ మహిళ సంఘ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం నిధులతో సంఘ భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. భైంసా మండలానికి 40 కి పైగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినందుకు సర్పంచ్ సుష్మారెడ్డి, అధికారుల పని తీరును ఆయన అభినందించారు. గ్రామస్తులు పలు సమస్యలు విన్నవించచడం తో దశల వారిగా గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. సిరాల ప్రాజెక్ట్ ద్వారా దేగాం ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరగా, కొన్ని చోట్ల మచ్కలవసమీపంలో కాలువను తవ్వేశారని 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి కాలువను పూర్తి స్థాయిలో నిర్మించి సాగు నీటిని అందిస్తామన్నారు. అబివృద్ధే ధ్యేయంగా తాను ముందు సాగుతున్నానని 28 ప్యాకేజీ పూర్తి అయితే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. అదే విధంగా భూగర్భజలాలు పెంచేందుకు ప్రతీ ఒక్కరు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని డి.ఆర్‌డిఏపిడి విజయలక్ష్మి సూచించారు. అనంతరం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి మాట్లాడుతూ తాను ఒక సామాన్య మహిల నుండి సర్పంచ్ కావడంలో గ్రామస్తుల, ఎం.ఎల్.ఏ. సహకారం ఎంతో ఉందన్నారు. గ్రామ అభివృద్ధికి దశల వారిగా నిధులు ఇస్తున్న ఎం.ఎల్.ఏ. కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఎం.ఎల్.ఏ.కు గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు స్వాగతించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పంట మార్పిడితోనే అధిక లాభాలు

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** విత్తన నాణ్యతపైనే సర్కారు దృష్టి అని ,రైతన్నకు నమ్మకమైన విత్తనమే అందించడమే లక్ష్యమని ,పంట మార్పిడితోనే అధిక లాభాలు అని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. రైతులకు నమ్మకమైన అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టంచేశారు. సంగారెడ్డి జిల్లా ఐడిఓసి సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అదికారులు ,విత్తన డీలర్లు, సహకార సంఘాలు ,ఎఫ్ పిఓల ప్రతినిదులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తి విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ పరిసితుల్లో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లిందచాల్సిన బాద్యత అందరిపై ఉందని అన్వేషరెడ్డి అన్నారు. వరి సాగుపైనే కాకుండా రైతులు ,లాభదాయకమైన ఇతర పంటల వైపు మొగ్గు చూపాలని చైర్మన్ సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా పెసర , కంది ,మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు, వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. అ నుసంధానమైన విత్తన ఉత్పత్తి చేపడుతుందని ప్రమాణ పరీక్షల తరువాతే వాటిని ధృవీకరించి అందజేస్తున్నామని భరోసా ఇచ్చారు.

# మూడు రోజుల్లోనే సమ్మెకు ముగింపు పలికాం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** మూడు రోజుల్లోనే ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ముగింపు పలికి కార్మికులకు న్యాయం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే కనీసం కార్మిక సంఘాలను చర్చలకు పిలవలేదని రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ సమ్మె చేస్తున్న కార్మికులను డిస్మిస్ చేస్తామని హెచ్చరించారన్నారు.ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణించడం చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని గత ప్రభుత్వంలో పెద్దగా ఉన్న పాపాల భైరవుడు కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతినెల మొదటి వారంలో రూ. 6వేల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు .ఆర్థికంగా ఇబ్బంది ఉన్న ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలులో అధికారులను బాధ్యులను, భాగస్వాములను చేస్తూ కొనుగోలు విషయంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. జగిత్యాల జిల్లాలో మక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించి వ్యవసాయ శాఖ మంత్రి ద్వారా ప్రత్యేక అనుమతి తీసుకొని మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. రైతు సంక్షేమ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. జగిత్యాల జిల్లాలోని సమస్యలను ఇటీవల క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించడం జరిగిందని మే 20వ తేదీ నుండి జూన్ మొదటి వారంలో ముఖ్యమంత్రి జగిత్యాల జిల్లా పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని అన్నారు. ప్రస్తుతం మార్కెట్ లో ఆయిల్ ఫాం పంటకు మంచి డిమాండ్ ఉందని రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిధులు తీసుకోవచ్చి మార్కెట్లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు చేస్తూ అధిక లాభాలు సాధించడానికి వాణిజ్య పంటలు సాగు చేయాలని అన్నారు. జగిత్యాల జిల్లాలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించడానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోజగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ ,జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, నారాయణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సన్నరకాలు సాగు చేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మెప్మా ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు. టార్పాలిన్లు, గన్ని సంచులు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని ఆరా తీసి.. పరిశీలించారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది? సన్న రకం వడ్లు వచ్చాయా? అని అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల కేటాయింపు.. ఆన్లైన్లో వివరాల నమోదు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులు ప్యాడీ క్లీనర్లు వినియోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చి బాబు, మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలి



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** రైతులు పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని,దళారులను నమ్మి మోసపోవద్దని మిట్టపల్లి గ్రామ సర్పంచ్ చింతల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంను సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను గమనించి వరికోతలు చేపట్టాలని సూచించారు. అకాల వర్షాల పట్ల రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో ధాన్యాన్ని ఆరబెట్టవద్దని,ఎత్తైన ప్రదేశంలో ధాన్యాన్ని ఆరబెట్టాలని,ధాన్యంపై కప్పడానికి సరైన కవర్లను అందుబాటులో ఉంచుకోవాని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బాలక్రిష్ణా రెడ్డి,శంకర్,నాయకులు జెపి యాదవ్,కిషన్,అంకుశ్‌వలీ,ఫయాజ్,కార్యదర్శి విజయ్,పిఎసిఎస్ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గోన్నారు.

## 26 నుండి, మే 10 వరకు ప్రతిష్టాత్మంగా జనగణన: కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెన్సెన్ 2027లో భాగంగా జిల్లాలో స్వీయ గణన ప్రక్రియ ఏప్రిల్ 26 2026 నండి మే 10 2026 వరకు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి వెల్లడించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయం కాన్ఫరెన్స్ హాల్ జనగణన 2027 ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ నుండి మే వరకు 1 ఎమ్యునరేషన్) ప్రక్రియ గురించి తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ హైమావతి దిశ నిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ సెల్ఫ్ ఎమ్యునరేషన్ ప్రక్రియ ప్రచారం చేయటానికి ఏప్రిల్ 26న జిల్లాలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపి, జడ్జి. ఎంఎల్‌సిలకు ముందస్తు సమాచారం అందించి వారి స్వగృహంలో నిర్దేశిత వెబ్‌సైట్ లో సెల్ఫ్ ఎమ్యునరేషన్, జియోటాగింగ్, ప్రక్రియ ఎమ్యూనరేటర్లు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికి రెండు బ్యాచ్ వారిగా ఎమ్యూనిరేటర్ల శిక్షణ అందించాలని తెలిపారు. ప్రతి మండలంలో గ్రామాల వారిగా గ్రామాల్లో సర్పంచ్. గ్రామాల్లో పలువురు ప్రముఖులు, మహిళ సమాఖ్య అధ్యక్షులు, సెల్ఫ్ ఎమ్యునరేషన్ ,జియోటాగింగ్ ప్రక్రియ చేరుకునేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్, ఎంపిడిఓలను ఆదేశించారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లలచే సెల్ఫ్ ఎమ్యునిరేషన్ చేయించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు వారి స్వంత గృహాల వద్ద సెల్ఫ్ ఎమ్యూనిరేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, జడ్పి సిఈఓ రమేశ్, డిపిఓ రవీందర్. సెక్టోరల్ అధికారి రామస్వామి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు: ఎస్ఐ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఒక వ్యక్తికి కోర్టు మూడు రోజులు జైలు శిక్ష విధించింది. ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి లారీ నడుపుతూ పట్టుబడిన ప్రకాశం జిల్లా ఆంధ్ర ప్రదేశ్ కి చెందిన నాతల వెంకట్రావుని శనివారం సుల్తానాబాద్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ న్యాయమూర్తి దుర్గం గణేష్ సమక్షంలో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి రూ.1000 జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించారు.అనంతరం వారిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రకుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం చట్ట విరుద్ధమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## బాల్యవివాహం అడ్డుకున్న అధికారులు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని శనివారం అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో బాల్యవివాహం జరుగుతుందని రెండు రోజుల క్రితం 1098 కు సమాచారం అందివ్వగా దీంతో సిరిసిల్లా సీడీపీవో ఉమారాణి, రెవిన్యూ. పోలీసులు ఘటన స్థలానికి చెరుకున్నారు. బాలిక తల్లిదండ్రులను వివరాలు అడిగిన వారు సహకరించకపోగా తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి వివాహాన్ని నిలిపివేశారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల మధ్య ప్రోటోకాల్ రగడ



**ప్రజాపక్షం/మల్లాపూర్:** రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ప్రారంభం సాఫీగా సాగాల్సి ఉండగా నాయకుల మధ్య ఉన్న చిచ్చుతో ప్రోటోకాల్ రగడకు దారితీస్తున్నాయి. రాఘవపేట గ్రామంలో శనివారం ముత్యంపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి కాంగ్రెస్ నాయకులు జువాడి కృష్ణారావు ఏఎంసీ చైర్మన్ పుష్పలత తో కలిసి హాజరవ్వగా, కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకుల మధ్య రేగిన ప్రోటోకాల్ వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించే సమయంలో రాజుకున్న వివాదం చివరకు ఒకరిని ఒకరు తోసి పుచ్చుకునీ పరస్పరం దూషించుకునే వరకు దారి తీయగా కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బిఆర్ఎస్ నాయకులను సర్పంచ్ తోట శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులనీ, జువ్వాడి కృష్ణారావు శాంతింప చేయడంతో వివాదం సద్దుమణిగింది.

# అంబారిపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



**ప్రజాపక్షం /కథలాపూర్ :** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి) ను వేములవాడ శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మన తెలంగాణ ప్రభుత్వం ప్రజపాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు మరియు పథకాలు అమలు చేస్తున్న నేపథ్యంలో శనివారం అంబర్పేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించడం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యం పరిరక్షణలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల విస్తరణలో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.అంబారిపేటతో పాటు సమీప గ్రామాల ప్రజలు కూడా ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది ప్రజలకు సానుభూతితో సేవలు అందించాలని సూచించారు.ఈ కేంద్రంలో అవుట్ పేషెంట్ సేవలు, ప్రసూతి సేవలు, టీకా కార్యక్రమాలు, ప్రాథమిక చికిత్సలు అందించబడతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.గ్రామీణ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కూడా ఈ కేంద్రం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుభ్రత, పోషకాహారం, ఆరోగ్య నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అంబారిపేట గ్రామానికి మరియు పరిసర గ్రామాలకు ఈ పిహెచ్ సి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించేందుకు తగిన సిబ్బంది, ఔషధాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డిఓ జివాకర్ రెడ్డి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి సుజాత, జైపాల్ రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శంకర్, స్థానిక సర్పంచ్ వేముల లక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గత పాలకుల పాలనవల్లే పట్టణానికి శాపం

కోట్లాది రూపాయలతో మున్సిపల్ అభివృద్ధి చేపడుతాం

ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** గత పాలకుల పాలన నే పట్టణానికి శాపంగా మారిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు.శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 12 వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.వార్డ్ కౌన్సిలర్ అమీరి శెట్టి శ్రావణి రాకేష్ తో పాటు స్థానిక నేతలు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాలనీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయలతో సుల్తానాబాద్ మున్సిపల్ ను అభివృద్ధి పరిచామని ఒక్క 12వ వార్డు లో నే గతంలో 60 లక్షల రూపాయల పనులు చేపట్టగా ప్రస్తుతం 98 లక్షల రూపాయల సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు వివరించారు.100% అభివృద్ధి చేపట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం 500 రూపాయలకు గ్యాస్, జీరో కరెంట్ బిల్లు, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలు, సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయలకు పెంచి పేదలను ఆదుకుంటున్నామని అలాగే ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామని త్వరలో భీమా పథకాన్ని సైతం తీసుకువస్తున్నామని తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పావల వడ్డీ రుణాలు అందించామన్నారు. గతంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న ప్రభుత్వం చేసిన పాపమే మున్సిపల్ కు శాపంగా మారిందని ఎలాంటి అభివృద్ధి పనులను నిర్వహించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, స్థానిక కౌన్సిలర్ అమీరిశెట్టి శ్రావణి రాకేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,మున్సిపల్ కమిషనర్ రమేష్,పలు వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కాలనీ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే రైతులకు మద్దతు ధర



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల వ్యాప్తంగా ఐకెపి, మల్లాపూర్ చిట్టాపూర్ ముత్యంపేట, సిరిపూర్ సహకార సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, టీపీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు ,ఆయా గ్రామాల సర్పంచ్లతో కలిసి ఏఎంసి చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు దళారులకు అమ్ముకుని మోసపోకుండా వారి సౌకర్యార్థం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమలలో ఎమ్మార్వో రామచందర్, శ్రీనివాస్, పాదం భూమేష్, రమేష్,రాజేశ్వర్ రెడ్డి, రాజశేఖర్, నారాయణరెడ్డి, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## జనగణన స్వీయ నమోదుపై అవగాహన సమావేశం

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** కొడిమ్యాల మండల కేంద్రం తహసీల్దార్ నరేష్ ఆధ్వర్యంలో ఏం.పి.డి.ఓ. స్వరూప సామాన్వయంతో జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ నమోదు విధానంపై విస్తృత అవగాహన కల్పించేందుకు,కోడిమ్యాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో అవగాహన సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో స్వీయ నమోదు ప్రక్రియ యొక్క విధానం, ప్రాముఖ్యత మరియు ప్రజలకు కలిగే ప్రయోజనాలు వివరించబడినవి. ప్రజలు తమ వివరాలను స్వయంగా మొబైల్ ఫోన్ ద్వారా నమోదు చేసుకునే ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.స్వీయ నమోదు కార్యక్రమం 26–04–2026 నుండి 10–05–2026 వరకు https://se.census.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలియజెసరు. కావున, కోడిమ్యాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది మరియు ప్రజలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, ప్రతి కుటుంబం స్వీయ నమోదు చేసుకునేలా సహకరించవలసిందిగా ఏం.ఆర్.ఓ నరేష్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రణాళిక, గణాంక అధికారి , అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు,వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ఎఐటియుసి ఆర్‌జి–1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22 నుంచి జరిగిన ఆర్టీసీ సమ్మె సందర్భంగా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 23న తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మ హత్య చేసుకోగా, వైద్యం అందించే లోపే మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతికి సంతాప సూచకంగా శనివారం ఆర్జీ వన్ ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్స్ ,ఓసిపి 5లలో గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ఒక్క నిమిషం మౌనం పాటించి నివాళులు అర్పించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. అనంతరం ఆయన జిడికే 2ఏ ఇంక్లైన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ శంకర్ గౌడ్ మృతి బాధాకరమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ముందు ఇచ్చిన కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసుపై చర్చించి పరిష్కారం చూపకుండా సమ్మెకు పోవడం వల్ల నిర్లక్ష్యం చేయడం వల్లె శంకర్ గౌడ్ మృతి చెందాడని,ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య నని ఆయన ఆరోపించారు.కార్మికులు ఆర్టీసీ అభివృద్ధి కోసం కృషి చేస్తూ లాభాలు గడించిన రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ఒక నిండు ప్రాణం బలి అయిందని, ఇది యాజమాన్యం, ప్రభుత్వం అతని మృతి కి బాధ్యత వహించి వారి కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మరియు పిట్ కార్యదర్శులు సంకె అశోక్, బోగ సతీష్ బాబు, సోహెల్ , మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, చంద తిరుపతి, భక్తి శ్రీనివాస్,అటికేటి రాజు, బొల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో పట్టణ అభివృద్ధి

మున్సిపల్ ఛైర్ పర్సన్ వేముల నాగలక్ష్మీ



**ప్రజాపక్షం/ధర్మపురి :** పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ కౌన్సిల్ తీసుకునే ఏ నిర్ణయమైనా ప్రజల సహకారం వుంటేనే పరిష్కార సాధ్యమవుతుందని ధర్మపురి చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ అన్నారు. మున్సిపల్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నాగలక్ష్మి మాట్లాడారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన ధర్మపురిలో చాలా ఏళ్లుగా కొన్ని సమస్యలు ఉండిపోయాయని వాటి పరిష్కారానికి సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సూచనలతో మున్సిపల్ కౌన్సిల్ పక్షాన అవసరమైన చర్యలు తీసుకోవడానికి సమావేశంలో నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. స్థానిక ప్రజల మద్దతుతో సమస్యల రహిత పట్టణంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ముఖ్యంగా ధర్మపురి పట్టణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకై స్థలాభావంతో చాలా ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని దాని శాశ్వత పరిష్కారానికై తహశీల్దార్ తో చర్చించినట్లు తెలిపారు. క్షేత్రానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఒక నిర్దిష్టమైన స్థలం ఏర్పాటు చేయాలని, గతంలో పార్కింగ్ గుత్తేదారుల బకాయిలు వసూలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించినట్లు నాగలక్ష్మి చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకై పట్టణంలోని పాత బోర్ పంపుల రిపైర్ చేయించడం, తమ్మలకుంట చెరువులు నింపి భూగర్భజలాలు పెంచే ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు చైర్ పర్సన్ నాగలక్ష్మి తెలిపారు. పట్టణములో పిచ్చి కుక్కలు పలువురిని తీవ్రంగా గాయపర్చగా కుక్కల నివారణకు తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, శ్రీనివాసరావు, ఆనంద్, రాజేష్, జక్కు పద్మ, ఎస్.సంతోషి, లక్ష్మణ్, వేణుగోపాల్, కె.పవన్ కుమార్, ఎం.ప్రశాంత్ పాల్గొన్నారు. కో ఆప్షన్ సభ్యుల ఎంపిక వాయిదా. ధర్మపురి పురపాలక సంఘం కో ఆప్షన్ సభ్యుల ఎంపిక అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి , కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

## కోరుట్ల సిఐగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కే. లక్ష్మి నారాయణ శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. కరింనగర్ కమిషనరేట్ పరిధిలోని జమ్మికుంట రూరల్ నుండి కోరుట్ల కు ఆయన బదిలీపై వచ్చారు. ఆయన స్థానంలో వున్న సురేష్ బాబు మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా వెళ్ళారు. మెట్ పల్లి సిఐ గా ఉన్న అనిల్ కుమార్ కు పోస్టింగ్ ఇవ్వలేదు. ఐజి కి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ గా లక్ష్మి నారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. గంజాయి,మట్కా, గుట్కా,పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు కోరుట్ల సిఐ బి.సురేష్ బాబు,కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి,సిబ్బంది అభినందనలు తెలిపారు.

# చితక్కొట్టిన కోహ్లీ, పడిక్కల్..

## గుజరాత్‌కు తప్పని ఓటమి..!

చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమకు తిరుగులేదని నిరూపించింది. గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 209 పరుగుల లక్ష్యాన్ని ఆర్‌సిబి ఉఫ్‌మనిపించింది. పవర్ ప్లేలోనే గుజరాత్ బౌలర్లకు దడ పుట్టించిన విరాట్ కోహ్లీ(81), దేవ్‌దత్ పడిక్కల్(55) అర్ధ శతకాలతో విజయానికి బాటలు వేయగా.. ఆఖర్లో రషీద్ ఖాన్(2–49) విజృంభణతో గుజరాత్ పోటీలోకి వచ్చింది. కానీ, కృనాల్ పాండ్యా(23 నాటౌట్) మెరుపులతో గుజరాత్‌కు ఓటమి తప్పలేదు. ఐదో విజయంతో ఆర్‌సిబి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దూసుకెళ్తోంది. చిన్నస్వామి స్టేడియంలో బౌలర్లు భారీ స్కోర్ సమర్పించుకున్నా.. బ్యాటర్ల మెరుపులతో గుజరాత్ టైటాన్స్‌కు ఆర్‌సిబి చెక్ పెట్టింది. విరాట్ కోహ్లీ(81), దేవ్‌దత్ పడిక్కల్(55) శతక భాగస్వామ్యంతో బలమైన పునాది వేయగా.. కృనాల్ పాండ్యా లాంఛనం పూర్తి చేశాడు. భారీ ఛేదనలో సిరాజ్ ఆదిలోనే ఆర్‌సిబికి షాకిచ్చాడు. విరాట్ కోహ్లీ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను సుందర్ నేలపాలు చేశాడు. అయినా షారుక్ ఖాన్ క్యాచ్‌తో 24 పరుగులకే ఆర్‌సిబి తొలి వికెట్ పడింది. జాకబ్ బెథెల్ (14) సులువైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. బెథెల్ వికెట్ పడినా దేవ్‌దత్ పడిక్కల్, విరాట్ కోహ్లీలు.. దూకుడుగా ఆడి పవర్ ప్లేలో 50 స్కోర్ దాటించారు. ఇద్దరూ అర్ధ శతకాలతో ఆర్‌సిబి విజయానికి బాటలు వేశారు. వీరిద్దరి జోరు చూస్తే అజేయంగా గెలిపిస్తారని పించింది. కానీ, రషీద్ ఖాన్ 13వ ఓవర్లో పడిక్కల్ ఔటవ్వగా.. హోల్డర్ బౌలింగ్‌లో వరసగా రెండు సిక్సర్లతో బెంగళూరు స్కోర్ 150 దాటించిన కోహ్లీ ఆ తర్వాత బంతికే వెనుదిరిగాడు. రషీద్ తన తర్వాతి ఓవర్‌లో జితేశ్ శర్మ(10)ను ఔట్ చేయగా.. డేంజరస్ రజత్ పాటిదార్(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. అంతే.. అప్పటిదాకా ఆర్‌సిబి గెలుపు ఖాయమైన మ్యాచ్‌లో ఉత్కంఠ మొదలైంది. అయినా టిమ్ డేవిడ్ 10 నాటౌట్) క్రీజులో ఉండడంతో ఆర్‌సిబి అభిమానులు నిశ్చింతగా ఉన్నారు. రబడ ఓవర్లో డేవిడ్ సిక్సర్ కొట్టగా.. మానవ్ బౌలింగ్‌లో కృనాల్ పాండ్యా(23 నాటౌట్) రెండు ఫోర్లు, సిక్సర్‌తో చెలరేగాడు. 19వ ఓవర్లో పాండ్యా ఫోర్, సింగిల్ తీయగా ఐదు వికెట్ల తేడాతో గుజరాత్‌పై ఆర్‌సిబి జయభేరి మోగించింది.




టాస్ ఓడినా గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు సాయి సుదర్శన్(100), శుభ్‌మన్ గిల్(32) అదిరే ఆరంభమిచ్చారు. చిన్నస్వామిలో ఆర్‌సిబి బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్న సాయి ఈ సీజన్‌లో రెండో అర్ధ శతకంతో మెరిశాడు. మరో ఎండ్‌లో గిల్ సైతం దంచేయగా.. 10ఓవర్లకే గుజరాత్ స్కోర్ వంద దాటింది. ఈ జోడీని విడదీసేందుకు ప్రయత్నించి సఫలమయ్యాడు. 128 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే సెంచరీ హీరోను హేజిల్‌వుడ్ వెనక్కి పంపిగా గుజరాత్ స్కోర్ వేగానికి బ్రేకులు పడ్డాయి. ఫామ్‌లో ఉన్న జోస్ బట్లర్(25) దంచేస్తాడనుకుంటే అతడిని భువనేశ్వర్ ఔట్ చేసి గుజరాత్‌కు షాకిచ్చాడు. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్(19 నాటౌట్), జేసన్ హోల్డర్(23 నాటౌట్)లు చెలరేగారు. కృనాల్ పాండ్యా వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో హోల్డర్ 6, 6, 4తో గుజరాత్ స్కోర్ రెండొందలు దాటించాడు. సుదర్శన్ సెంచరీ, హోల్డర్ మెరుపులతో గుజరాత్ 3 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది.

# ఢిల్లీపై పంజాబ్ విజయం



పంతొమ్మిదో సీజన్లో ఓటమెరుగని పంజాబ్ కింగ్స్ ఐపిఎల్ చరిత్రను తిరగరాసింది. ప్రత్యర్థి మారినా, లక్ష్యం ఎంతైనా సరే అలవోకగా ఛేదిస్తున్న పంజాబ్ ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక స్కోర్‌ను ఉఫ్మనిపించి రికార్డు నెలకొల్పింది. కెఎల్ రాహుల్(152 నాటౌట్) సెంచరీతో 265 పరుగుల సవాల్ విసిరిన ఢిల్లీకి షాకిస్తూ ఓపెనర్లు ప్రభ్‌స్రిమన్ సింగ్(76), ప్రియాన్ష్ ఆర్య(43)లు ఆకాశమే హద్దుగా చెలరేగి విజయానికి బాటలు వేశారు. స్వల్పవ్యవధిలోనే మూడు వికెట్లు పడినా.. శ్రేయాస్ అయ్యర్(71 నాటౌట్) మరోమారు కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఆరు వికెట్లతో విక్టరీ కొట్టిన పంజాబ్ 13 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ భారీ స్కోర్‌తో గెలుపుపై ధీమాతో ఉండగా.. ఎంతైనా కొట్టేస్తామంటూ పంజాబ్ హిట్టర్లు జట్టుకు ఆరో విజయాన్ని కట్టబెట్టారు. రికార్డు ఛేదన కావడంతో తొలి నాలుగు ఓవర్లలో ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య(43), ప్రభ్‌స్రిమన్ సింగ్(76)లు ఇరగమరగ దంచేశారు. నబీ వేసిన తొలి ఓవర్లో చెరొక సిక్సర్ బాదిన .. ఆపై ముకేశ్ కుమార్ ఓవర్లో తలొక సిక్సర్‌తో ఢిల్లీకి హడలెత్తించారు. అక్షర్ పటేల్‌ను ఉతికేసిన ప్రియాన్ష్ 4, 6, 6తో ఇవరై రన్స్ పిండుకున్నాడు. అయితే.. ఉతుకుడే మంత్రగా సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని అక్షర్ విడదీసి ఢిల్లీకి బ్రేకిచ్చాడు. అనంతరం కుల్దీప్ యాదవ్(246) వరస ఓవర్లలో ప్రభ్‌స్రిమన్, కూపర్ కొన్నొల్లీను ఔట్ చేసి పంజాబ్‌ను ఒత్తిడిలో పడేశాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(71 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ నేహల్ వధేరా(17)లు.. బాధ్యత తీసుకున్నారు. విప్రజ్ నిగమ్ ఓవర్లో వధేరా ఔటైనా దూకుడు తగ్గించని అయ్యర్ కుల్దీప్ ఓవర్లో వరసగా రెండు సిక్సర్లు బాది ఈ సీజన్లో మూడో అర్ధ శతకం సాధించాడు. అంతే.. కొండంత లక్ష్యం చూస్తుండగానే మంచుముక్కలా కరిగిపోయింది. నట్టూ వేసిన 19వ ఓవర్లో శశాంక్ సింగ్(19 నాటౌట్) ఫోర్, అయ్యర్ సిక్సర్ బాదగా మరో ఓవర్ ఉండగానే ఆరు వికెట్లతో పంజాబ్ జయభేరి మోగించింది.

**రాహుల్ అజేయ శతకంతో..** సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కెఎల్ రాహుల్(152 నాటౌట్) ఆకాశమే హద్దుగా అరుణ్ జైట్లీ స్టేడియంలో అభిమానులను బౌండరీల వర్షంలో ముంచెత్తాడు. రాహుల్ పంజాబ్ కింగ్స్ బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగించాడు. పటిష్టమైన పంజాబ్ బౌలింగ్ దళా న్ని తుత్తునియలు చేసిన రాహుల్.. రెండో వికెట్కు నితీశ్ రాణా(91)తో కలిసి 220 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో బౌండరీ ఢిల్లీ భారీ స్కోరందించాడు.

## బిజినెస్

# బడ్జెట్‌లో 7–సీటర్ కార్లు..

మీరు 7 సీటర్ కారు కొనాలని చూస్తున్నారా? అది కూడా అతితక్కువ ధర కోసం ప్లాన్ చేస్తున్నారా? అయితే 2026లో అందుబాటులో ఉన్న కొన్ని కార్ల గురించి తెలుసుకుందాం. ఇవి పెద్ద కుటుంబాలకు సరిపడే విశాలమైన స్థలాన్ని, సౌకర్యాన్ని, ఉపయోగకరమైన ఫీచర్లను అందిస్తాయి. ఈ ఎంపికల జాబితా నిస్సాన్ గ్రావైట్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాతి స్థానంలో బలమైన భద్రతా రేటింగ్‌లను కలిగిన రినాల్ట్ ట్రైబర్ నిలుస్తుంది. ఈ విభాగంలో మహేంద్రా కంపెనీకి చెందిన బొలెరో బెస్ట్ ఆప్షన్‌గా ఉంది. ఇక రూ.8.69 లక్షల ధర కలిగిన మహేంద్ర బొలేరో నియో అయితే, మరింత మెరుగైన పవర్ అవుట్‌పుట్‌ను అందిస్తుంది. మార్కెట్లో రూ.10 లక్షల కంటే తక్కువ ధరలో 7సీటర్ కార్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి మరింత సౌకర్యాన్ని, శక్తివంతమైన ఇంజిన్లను, అధునాతన ఫీచర్లను అందిస్తాయి. అత్యంత చౌకైన 7సీట్ల కార్ల కోసం వెతుకుతున్న వారికోసం ఇవి అనుకూలంగా ఉంటాయి.

**నిస్సాన్ గ్రావైట్ ...**ఈ లిస్ట్‌లో మొదటగా ఉండేది. నిస్సాన్ గ్రావైట్.. ధర రూ.5.65 లక్షల నుండి రూ.8.94 లక్షల మధ్య ఉంటుంది. ఇందులో 8 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌తో అందుబాటులోకి వస్తుంది. అలాగే ఇందులో ఉన్న 1.0లీటర్ పెట్రోల్ ఇంజిన్ 72 బిహెచ్‌పి శక్తిని, 90 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనితో ఇది పెద్ద కుటుంబాలకు అందుబాటులో ఉండే ధరలో బెస్ట్ ఆప్షన్‌గా నిలిచింది.

**రెనాల్ట్ ట్రైబర్...**7సీటర్ కార్లలో రెనాల్ట్ ట్రైబర్ కారు రూ.5.76 లక్షల నుండి రూ.8.6 లక్షల మధ్య ఎక్స్‌షోరూమ్ ధరకు లభిస్తుంది. ఇందులో ఉన్న 1.0లీటర్ పెట్రోల్ ఇంజిన్ 71 బిహెచ్‌పి శక్తిని, 96 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అంతేకాకుండా ఇందులో 8అంగుళాల టచ్‌స్క్రీన్, 4 ఎయిర్‌బ్యాగ్‌లు ఉన్నాయి. ఇది 4స్టార్ జిఎన్‌సిఎపి భద్రతా రేటింగ్‌ను కూడా కలిగి ఉంది.

**మహేంద్రా బొలేరో...** ఈ జాబితాలో మూడో కారుగా ఉన్న మహేంద్రా బొలేరో.. రూ. 7.99 లక్షల నుండి రూ.9.69 లక్షల మధ్య ఎక్స్‌షోరూమ్ ధరకు లభిస్తుంది. ఇది 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్‌తో నడుస్తుంది. ఈఇంజిన్ 75.99 పిఎస్ శక్తితో పాటు 210 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 7అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఫీచర్ అందుబాటులో ఉంది.

**బొలేరో నియో...**బొలేరో నియో 7సీటర్ కారు రూ.8.69 లక్షల నుండి రూ.10.94 లక్షల మధ్య ఎక్స్‌షోరూమ్ ధరకు లభిస్తుంది. ఇది సుమారు 100 పిహెచ్‌పి శక్తిని, 260 ఎన్ఎం టార్క్యూ ఉత్పత్తి చేసే 1.5లీటర్ డీజిల్ ఇంజిన్‌తో వస్తుంది. దీని ఐరెన్ బాడీ ఎంతో ధృఢంగా, ప్రమాదం తీవ్రతను తట్టుకునే విధంగా బిల్డ్ చేయబడింది.

**మారుతి సుజుకి ఎర్టిగా...**మారుతి సుజుకి ఎర్టిగా కారు ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ.8.80 లక్షల నుంచి రూ.12.94లక్షల వరకు ఉంటుంది. ఇది 103 పిఎస్ శక్తిని ఉత్పత్తి చేసే, స్మార్ట్ హైబ్రిడ్ సాంకేతికత కలిగిన 1.5లీటర్ పెట్రోల్ ఇంజిన్‌ను కలిగిఉంది. ఇందులో 7అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ అందుబాటులో ఉంది.

**టయోటా రుమియన్...** టయోటా రుమియన్ ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ.10.51 లక్షల నుండి రూ.13.86 లక్షల మధ్య ఉంటుంది. ఇది 101 పిహెచ్‌పి శక్తిని, 138 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేసే 1.5లీటర్ పెట్రోల్ ఇంజిన్‌ను ఉపయోగిస్తుంది. ఇందులో 7 ఇంచెస్ టచ్‌స్క్రీన్ కూడా అందుబాటులో వస్తుంది.

**కియా కారెన్స్...** కియా కారెన్స్ 7సీటర్ కారు అత్యంత ప్రీమియం ఎంపికగా నిలుస్తుంది. దీని ధర ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ.10.99 లక్షల నుంచి రూ.12.77 లక్షల వరకు ఉంటుంది. ఇది పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఎంపికలను అందిస్తుంది. ఇవి గరిష్టంగా 160 PS శక్తిని ఉత్పత్తి చేస్తాయి. పెద్ద కుటుంబాలకు ఈ కారు ఎంతో అనువుగా ఉంటుంది.



(**గమనిక:** పైన పేర్కొన్న సమాచారం, ధరలు కేవలం వాటి అధికారిక వెబ్‌సైట్ ద్వారా సంగ్రహించనది. ఈ సమాచారం కేవలం పోలిక కోసం మాత్రమే. దేశంలోని ప్రాంతాల వారీగా వాటి ఎక్స్‌షోరూమ్ ధరల్లో మార్పులు ఉండొచ్చు. కాబట్టి, మీ దగ్గర్లోని షోరూమ్‌కు వెళ్లి అసలైన ధరలను తెలుసుకోగలరు.)

# పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు

పేటియం పేమెంట్ బ్యాంక్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బాంబు పేల్చింది. సదరు పేమెంట్ బ్యాంక్ జారీ చేసిన బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఆర్బీఐ తాజాగా ప్రకటించింది. ఏప్రిల్ 24 రోజున రిజర్వ్ బ్యాంక్ ప్రకటన ప్రకారం.. డిపాజిటర్ల ప్రయోజనాలకు హాని కలిగించే రీతిలో వ్యాపారం పేటియం పేమెంట్ బ్యాంక్ నిర్వహించిందని ఆర్బీఐ పేర్కొంది. అదే విధంగా పేటీఎం పేమెంట్ బ్యాంక్ లైసెన్స్‌లో నిర్దేశించిన నిబంధనలను పాటించడంలో సదరు పేమెంట్ బ్యాంక్ విఫలమైందని కూడా ఆర్బీఐ స్పష్టం చేసింది. ఈ క్రమంలో పేటీఎం పేమెంట్ బ్యాంక్ మూసివేత కోసం హైకోర్టులో దరఖాస్తు చేస్తామని కూడా రిజర్వ్ బ్యాంక్ ఆ ప్రకటన చేసింది. 'భారతీయ రిజర్వ్ బ్యాంక్, 2026 ఏప్రిల్ 24 నాటి ఉత్తర్వు ద్వారా.. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1949 (బిఆర్ చట్టం) లోని సెక్షన్ 22(4) కింద పేటీఎం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్ కు జారీ చేసిన బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసింది. ఈ రద్దు ఏప్రిల్ 24, 2026 రోజున బ్యాంకింగ్ పనిచేసే సమయం ముగిసిన సమయం నుండి తక్షణమే అమల్లోకి వస్తుంది' అని ప్రకటన వచ్చింది. 'ఈ లైసెన్స్ రద్దు




కారణంగా పేటిఎం పేమెంట్స్ బ్యాంక్ ఇకపై 'బ్యాంకింగ్' నియంత్రణ చట్టం, 1949లోని సెక్షన్ 5(బి)లో నిర్వచించిన విధంగా 'బ్యాంకింగ్' వ్యాపారాన్ని గానీ, లేదా సెక్షన్ 6 కింద పేర్కొన్న ఏ ఇతర అదనపు వ్యాపారాన్ని గానీ నిర్వహించడంపై తక్షణమే నిషేధం అమలులో ఉంటుంది. ఆ బ్యాంక్ మూసివేత కోసం ఆర్‌బిఐ హైకోర్టులో దరఖాస్తు చేస్తుంది' అని ఆర్‌బిఐ ఒక ప్రకటనలో తెలిపింది.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకూ పోరాటాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్



**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి 29 చట్టాలను పునరుద్ధరించాలని, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను వెనకకు తీసుకునేంతవరకు పోరాటం ఆగదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ అన్నారు. శనివారం టిఎస్, బిపిఎల్, ఐఎంఎఫ్ఎల్ కార్మికులతో కలిసి మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మేడే కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు, మేడే సెమినార్లు, సదస్సులు ఏర్పాటు చేసి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లపై పోరాటం చేయాలన్నారు. కొత్త చట్టాలు కార్మికుల హక్కులను బలహీన పరుస్తున్నాయని, ఉద్యోగ భద్రత తగ్గిస్తున్నాయని ఆయన ఆరోపించారు. యజమానులు ఉద్యోగులను తొలగించడానికి కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌చట్టాలు సులభతరంగా మారాయన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేసి బానిసలుగా మార్చేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు శేఖర్, కిరణ్ మోహన్, పెద్దిరెడ్డి, వినయ్, యాదయ్య, నాగయ్య, వెంకట్ నాయక్, రాము, నరేష్, మహేష్, విజయ్, శంకర్, వినోద్ పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలపై అవగాహన – ఆత్మవిశ్వాసం పెంపునకు ఎఐఎస్‌ఎఫ్ కృషి



సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి

ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలలో, పలు కాలేజీలలో మోడల్ ఎంసెట్, నీట్ కాంపిటేటివ్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 950 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థలలో ప్రశ్నాపత్రం ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి హాజరై మాట్లాడుతూ పోటీ పరీక్షలపై అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపునకు ఎఐఎస్‌ఎఫ్ కృషి చేస్తుందని, అందులో భాగంగా మోడల్ పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. మోడల్ పరీక్షలు రాయడం ద్వారా పరీక్షల పట్ల భయాందోళనలు తొలగి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యసాధనకు కట్టుబడి ఉంటే విద్యార్థులు తప్పకుండా విజయాన్ని అందుకుంటారన్నారు. విద్యార్థులు నిజమైన పరీక్ష అనుభవాన్ని పొందేలా ప్రశ్నాపత్రాలు రూపొందించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీతగౌడ్, కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ మోడల్ పరీక్షల ద్వారా విద్యార్థులు తమ లోపాలను గుర్తించి, మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందని, ఇది వారి భవిష్యత్ విజయానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎఐఎస్‌ఎఫ్ అనేక సంవత్సరాలుగా విద్యార్థుల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని మోడల్ పరీక్షలను నిర్వహిస్తూ వస్తోందని, పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించడం, మానసిక ధైర్యాన్ని బలపరచడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భానుప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శులు బొజ్జు జ్యోతి, బండి లావణ్య, నీరజ, యాస్మిన్, సమీక్ష, అనూష, హర్షిత్, అఖిల్, నందుతో పాటు పలు కళాశాలల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు పెండింగ్‌లో ఉంటే జీవనం సాగించేది ఎలా?

ఎఐటియుసి ఖమ్మం జిల్లాప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

**ప్రజాపక్షం/కల్లూరు :** మున్సిపాలిటీ కార్మికులకు వేతనాలను చెల్లించకపోతే వారి జీవనాన్ని ఏ విధంగా కొనసాగించాలని ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ కార్మికుల తొమ్మిది నెలల పెండింగ్ విత్తనాలు చెల్లించాలని కోరుతూ కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో రామాంజనేయులు మాట్లాడుతూ గత నెలలోనే సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని మున్సిపల్ చైర్మన్ చర్చలు జరిపి 15 రోజుల్లో జీతాలను వేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు జీతాలు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. 9 నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారికి ఇంటి రెంట్‌తో పాటు, నిత్యవసర వస్తువులు కొనుక్కోవటం ఇబ్బందిగా మారిందన్నారు. వేతనాలను చెల్లించిన యెడల మే రెండవ తారీకు నుండి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.. అనంతరం సమ్మె నోటీసును కల్లూరు సబ్ కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా సమితి సభ్యులు రహమతుల్లా, మున్సిపల్ స్టాఫ్‌అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఓడల కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి సయ్యద్ వజీర్ మియా, నాయకులు సుధాకర్, ప్రకాష్, గొల్లమందల యశోద, అంజలి, బాబు, మణిరాజ్, చింతపల్లి శ్రీను, రాము పాల్గొన్నారు.




## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సి.రాజు మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల కోసం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న హైదరాబాద్‌లోని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి వరకు వేలాది మంది విద్యార్థులతో పాదయాత్ర నిర్వహించి నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, రాజశేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ బి.మహేష్ బాబు, భరత్, సంజీవ్, నాగరాజు, శివలింగం, అశోక్, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ రేట్లు పెంపు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కిరాణం జనరల్ మర్చంట్ అసోసియేషన్ యాజమానుల ఆధ్వర్యంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం శనివారం హమాలీ రేట్లు పెంచారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రత్నశేఖర్ ప్రధాన కార్యదర్శి బద్రి కోశాధికారి మధురెడ్డి మరియు ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్‌లా ఆధ్వర్యంలో వర్తక సంఘం ఫంక్షన్ హాల్‌లో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా యాజమాన్యులతో కార్మిక సంఘం నేతలు చర్చించి నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కార్మికుల రేట్లు పెంచాలని కోరారు. అనంతరం పెంచిన రేట్లపై యాజమాన్యాలు మరియు ఎఐటియుసి నేతలు ఆమోదం తెలిపి సంతకాలు చేశారు. ఈ చర్చల్లో ఎస్‌వి నాగేశ్వరరావు, రమేష్ సోమయ్య, ఉమా శంకర్, విద్యాసాగర్, నారాయణమూర్తి, కృష్ణమూర్తి, వెంకన్న, రామారావు, నరేష్, సిటీ హమాలీ మేస్త్రీలు రాము, లింగయ్య, రమేష్, బద్రి, పెద్ద లింగయ్య, రమేష్ , కార్మికులు, వెలుగు శ్రావణ్, పెరుగు కుమార్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఐక్యతతోనే కార్మిక హక్కుల పరిరక్షణ



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని సహాయ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎఐటియుసి జగిత్యాల జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎశమేని గణేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఐక్యతే వారి బలమని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధన కోసం జరిగిన పోరాటాలకు మేడే ప్రతీకగా నిలిచిందన్నారు. కార్మికుల కష్టానికి తగిన గౌరవం ఇవ్వాలని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు కట్టుబడి పనిచేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, ముఖ్యంగా ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు,సామాజిక భద్రత అంశాల్లో కార్మికులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు రామిల్ల రాంబాబు, ఎండి ఉస్మాన్, సమీర్,సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు గద్దల బాలరాజు,జలంధర్, నాగరాజు,మల్లాపూర్ రాజన్న,తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

ప్రజాపక్షం/నిజామాబాద్ : కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా సమితి సమావేశాన్ని శనివారం నిర్వహించామన్నారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. 1886లో కార్మికులకు 8 గంటల పని దినం ఉండాలని పని భద్రత కనీస వేతనాలపై పోరాడి హక్కులు సాధించిన దినంగా మేడే జరుపుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు,సామాజిక భద్రత అంశాల్లో కార్మికులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని విమర్శించారు. ఉద్యమాలు, పోరాటాలతోనే కార్మిక హక్కుల రక్షణ సాధ్యమవుతుంద ని సుధాకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు హన్మాండ్లు, దేవేందర్, అనిల్, రాజన్న, భాగ్యలక్ష్మి , కవిత, గోవర్ధన్, భానుచందర్, వసంత, రాములు, రమేష్, శ్రీనివాస్, ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



# తాగునీటి ఎద్దడిపై సత్వరమే స్పందించాలి

పైపులైను పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

ఎమ్మెల్యే కూనంనేని





**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** వేసవిలో ఎదురయ్యే తాగునీటి ఎద్దడిపై అధికారులు తక్షణమే స్పందించి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సింగరేణి అతిథి గృహంలో మిషన్ భగీరథ, కొత్తగూడెం కార్పొరేషన్ చైర్మన్, పబ్లిక్ అండ్ హెల్త్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా బోర్ల మరమ్మతులు ఉంటే తక్షణమే చేయాలని, అవసరమైన చోట కొత్తబోర్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీటి సరఫరాలో అంతరాయం వాటిల్లకుండా పైపులైన్ల లీకేజీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. కొత్తపైపు లైన్ల ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. కొనసాగుతున్న నీటి పథకాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తేవాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ చివరి ఇంటికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సమస్యపై ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ గణేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మానసిక ప్రశాంతతకు క్రీడలు..**

ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి సిఇఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్,గేమ్స్ కోచింగ్ క్యాంపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ క్రమ శిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తుందని ఆకాంక్షించారు. క్రీడలు కేవలం శారీర దృడత్వానికే కాకుండా మానసిక ప్రశాంతతకు, ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. వేసవి సెలువులు కేవలం వినోదానికే కాకుండా విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకుని తమలో అంతర్గత ప్రతిభను వెలికి తీయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు ఈ ఉచిత శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేటి తరం పిల్లలు సెల్‌ఫోన్లతో ఇళ్లకే పరిమితం కాకుండా మైదానాల్లో చమటోడ్చి ఆటలు ఆడి రేపటి ఛాంపియన్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ శిబిరంలో కబడ్డీ, క్రికెట్,స్విమ్మింగ్, యోగా, అథ్లెటిక్స్, నెట్‌బాల్, ఆర్చరీ, బాస్కెట్ బాల్, బాక్సింగ్, టెన్నిస్ వంటి పది రకాల క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జూన్ 7 వరకు సాగే ఈ శిబిరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని మెళుకువలు నేర్చుకోవాలని కోరారు. క్రీడల ద్వారా అలవడే ఓర్పు, పట్టుదల జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులను సింగరేణి సహకారంతో కల్పిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు పోత్సహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి పరంధామిరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి మహేందర్, మట్టపర్తి రమేష్, యుగంధర్ రెడ్డి, రమేష్ నాయుడు, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున, నాగేందర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం పట్ల ఆర్టీసీ కార్మికుల హర్షం



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య జరిగిన సానుకూల చర్చలతో విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో మధిర ఆర్టీసీ డిపో వద్ద శనివారం కార్మికులు హర్షం వ్యక్తంచేస్తూ సంబరాలు నిర్వహించారు.ముందుగా ఆర్టీసీ సమ్మెలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న శంకర్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షుడు మిర్యాల రమణగుప్త మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. కార్మికుల 32 డిమాండ్లలో ఎక్కువ భాగం పరిష్కారమవ్వడంతో ఉద్యోగుల్లో సంతోషం నెలకొందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆర్టిసి చర్చల్లో పాల్గొని సమస్యలు పరిష్కారానికి సాధ్యమైన విధంగా విజయవంతం చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమ్మెకాలంలో నర్సంపేట డిపో డ్రైవర్ కె.శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపిందని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్‌చైర్మన్ కోన ధనికుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, దుంప వెంకటేశ్వరరెడ్డి, అద్దంకి రవికుమార్, చిలువేరు బుచ్చి రామయ్య, కోరంపలి లచంటి, పత్తేపరపు సంగయ్య ఆవుల కిరణ్, సూర్యదేవర కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో విజిలెన్స్ దాడులు

**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు కొర్లగూడెం, పేరువంచ గ్రామాల్లో రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి, సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఓ ఎస్ డి అంజయ్య తెలిపారు. ఉండాల్సిన బియ్యం కన్నా అధికంగా ఉండటంతో కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ నరేష్ తెలిపారు. అక్రమాలకు పాల్పడితే ఎవరినైనా వదిలేది లేదని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నట్లు తెలిసినట్లయితే సమాచారాన్ని అందించాలని వారి సమాచారాన్ని రహస్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## పోలీసులకు.. దొంగలు సవాల్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలంలో వరుస దొంగతనాలతో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గత కొన్ని రోజులుగా బేతుపల్లి, సత్తుపల్లిలో జరిగిన దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని మెయిన్ రోడ్ నందు వేర్వేరు ప్రాంతాలలోని షాపుల్లో నలుగురు దుండగులు చోరీకి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సత్తుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న షాపులను టార్గెట్ చేసుకుని దొంగతనానికి పాల్పడ్డారు. బాలాజీ స్వీట్ షాప్‌లో సుమారు రెండు వేల నగదు, అనూస్ కూల్ డ్రింక్స్ అండ్ బెల్ట్ షాప్‌లో సుమారు పది వేల రూపాయల మద్యం సీసాలను దొంగతనం చేశారు. అదే విధంగా మసీద్ రోడ్డులో గల పాన్ షాప్ తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించాక ఏమీ దొరకకపోవటంతో అక్కడ నుండి ఉడాయించారు. అయితే ఆ నలుగురు దుండగులు చోరీకి పాల్పడిన దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు అవ్వటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సిసి పుటేజ్ ఆధారంగా సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎఐయుకెఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం దురదపాడు గ్రామంలో శనివారం అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఎఐయుకెఎస్) జాతీయ మహాసభల గోడ పత్రికలను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుంజా అర్జున్ అధ్యక్షతన రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మే నెల 11, 12, 13 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు పట్టణంలో ఎఐయుకెఎస్ జాతీయ మహాసభలు వైభవంగా జరుగనున్నాయని, దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు భవిష్యత్ కార్యచరణను రూపొందించేందుకు జరుగుతున్న ఈ మహాసభలను రైతులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ధర్మ శ్రీరాములు, మెచ్చు సోమరాజు, కారం రాజులు, పాయం పోతురాజు, సున్నం రామారావు, పూనెం దుర్గ, మాజీ సర్పంచ్ కుంజా లక్ష్మీ , నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా పారదోలుదాం

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బారావు




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** దోమలను నివారించి మలేరియాను పారదోలుదామని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బారావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ దోమల పెరుగుదలను అరికట్టడం వల్ల మలేరియాను అంతం చేయగలమని అన్నారు. మలేరియా నివారణకు పాటించవలసిన ముఖ్యమైన చర్యలు ఇళ్లలో, పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నీటి ట్యాంకులు, డబ్బాలు మూతలతో మూసి ఉంచాలని, రాత్రి పూట దోమతెర వినియోగించాలని, దోమలను నివారించే మందులను, మస్కిటో బ్యాట్‌ను వినియోగించాలని సూచించారు.జ్వరం, చలి, వణుకు, ఒళ్లునొప్పులు, వాంతులు, అలసట ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకొని మందుల వాడాలని అన్నారు. మన సంకల్పం మలేరియా రహిత భారత్ అని, మన చర్యలు, మన రక్షణ ఆరోగ్యకరమైన కుటుంబంసురక్షితమైన సమాజం అని, మలేరియా రాకుండా ప్రతి ఒక్కరూ కలిసి చేద్దామని, దోమల పెరుగుదలను ఆపుదాం, మలేరియాను నిర్మూలిద్దాం, తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా తప్పక దూరమతుందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, హెల్త్‌ఇన్స్‌స్పెక్టర్ మహ్మద్ మన్నన్, ఇతగాని వెంకటేశ్వర్లు, అర్బన్ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

## ‘ప్రజా దర్బార్’ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

న్యాయమైన సమస్య అయితే పరిష్కరించే బాధ్యత నాదే

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రజల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ‘ప్రజా దర్బార్’ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు సంబంధించిన అర్జీలను స్వీకరించిన మంత్రి, సుమారు ఐదు గంటల పాటు ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, కానీ నేడు ప్రజా ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తోందని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగమే ఈ ప్రజా దర్బార్ అని వివరించారు. ప్రజలకు మంచి జరిగే పనిని ఏ పార్టీ వారు అడిగినా రాజకీయాలకు అతీతంగా చేస్తామని హామీ ఇచ్చారు. 27 నుండి ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వేసవి కాలంలో ఎదురయ్యే తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు ముఖ్యంగా భూ సమస్యలను పాలేరు నియోజకవర్గంలో ముందుగా పరిష్కరించి, ఆ తర్వాతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి ప్రకటించారు. ప్రజా దర్బార్ పెట్టామంటే ప్రజలకు మా ప్రభుత్వంపై విశ్వాసం ఉందని అర్థం. ఒక్క మీటింగ్‌తోనే అన్నీ పరిష్కారం కాకపోవచ్చు. కానీ మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే మీ ఇంటి పెద్ద కొడుకుగా పరిష్కరించే బాధ్యత నాది అని భావోద్వేగంగా పేర్కొన్నారు. దరఖాస్తులన్నింటినీ ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపుసల సీతారాములు, కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, నంబూరి రామారావు, జెర్రిపోతుల అంజనీ కడియాల నరేష్, సర్పంచులు బోయిన వేణు, రామారావు, అశోక్, రాణి, లక్ష్మణరావు, శివాజీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓర్సు రమేష్ ధన్యజీవి

ఆయన మృతి సిపిఐకి తీరని లోటు

సంతాపసభలో దండి సురేష్



**ప్రజాపక్షం/ తల్లాడః** తల్లాడ మండల కేంద్రంలో తల్లాడ సిపిఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ సంతాప సభ జిల్లా సమితి సభ్యుడు మద్దోజు శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ఓర్సు రమేష్ ధన్యజీవి అని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టుల అవసరం గుర్తిస్తున్న సమయంలో ఒక గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. తల్లాడ మండలంలో పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఓర్సు రమేష్ కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు యర్రా బాబు, జాగర్లమూడి రంజిత్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, రావి శివరామకృష్ణ, పోట కళావతి, జిల్లా సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా నాయకులు నల్లమోతు నర్సింహారావు, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు దారావత్ శ్రీను, నాయకులు నాగమణి, తమ్మరపు వెంకటేశ్వర్లు, మంకెన కృష్ణ పాల్గొన్నారు.

## నాలుగురోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం: కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో తాగునీటి సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసిలో నిర్వహించిన జూమ్ సమీక్షా సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతీ గ్రామానికి నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. నీటి ఎద్దడి గల ప్రాంతాలను గుర్తించి వేరే ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. మోటర్ల మరమ్మతులను చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని పెండింగ్ తాగునీటి సమస్యలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో నీటి కొరత సమస్య అధికంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యను త్వరగాపరిష్కరించాలని ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలలో

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం జరుగుతుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బూర్గంపాడు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారులను ఆశీర్వదించారు. వేపలగడ్డ గ్రామానికి చెందిన లబ్ధిదారు తాటి సరోజిని గృహ ప్రవేశం, అదే విధంగా సందేళ్లరామాపురం గ్రామంలో పెద్దోజు అనూష గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలకు సొంత ఇల్లు కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం అందేలా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వసతి మెరుగుపరచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎస్ఐ మేడ ప్రసాద్, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బట్టా విజయ్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పి సుధాకర్‌రెడ్డి, సర్పంచులు బొల్లి నిరోశ, వర్స మంగమ్మ, తాటి లక్ష్మీ , బొర్రా సుభద్ర, తాటి వాణి, బాదం వెంకటేశ్వరరెడ్డి, పూణెం సురేందర్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సొసైటీ నామినేటెడ్ సందడి

ఎన్నికలు లేకుండానే పాలక మండళ్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నామినేటెడ్ సందడి మొదలైంది. అధికార పార్టీ నేతల్లో కదలిక ప్రారంభమైంది. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రి వర్గం ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పాలక వర్గాలను నామినేటెడ్ చేయాలని నిర్ణయించింది. ఖమ్మం డిసిసిబి పరిధిలో 101 ప్రాథమిక సంఘాలు ఉన్నాయి. గతంలో 2020లో ఈ సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఈ దఫా ఎన్నికలు నిర్వహించకుండా పాలక వర్గాలను నియమించితే అధికార పార్టీకి చెందిన వారికే పదవులు దక్కే అవకాశం ఉంది. ప్రతి సహకార సంఘంలోనూ 13 మందితో పాలక వర్గాలను ఏర్పాటు చేయడంతో పాటు గతంలో మాదిరి రిజర్వేషన్లను కూడా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లో ఆశావాహుల్లో సందడి మొదలైంది. ఆయా సొసైటీల పరిధిలోని సహకార సంఘాల అధ్యక్ష పదవి కోసం పైరవీల జోరందుకుంది. ఖమ్మం జిల్లాలో బోనకల్ మండలంలో అత్యధికంగా తొమ్మిది సొసైటీలు ఉన్నాయి. నియోజక వర్గాల పరం గా చూస్తే సత్తుపల్లిలో ఎక్కువ సొసైటీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం మినహా అన్ని నియోజక వర్గాల్లోనూ అధికార పార్టీ శాసన సభ్యులే ఉండడంతో శాసనసభ్యుల అనుచరులు పైరవీల కోసం అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. సొసైటీ అధ్యక్షులు డిసిఎంఎస్, డిసిసిబి ఛైర్మన్లను ఎన్నుకుంటారు. తర్వాత ఆప్కాబ్ చైర్మన్ ఎన్నిక జరుగుతుంది.

## నేడు రామాలయంలో కళావాహన

మధ్యాహ్నం వరకూ దర్శనాలు బంద్

వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాట్లు



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాభివృద్ధి పనుల్లో భాగంగా నేడు రామాలయంలో జీర్ణోద్ధరణ అనుజ్ఞ, కళావాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు వైదిక కమిటీ అన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో చినజీయర్ స్వామి పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆలయంలో భక్తులకు దర్శనాలను నిలిపివేయనున్నారు. రంగనాయకుల గుట్టపై ఉన్న ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుండి భక్తులకు స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేశారు. అదే ప్రాంతంలో 72 మంది దేవతామూర్తులను భద్రపరిచనున్నారు. విస్తరణ పనుల్లో భాగంగా రూ.351 కోట్ల తొలిదశ పనులకు కేటాయించిన విషయం విధితమే. ప్రభుత్వం నిధులు విడదల చేయడంతో నేటి నుండి రామాలయ అభివృద్ధి తొలిదశ పనులకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే శుక్రవారం ఆర్అండ్ బి అధికారులు మార్కింగ్ కూడా చేశారు. ప్రస్తుతం ఉన్న ఆలయ ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులు జరగనున్నాయి. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సమయంలో స్వామివారు భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శనభాగ్యాన్ని ఇస్తారు. ప్రస్తుతం ఉన్న ఉత్తర ద్వారాన్ని మరింతగా వెడల్పు చేసిందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం సుమారు వెయ్యి మంది మాత్రమే దర్శనం కోసం క్యూలైన్లలో ఉండే వెసులుబాటు ఉంది. కానీ విస్తరణ తర్వాత 1500 నుండి 2 వేల మంది వరకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉండేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. అంతే కాకుండా భక్తులు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా నాలుగు గదులను సైతం నిర్మించనున్నారు. ఈ గదుల్లో సుమారు 3 వేలమంది వరకు వీలుంటుంది. క్యూలైన్లలో భక్తులు కదిలేందుకు ఆలస్యమైతే వారి కూర్చుని విశ్రాంతి తీసుకునేందుకు కూడా సదుపాయాలు కల్పిస్తున్నారు. మూల వరుల దర్శనం తర్వాత కూర్చునేందుకు సదుపాయాలు, మరుగుదొడ్ల వెసులుబాటు కల్పిస్తున్నారు. అదే విధంగా వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

## భానుడి భగభగలు...

# అల్లాడిపోతున్న ప్రజలు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

జాగ్రత్తగా ఉండాలని అధికారుల హితవు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎండలు మండిపోతున్నాయి. మే మాసానికి ముందే 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 10 గంటలకు బయటకు రాలేని పరిస్థితి. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో భానుడు భగభగలకు ప్రజలు తాళలేకపోతున్నారు. ముఖ్యంగా సింగరేణి ఉపరితల గనుల వద్ద అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇల్లందు, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు పారిశ్రామిక ప్రాంతాల్లో వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. గతంలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు యాజమాన్యాలు చర్యలు చేపట్టాయి. మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వడం, భూ ఉపరితలాన్ని నీళ్లతో చల్లి ఉష్ణోగ్రతలు తగ్గించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు అటువంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవల గోదావరి పరివాహక ప్రాంతంలోని చర్లలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి పరిస్థితి ఇలా ఉండగా ఎండ వేడిమికి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. రానున్న నెల రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడక ముందే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల వరకు నాగార్జున సాగర్ కాలువకు నీళ్లు రావడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో భూగర్భ జలాల పరిస్థితి ఫర్వాలేదనిపించిన మిగిలిన ప్రాంతాల్లో మాత్రం ఈ ఏడాది నీటి కష్టాలు తప్పకపోవచ్చునన్న భావన ఏర్పడింది. అత్యధిక అటవీ ప్రాంతం కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అటవీ ప్రాంతంలో జంతువుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరి నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. ఎండ వేడిమికి ప్రజలు బయటకు రాకపోవడంతో వీధి వ్యాపారుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. మొత్తం ఈ ఏడాది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న కాలం లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ప్రచారం ఆందోళనను కలిగిస్తుంది. ఇదిలా ఉండ గా ఎండకు వీలైనంత మేర ప్రయాణాలు మానుకోవాలని తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళితే తప్పనిసరిగా ఉపశమన చర్యలు చేపట్టాలని వైద్యు లు సూచిస్తున్నారు. ఉపాధి హామీ కూలీలు, రోజు వారి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు మాయం



ప్రజాపక్షం/ వరంగల్ : తెలంగాణ రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల నుండి కిచెన్ గార్డెన్లు అకస్మాత్తుగా కనుమరుగవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లాహ్ ఖాద్రి విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు, విద్యార్థుల పోషకాహారాన్ని మెరుగుపరచడానికి, సహజమైన కూరగాయలను అందించడానికి, అలాగే పర్యావరణ అవగాహన పెంచడానికి ముఖ్యమైన భాగంగా ఉండేవన్నారు. అలాంటి ముఖ్యమైన కార్యక్రమం ఆకస్మాత్తుగా నిలిచిపోవడం ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యాన్ని చూపుతున్నదనే స్పష్టమైన ఉదాహరణ అన్నారు.

## ఆర్‌టిసి కార్మికులకు ప్రజాపాలన ప్రభుత్వంలోనే సరైన న్యాయం

ప్రజాపక్షం/తొర్రూరు : ఆర్‌టిసికార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన సమ్మెకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం సరైన న్యాయం చేసిందని ఎఐటియుసిమహబూబాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడుఓమ బిక్షపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్‌టిసి కార్మికులు 45 రోజులు నిరవధిక సమ్మె చేస్తే సమ్మెను అణగదొక్కి కార్మికుల హక్కులను భంగం కలించి కార్మిక సంఘాలను రద్దు చేసిన ఘనతబిఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొంత కాలయాపన జరిగినా తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లిన ఆర్‌టిసికార్మికులకు ప్రజాపాలన ప్రభుత్వం సరైన న్యాయం చేసిందన్నారు. అలాగే ఆర్‌టిసిలో కార్మిక సంఘాలకు పిఆర్‌సిని కూడా గౌరవప్రదంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి కార్మికులు ఒకతాటిపై ఉండి తమ హక్కుల సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలు చేసి న్యాయమైన హక్కులను రక్షించుకోవడంలో ఐక్యతను చాటాలని అన్నారు. ఆర్‌టిసి కార్మికులు తమ న్యాయమైన సమస్యల కోసం నిర్వహించిన సమ్మెకు న్యాయం చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## గిరిజన చట్టాలపై అధికారులకు పూర్తి అవగాహన: కలెక్టర్

ప్రజాపక్షం/ములుగు:అధికారులు గిరిజన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, చట్టాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ హక్కుల, పేసా, ఎల్‌టిఆర్ చట్టాలపై ఎంపిడిఓలు, తహసీల్దార్లు, ఎంపిఓలు, పోలీస్, అటవీ, రెవెన్యూ, అధికారులకు గిరిజన చట్టాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన అటవీ హక్కుల చట్టం, పేసా చట్టం, భూ బదిలీ నియంత్రణ (ఎల్‌టిఆర్) చట్టాలపై అధికారులకు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి అవగాహనతో చట్టాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఐటిడిఏ ఏపిఓ నాగోరావు, డిఆర్‌డిఏ పిడి చంద్రశేఖర్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఫారెస్ట్, పోలీస్ అధికారులు, వివిధ గిరిజన సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా జనగణనలో నివాస గృహాల లెక్కింపు




ప్రజాపక్షం / వేలేరు : జనగణనలో బాగంగా చేపట్టనున్న నివాస గృహాల లెక్కింపును ఖచ్చితత్వంతో పకడ్బందీగా నిర్వహించాలని వేలేరు మండలతహశీల్దార్ హెచ్ కోమి అన్నారు.శనివారం వేలేరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో ఈనెల 18 ,నుండి21,వరకు మొదటి దశ,23,నుండి 25వరకు రెండవ దశ ఆరు రోజుల పాటు సూపర్‌వైజర్లకు,ఎన్యుమరేటర్ల గృహ జనగణన శిక్షణా ముగింపు కార్యక్రమం నిర్వహించగా ఈకార్యక్రమానికి ముఖ్యఅథిథిగా తహశీల్దార్ హెచ్ కోమి హాజరై మాట్లాడారు.మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రతి ఇంటికి సంబందించిన కుటుంబ సభ్యుల వివరాలతోపాటుగా ప్రతిఇంటిని సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఎన్యుమరేటర్లకు,సూప్ వైజర్లకు పలుసూచనలు చేస్తూ సర్వేకు సంబందించిన డిజిటల్ సామాగ్రిని అందించారు.కార్యక్రమంలో ఎంఆర్ఓ కోమి,ఎంఇఓ మొగిళిచెర్ల చంద్రమౌళి,డిప్యూటి తహశీల్దార్ విఠలేశ్వర్,ఎస్ఓ స్రవంతి,ఆర్ఐ సురేందర్,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు ట్రైనర్స్ పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు



ప్రజాపక్షం/నడికూడ : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు వెంకటేశ్వర్లపల్లె గ్రామంలో పిఎసిఎస్,ఐకెపి కేంద్రాలలో వరిధన్యం కొనుగోలు కేంద్రాలను పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజాప్రభుత్వంలో రైతులను రాజులను చేయటం కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ ఉద్దేశంగా ఐకెపిల ద్వారా వరిధన్యం కొనుగోలు కేంద్రాలను నడిపించి మహిళలకు ఆర్థికంగా భరోసాను ఇస్తున్నారని గత కొన్నేళ్లుగా లేని విధంగా మక్క కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మక్కలకు అధిక ధరను అందిస్తున్నారని రైతులు దళారులను నమ్మి పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని తెలిపారు. స్థానిక సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి,నార్లపూర్ సర్పంచ్ రవీందర్ యాదవ్,ఎంఎఓ జై సింగ్, ఏపిఎం నాగేశ్వర రావు,సొసైటీ ఇన్చార్జ్ జ్యోతి,ఎఇఒలు ప్రదీప్,రామకృష్ణ,సిసి హేమలత, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు అంజిరెడ్డి,చైతన్య గ్రామైఖ్య సంఘం సభ్యులు హరిత,సంధ్య,అనిత విఓఎసుమలత, రైతులు పాల్గొన్నారు.

# భానుడి ఉగ్రరూపం



**రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

**నిప్పుల కొలిమిని తలపిస్తున్న వరంగల్**

ప్రజాపక్షం/హనుమకొండ: భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజులుగా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు సుర్రుమనిపించడంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండుతున్న ఎండలతో ప్రజలకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగలు ఎండ, రాత్రి పూట ఉక్కపోతతో సతమతమవుతున్నారు.జిల్లాలో వారం,పది రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సాధారణ స్థితిని దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఏడాదికి మించి ఎండలు దంచి కొడుతున్నాయి. గత ఏడాది మే నెలలో 40 నుం చి 42 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లోనే 42 డిగ్రీలకు పైకి చేరింది. ఏప్రిల్ నెల ప్రారంభం నుండే ఎండలు మండుతున్నాయి. ఇక మే నెలాఖరు వరకు రోహిణి కార్తెలో ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు భయపడుతున్నారు. ఎండల తీవ్రతల వల్ల ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. అవసరం ఉంటే తప్ప బయటకు రావడం లేదు. భానుడి ప్రతాపానికి ప్రజలు సతమతమ వుతున్నారు. ఉదయం 7 గంటలకు ఎండ తీవ్రత ప్రారంభమవగా 11 గంటలకు తీవ్రమవుతోంది. మధ్యాహ్నం పూట ప్రజలు బయటకు రావడమే లేదు. ఎండ తీవ్రతకు భయపడి మధ్యాహ్నం వేళల్లో పనుల్ని వాయిదా వేసుకుంటున్నారు. సాయంత్రం 6 గంటలకు కూడా ఎండ ఉంటుండడంతో వాతావరణం చల్లబడిన తర్వాతే జనం బయటకు వస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావడం లేదు. దీంతో రోడ్లన్నీ 12 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి.

**పెరిగిన ఎసి,కూలర్ల అమ్మకాలు**

ఎండలు దంచి కొడుతుండడంతో వాటి నుంచి ఉపశమనం పొందేందుకు జనం వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. శీతల పానీయాలు, పండ్ల రసాలు, సోడాలు వంటి వాటిని ఆశ్రయిస్తున్నారు. పని మీద బయటకు వచ్చిన వారు కచ్చితంగా జ్యూస్, సోడా బండ్ల వద్ద కొద్దిసేపు సేద తీరే వెళ్తున్నారు. బైక్‌ల మీద ప్రయాణం చేసే వారు మధ్యలో చెట్ల కింద ఆగి ఆగి వెళ్తున్నారు. ఎండ తీవ్రతతో కూలర్లు, ఎసిల అమ్మకాలు పెద్ద మొత్తంలో పెరిగాయి. గతంలో ధనికుల ఇళ్లలో మాత్రమే కనిపించి ఎసిలు ప్రస్తుతం మధ్య తరగతి ఇళ్లలోనూ కనిపిస్తున్నాయి. ఎండ వేడిమికి తట్టుకోలేక తక్కువ ధరలో, చిన్న కంపెనీల ఏసీల వైపు మధ్య తరగతి ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

**తీవ్రత దృష్ట్యా అప్రమత్తత అవసరం**

ఎండలు అధికంగా ఉంటుండడంతో వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలకు మరింత ఇబ్బందిగా మారింది. వేసవి తీవ్రతకు ముఖ్యంగా వృద్ధులు అస్వస్థతకు గురవుతున్నారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురవుతున్నారు. ఎండలు దంచి కొడుతుండడంతో అప్ర మత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యం గా ఎండలో పనిచేసే రైతులు, భవన నిర్మాణ, ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. ఎండలో పనిచేయడం, తిరగడం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ క్రమంలో క్రమం తప్పకుండా నీటిని తాగుతూ ఉండాలి. వీటితో పాటు పండ్ల రసాలు, ఓఆర్ఎస్ద్రావణం వంటివి తీసుకుంటూ ఉండడం వల్ల వడదెబ్బ తాకకుండా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

## అక్రిడిటేషన్ కమిటీ జాబితాలో అవకతవకలు

**ఒకే సంఘం నుండి ఇద్దరి పేర్లు**

**ఒక్కరి పేరు రెండు సార్లు**

**అనుభవం లేనివారికి అవకాశాలు**

ప్రజాపక్షం/జనగామ:జనగామ జిల్లా అక్రిడేషన్ కమిటిలో అవకతవకలు జరిగాయి. జిల్లా కలెక్టర్ సంతకంతో జారీ చేసిన పత్రంలో ఒకే సంఘం నుండి రెండు పేర్లు, ఒకే వ్యక్తి పేరు రెండు సార్లు రావడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కలెక్టర్ నామినేటెట్ చేసే జాబితాలో ధరఖాస్తు చేసుకోని వారి పేర్లను నమోదు చేసి ధరఖాస్తు చేసుకున్న వారి పేర్లను విస్మరించారు. ఇక కొందరు కొత్త వారి (అనుభవంలేని) పేర్లు జాబితాలో ప్రకటించడంతో జనగామ జర్నలిస్టుల్లో పలు సందేహాలు వ్యక్తం కావడంతో పాటు డిపిఆర్ఓ తన ఇష్టారాజ్యంగా అక్రిడేషన్ కమిటిని ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల అక్రిడేషన్ కమిటీలు పూర్తి కాగా శనివారం జనగామ జిల్లా అక్రిడేషన్ కమిటీ జాబితాను డిపిఆర్ఓ పల్లవి శనివారం ప్రకటించారు. అయితే ఇది స్టేట్ సెంటర్‌కు పంపించే ప్రపోజల్ మాత్రమే అంటున్నా అది కూడా సరియైందిగా లేకపోవడం విస్మయానికి గురి చేస్తుంది. అక్రిడేషన్ కమిటీలో ఉండే సభ్యులపై ఎలాంటి కేసులు ఉండకూడదు, అనుభవం ఉండాలి అనే నిబంధనలు చూడాలి. పెద్ద, చిన్న పత్రికల నుండి ఎంపిక చేయాలి. అయితే యూనియన్లకు సంబంధించి రాష్ట్ర సెంటర్ నుండి ఆయా సంఘాలు తన సభ్యుడి పేరుతో లేఖలు పంపుతాయి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ పేరుతో రెండు లేఖలు రాగా ఇద్దరి పేర్లు జాబితాలో చేర్చి పెండింగ్ అని పెట్టారు. ఇక తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం నుండి ఒకే పేరు పంపించగా ఆ పేరును జాబితాలో చేర్చడంతో పాటు జిల్లా కలెక్టర్ నామినేటెడ్ చేసే పేర్లలో కూడా అదే పేరు ఉంచారు. రెండు సార్లు ఒకే పేరు రావడంతో ఇదెలా అంటు తోటి జర్నలిస్టులు ముక్కున వేలేసుకున్న పరిస్థితి. కలెక్టర్ నామినేటెడ్ చేసిన పేర్లలో ధరఖాస్తు చేసుకోని వారి పేర్లు చేర్చి ధరఖాస్తు చేసుకున్న వారి పేర్లను విస్మరించారు. దీనిలోనూ సీనియార్టి గుర్తించలేదు. యూనియన్ సంఘాల పేర్లు సైతం సరిగ్గా రాయలేని పరిస్థితి. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు పేరును తెలంగాణ ఆఫ్ జర్నలిస్టు యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు అంటు తప్పుల తడకగా జాబితాను తయారు చేశారు. ఈ జాబితాను చూస్తే జిల్లా పౌరసంబంధాల శాఖకు జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టులు, ధరఖాస్తు చేసుకున్న వారికి ప్రియార్టీ ఇవ్వాలా..ధరఖాస్తు చేసుకోని వారికి ఇవ్వాలా అన్నది కూడా అవగాహన లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఏదీ ఏమైనా నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు దక్కాలంటే కమిటీ పారదర్శకంగా ఉండడంతో పాటు ఫీల్డ్‌లో ఉండే వారికి అకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని జర్నలిస్టులు అభిప్రాయ పడుతున్నారు.

## మక్కల కొనుగోళ్ళు మరింత వేగవంతం

**కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్**



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : మక్కల కొనుగోళ్ళను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు.శనివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో మక్కల (మొక్కజొన్నల ) కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. మక్కల కొనుగోలు కేంద్రానికి ఎంతమంది రైతులు తమ పంట ఉత్పత్తులను తెచ్చారని, ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మక్కలను విక్రయించేందుకు అక్కడ ఉన్న రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ మక్కల కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని సూచించారు. సరిపడ గన్నీ సంచులు కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉండాలన్నారు. రైతుల నుంచి మక్కలను కొనుగోలు చేసిన వెంటనే లారీల ద్వారా గోదాముకు తరలించాలన్నారు. టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, తహసిల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ , పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



ప్రజాపక్షం/భూపాలపల్లి :వ్యవసాయాన్ని పండుగ చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మండలంలోని వేషాలపల్లి, కాసింపల్లి, గొర్లవేడు, వజినపల్లి, నేరేడు పల్లి, గుడాడ్ పల్లి, కొంపల్లి, పుల్లూరి రామయ్య పల్లి గ్రామాలలో పి.ఎ.సి.ఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో దళారుల చేతుల్లో మోసపోకూడదని, రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర 2389/ రూపాయలతో పాటుగా బోనస్ 500 రూపాయలు ఇస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల యొక్క ఆర్పిఎం 18 నుండి 20 వరకు మరియు బ్లోయర్ ఆన్ లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియజేయాలని, దాని వల్ల ధాన్యంలో తాలు ఉండదని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తి జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులకు సమయానికి డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, టౌన్ ప్రెసిడెంట్ ఇస్లావత్ దేవన్, జిల్లా ఆర్టిఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గుడుంబా అక్రమ రవాణాపై ఎక్సైజ్ దాడులు

**భారీగా నల్లబెల్లం స్వాధీనం- ముగ్గురు అరెస్ట్**




ప్రజాపక్షం/గూడూరు;గుడుంబా మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా ఎక్సైజ్ శాఖ చేపట్టిన ప్రత్యేక దాడుల్లో భారీగా అక్రమ సరుకు స్వాధీనం చేసుకున్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో వరంగల్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కీలక విజయాన్ని సాధించింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఇందిరానగర్ తండా మట్టేవాడ మార్గంలో వామన తనిఖీలు చేపట్టిన అధికారులు టిజి 26 టి 3009 నంబర్ గల అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం సహా సరుకును స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితులు తక్కువ ధరకు బీదర్ నుంచి నల్లబెల్లం పటిక కొనుగోలు చేసి తండాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ నాటుసారాను పట్టణాల్లో అమ్ముతున్నట్లు విచారణలో అంగీకరించారు.రాత్రి రూట్ వాచ్ సమయంలో సర్వపురం తండాకు చెందిన మరో వ్యక్తిని 6 లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనంతో పట్టుకొని అతనిపై కూడా కేసే నమోదు చేశారు.నాటుసారా తయారీ రవాణా విక్రయాలకు పాల్పడేవారిపై కఠన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ బిక్షపతి హెచ్చరించారు. గంజాయి తదితర మత్తు పదార్థాలపై కూడా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనలో ప్రజలు యువత మీడియా సహకరించాలని కోరారు.ఈకార్యక్రమంలో అధికారులు కె నాగయ్య సిఐ శ్రీమతి ఎన్ రజీత సత్యప్రసాద్ వర్పుర్రెడ్డి ఎస్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు

**కలెక్టర్ రాహుల్ శర్మ**

ప్రజాపక్షం/భూపాలపల్లి:అర్హులైన పాత్రికేయులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం మధ్య సమాచార వారధులుగా పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తారని, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పా రదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. 2026–2028 సంవత్సరాలకు చెల్లుబాటు అయ్యే అక్రిడిటేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను నిబంధనల ప్రకా రం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ ఆన్‌లైన్‌దరఖాస్తుల ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. దరఖాస్తుల పరిశీలనలో సంస్థ గుర్తింపు పత్రం, విద్యార్హతలు త దితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు మీ డియా ప్రతినిధుల నుంచి 330 ఆన్‌లైన్‌దరఖాస్తులు అందాయని, వాటిని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాలని డిపిఆర్ఓను ఆ దేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ క లెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిపిఆర్ఓశీలం శ్రీనివాస్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు క్యాతం సతీష్ కుమార్, మంతెన సమ్మయ్య, ఎర్రం సతీష్ కుమార్, మోబిన్ అహ్మద్, జి.సారేశ్వరరావు, పాలకుర్తి మధు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో పోటెత్తిన మొక్కజొన్న

**గందరగోళంగా కొనుగోలు కేంద్రం నిర్వాకం *బస్తాల పంపిణీలో జాప్యం..**



ప్రజాపక్షం /చెన్నారావుపేట : కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్నలు పోటెత్తాయి. దీనితో రైతులు వారం రోజులు ఇబ్బందులు పడుతున్న కేంద్రం వైపు చూసే నాధుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ మార్క్ ఫెడ్ చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రానికి జోజిపేట గ్రామ సమీపంలో ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రానికి ప్రారంభించి వారం రోజులలో మొక్కజొన్నలు పోటెత్తడంతో కొనుగోలు సరిగా చేయకపోవడంతో ఒకవైపు మండుతున్న ఎండలు, మరొకవైపు ఆకాశంలో నల్లని మేఘాలను చూసి అయ్యో చేతికందే పంట నీళ్లపాల్ల అయితాదేమో నని భయంతో రైతులు కన్నీరు కారుస్తున్నారు. కొనుగోలు కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సహకార సంఘం సిబ్బంది ఇష్టరాజ్యముగా నిర్వాకం చేస్తున్నారని రైతులు తమ బాధను వేడుకుంటున్నారు. రైతులకు బస్తాల పంపిణీలో రాజకీయ నాయకుల పైరవీలు జోరుగా కొనసాగుతుందని రైతులు చెప్తున్నారు. అలాగే కాంటాలు చేసే సమయంలో కూడ ఎలాంటి నిబంధనం పాటించకుండ సిబ్బందికి నచ్చిన వారికే కాంటాలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి సక్రమంగా మొక్కజొన్న కాంటాలు అదేవిధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

## అనుమానాస్పద మృతి.. మిస్టరీ ఛేదించిన పోలీసులు




ప్రజాపక్షం/మరిపెడ:ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడనుకున్న వాడే కడతేర్చాడు.ఇటీవల మరిపెడ పరిధిలో చోటుచేసుకున్న యువతి అనూమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులుఛేదించారు.శనివారం మరిపెడ పోలీసు స్టేషన్ లో జరిగిన మీడియా సమావేశంలో మరిపెడ సీఐ పవన్ కూమార్ వివరాలు వెల్లడించారు.మరిపెడ మున్సిపాలిటీకి పరిధిలోనికొత్త తండాకు చెందిన ఆజ్మీర అరవింద్, మం డల పరిధిలోని గిరిపురం ఇటుకల గడ్డ తండాకు చెందిన భూక్య సంగీతలు గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకొని,ఇద్దరి తల్లిదండ్రుల అంగీకారంతో రెండు నెలల క్రితం ఎంగేజ్‌మెంట్ కూడాచేసుకున్నారు.కొద్ది రోజులుగా సంగీత వేరే వ్యక్తితో మాట్లాడుతుందని అనుమానం పెంచుకున్న నిందితుడు అరవింద్,ఆమెను వదిలించు కోవాలనే ఉద్దేశంతో హత్యకు ప్లాన్ వేశాడు.తమ తండాలో ఎల్లమ్మ తల్లి పండుగ చేస్తున్న కార్యక్రమాన్ని అనుకూలం గా మార్చుకొన్నాడు.సంగీత తల్లిదండ్రులను కొత్త తండాకు పండుగకు పిలవడంతో ఆమె ఇంటివద్ద ఒక్కతే ఉంటుందని గ్రహించిన అరవింద్,ఇటుకలగడ్డ తండాకు వెళ్ళి ఊరి బయటవరకు నడిచి రావలసిందిగా సంగీతను పిలిచాడు.అక్కడకు వచ్చిన ఆమెను బైక్‌పై ఎక్కించుకొని ఊరిబైట రోడ్డు వెంబడి ఉన్న బావి వద్దకు తీసుకొని వెళ్ళా డు.హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాలనే ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం ఆమెను మాటల్లో మభ్యపెట్టి వెనుక నుండి చేతులతో బావిలోకి నెట్టి,సంగీత చనిపోయే వరకు అక్కడే వుండి తర్వాత బైక్ పై తన తండాకు వెళ్ళిపోయాడు.అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు తర్వాత విచారణలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా,గ్రామస్తులు ప్రత్యక్ష సాక్షులు సంగీ త ఆ రోజు రాత్రి ఊరి చివర వరకు నడిచి వచ్చి అరవింద్ తో కలసి బైక్ పై వెళ్ళిందని తెలపడంతో లోతుగా విచారించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి,మిడియా ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.ఈ సమావేశంలో మరిపెడ ఎస్ఐ ఇ వీరాబ్రాద్ర రావు,ఎస్ఐ కోటేశ్వర్ రావు,సిబ్బాంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
26-04-2026
www.prajapaksham.in

ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్ర ధారులుగా దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై తాతినేని సత్య దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సతీ లీలావతి' మే 8న గ్రాండ్ రిలీజ్ లావణ్య త్రిపాఠి కొణిదెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'సతీ లీలావతి'.

# రీల్

## లావణ్య త్రిపాఠి తాజా చిత్రం 'సతీ లీలావతి'




ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్ర ధారులుగా దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై తాతినేని సత్య దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సతీ లీలావతి' మే 8న గ్రాండ్ రిలీజ్ లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'సతీ లీలావతి'. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. రెండు వేర్వేరు కుటుంబాలు, నేపథ్యాల నుంచి వచ్చిన వ్యక్తులు కలిసి ప్రయాణించాలంటే వారి మధ్య ఎమోషన్స్ ఇంకెంత బలంగా ఉండాలో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇలాంటి సునిశితమైన అంశాన్ని సతీ లీలావతి చిత్రంలో ఆవిష్కరించారు దర్శకుడు తాతినేని సత్య. భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్గానే కాకుండా ఎంటర్‌టైనింగ్‌గానూ చెప్పే ప్రయత్నమే సతీలీలావతి చిత్రం. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి రెండు సాంగ్స్, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే ట్రైలర్ రిలీజ్ కానుంది. ఈ మూవీకి సంగీత దర్శకుడిగా మిక్కీ జే మేయర్, కెమెరామెన్‌గా బినేంద్ర మీనన్, ఎడిటర్గా సతీష్ సూర్య పని చేస్తున్నారు. లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్, నరేశ్ వి.కె, సప్తగిరి, విటివి గణేశ్, మొట్ట రాజేంద్రన్, జాఫర్, జోషి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, సినిమాటోగ్రఫీ: బినేంద్ర మీనన్, మాటలు: ఉదయ్ పొట్టిపాడు, ఆర్ట్: కోసనం విఠల్ , ఎడిటర్: సతీష్ సూర్య.

## 'ది బ్రేకింగ్ న్యూస్' గ్లింప్స్ విడుదల

మురళీ మోహన్, అనన్య నాగల్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ది బ్రేకింగ్ న్యూస్'. ఈ చిత్రానికి పవన్ కడియాల దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల చిరంజీవి చేతుల మీదుగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ విడుదలైంది. ఇప్పుడు చిత్రబృందం నుంచి మరో ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను విడుదల చేశారు. మురళీ మోహన్ గారి పాత్రను ఎంతో గంభీరంగా, ఆవేశభరితంగా చూపించే మేకింగ్ గ్లింప్స్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మేకింగ్ ఆఫ్ విశ్వ అనే టైటిల్‌తో ఈ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రం మే నెలలో విడుదలకు సిద్ధమవుతోంది. ఓపెన్ స్కై క్రియేషన్స్ బ్యానర్‌పై హనుమంత్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి రైటర్ అండ్ డైరెక్టర్: పవన్ కడియాల
ప్రొడ్యూసర్స్: హనుమంత్ రెడ్డి, ఉమా గూటూర్ , మ్యూజిక్ డైరెక్టర్: శశి ప్రీతం, సినిమాటోగ్రఫీ: సాయినాథ్, ఎడిటర్ :శిరీష్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమణరెడ్డి తాతిరెడ్డి.




## 'కన్న' టీజర్ లాంచ్

మాధురి ప్రజెంట్స్, పాషనేట్ ఫిలిం మేకర్స్, సినిమాటిక్ విజువల్ స్టూడియో సంయుక్తంగా నిర్మిస్తున్న తాజా చిత్రం కన్న. ఎస్ఎన్ రాజశేఖర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం కన్న టీజర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హీరో చైతన్య రావు, హీరో కార్తీక్ శివన్, హీరోయిన్ గీతికా రథన్, మంజు వెంకట్, సినిమా యాక్టర్స్, టెక్నీషన్స్ తదితరులు పాల్గొన్నారు. చైతన్యరావు చేతుల మీదుగా విడుదలైన కన్న టీజర్ విడుదల అయింది.
ఈ టీజర్ లాంచ్ కార్యక్రమంలో హీరో కార్తీక్ శివన్, హీరోయిన్ గీతికా రథన్, కిట్టయ్య, రూపేష్, ప్రేమ్ కృష్ణ , సూరజ్, రామ్ పటాస్, వేణు, డైరెక్టర్ నాని కాసర గడ్డ, రవీంద్ర, వెంకి, మురళి, బంటు, మంజు వెంకట్, దేవా, బృందావనం మూవీ టీమ్, మేకర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... పిలువగానే వచ్చిన హీరో చైతన్య రావుకి థాంక్స్ చెప్పారు. ఆయన సినిమాలకు ఎడిగా పనిచేసానని చెప్పారు. హీరో చైతన్య రావు మాట్లాడుతూ..డైరెక్టర్ రాజశేఖర్ ఒక క్లారిటీ ఉన్న వ్యక్తి అన్నారు. కచ్చితంగా మంచి డైరెక్టర్ అవుతారు అని చెప్పారు. ఆయనతో కలిసి పనిచేస్తానని చెప్పారు. ఎడిటింగ్ కట్స్ కూడా చాలా బాగున్నాయరు. హీరోగా యాక్ట్ చేసిన కార్తీక్ చాలా పోటెన్షల్ ఉన్న యాక్టర్‌లా కనిపిస్తున్నాడు అని, ప్రతీ ఫ్రేమ్ లో కన్న క్యారెక్టర్ కనిపిస్తుందని చెప్పారు. ఇక హీరోయిన్ గీతికాకు ఈ సినిమా మంచి పేరును తీసుకొస్తుందని చెప్పారు. ఈ చిత్రానికి నిర్మాత : సిరివిరెడ్డి నరసింహారెడ్డి, ఎడమ శ్రీను ఎడిటర్ : కోడటి పవన్ కళ్యాణ్, డిఒపి: గుణశేఖర్, సంగీతం : శరవణ వాసుదేవన్, ఆర్ట్ : గిరి, ఎగ్జిగ్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎడమ కృష్ణ ఫైట్స్ : శంకర్, కోరియోగ్రాఫర్ : మురళి.



## 'మండాడి' షూటింగ్ పూర్తి



సుహాస్, సూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మండాడి'. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోసర్‌లు, టైటిల్ పోస్టర్‌ల తో అందరిలోనూ ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. ఈ సినిమా అంతా కూడా తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో సాగుతుంది. ఇక ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాని ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్‌ఫోటైన్‌మెంట్ నిర్మిస్తోంది. మదిమారన్ పుగళేంది తెరకెక్కిస్తున్న ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. ఎంతో సుదీర్ఘమైన, సవాలుతో కూడిన షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. ప్రతీదీ రియలిస్టిక్‌గా ఉండాలన్న ఉద్దేశంలో రియల్ లొకేషన్స్‌లో ఎంతో శ్రమించి షూటింగ్ చేశారు. ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ సీన్స్, ఒళ్లుగగుర్పొడిచే సెయిల్‌బోట్ రేస్ సన్నివేశాలు ఇలా ఎన్నెన్నో ఈ చిత్రంలో ఉన్నాయి. షూటింగ్ కంప్లీట్ అవ్వడంతో పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాల్ని ప్రారంభించారు. సూరి, సుహాస్‌లు పాత్రలకు తగ్గట్టుగా తమ శరీరాకృతిని, లుక్స్‌ను మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇక ఈ మూవీతో సుహాస్ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతోన్నారు. ఇందులో సుహాస్ ఓ డిఫరెంట్ పాత్రను పోషించారు. ఈ మూవీలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలను పోషించారు. ఈ చిత్రానికి సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, ఎస్.ఆర్. కథిర్ సినిమాటోగ్రఫర్‌గా పని చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్ను డి.ఆర్.కె. కిరణ్, ఎడిటింగ్‌ను ప్రదీప్ ఇ. రాఘవ్, యాక్షన్ సన్నివేశాలకు పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బురాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేశారు. చిత్ర బృందం ఎడిటింగ్, సౌండ్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్‌తో, సంగీతం వంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా అద్భుతమైన క్వాలిటీని అందించేందుకు టీం కష్టపడుతోంది. త్వరలోనే ఇతర అపేట్‌లను మేకర్స్ ప్రకటించనున్నారు.

## 'ప్రేమకి పులిహోర' సాంగ్ రిలీజ్



డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్కర్స్, పిఒవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్‌లపై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. తాజాగా మేకర్స్ ఫోర్త్ సింగిల్ ప్రేమకి పులిహోర సాంగ్ రిలీజ్ చేశారు. టిపికల్ లవ్ సాంగ్‌లా కాకుండా, 'ప్రేమకి పులిహోర' మోడరన్ లవ్‌లో ఉండే అటుపోటులు, సరదా, అన్నీ అంశాలను సరదాగా ప్రజెంట్ చేస్తోంది. తనకు నచ్చిన అమ్మాయిని ఆకట్టుకోవడానికి హీరో చేసే ప్రయత్నాలు, ఆ ప్రయాణంలో ఎదురయ్యే చిన్న చిన్న అడ్డంకులు అన్నీ ఈ పాటలో హ్యూమరస్‌గా, రిలేటబుల్‌గా ఆకట్టుకున్నాయి. స్వీకర్ అగస్తి ఈ పాటకు మ్యూజిక్ అందించాడు. అనురాగ్ కులకర్ణి వోకల్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది.ఈ చిత్రానికి విద్యా సాగర్ చింతా సినిమాటోగ్రఫీ, విప్లవ్ నైషదం ఎడిటింగ్, చంద్రిక గొర్రెపాటి ప్రొడక్షన్ డిజైన్, సూర్య ప్రకాష్ జ్యోసుల కథను అందిస్తున్నారు. గాయపడ్డ సింహం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నిర్మాతలు: కళ్యాణ చక్రవర్తి మంతిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సాల్. కథ: సూర్య ప్రకాష్ జ్యోసుల , కాస్ట్యూమ్ డిజైనర్: అపూర్వ రెడ్డి, క్రియేటివ్ ప్రొడ్యూసర్: శ్రీని జోస్యుల ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పెన్మత్స అజయ్ వర్మ.

## మహిళల ఆర్థికాభివృద్ధికి క్రమశిక్షణే మార్గం: మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మహిళల విద్య, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బిఆర్‌కె భవన్‌లో సెర్ప్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు కేవలం పొదుపుకే పరిమితం కాకుండా, లాభదాయకమైన వ్యాపారాల వైపు దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా సంఘాల్లోని సభ్యుల విద్యా అర్హతలను గుర్తించి, వారికి ఉన్నత చదువుల కోసం త్వరలోనే ఎడ్యుకేషన్ ప్రొఫైల్ ఏర్పాటు చేస్తామని ప్రతి మహిళా అక్షరాస్యురాలి గా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది మరో 5,000 వీఓ భవనాలను నిర్మిస్తామని వెల్లడించారు. మహిళా సంఘాల బలోపేతానికి అధికారులు చేస్తున్న కృషిని అభినందించిన మంత్రి, క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు అమలు కావాలని ఆదేశించారు.

## ప్రొఫెసర్ కోదండరామ్‌కు సిపిఐ నేతల అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంఎల్‌సిగా నియమితులైన ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌కు సిపిఐ నేతలు అభినందనలు తెలిపారు. నాంపల్లిలోని తెలంగాణ జన సమితి (టిజెఎస్) కార్యాలయంలో శనివారం ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిలు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ప్రొఫెసర్ కోదండరామ్ అనుభవం, రాష్ట్ర అభివృద్ధికి మరింత దోహదపడాలని, శాసనమండలిలో ఆయన సేవలు ప్రజల ఆశయాలకు అనుగుణంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

## కోదండరామ్‌కు టిజెఎస్ నేతల సన్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంఎల్‌సిగా నియమితులైన టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండ రామ్‌ను టిజెఎస్ నాయకులు సన్మానించారు. టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ ఎం.నర్సయ్య ఆధ్వర్యంలో టిజెఎస్ నాయకులు, కార్యకర్తలు టిజెఎస్ కార్యాలయంలో కోదండరామ్‌ను శనివారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు బట్టల రామచందర్, జస్వంత్ కుమార్, పల్లె వినయ్, రమేష్ ముదిరాజ్, ధారసత్యం, హనుమంత్ రెడ్డి, జయపాల్ రెడ్డి ,లక్ష్మణ్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## కోదండరామ్, అజారుద్దీన్

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ కోటా ఎంఎల్‌సిల పేర్లను త్వరగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇటీవల గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి కోరారు. ఎట్టకేలకు సుదీర్ఘ నిరీక్షణ అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఎంఎల్‌సిలుగా అజారుద్దీన్, కోదండరామ్‌ల దస్త్రాలపై సంతకం చేశారు. గవర్నర్ కోటా ఎంఎల్‌సిల విషయంలో గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. టిజెఎస్ అధ్యక్షులు కోదండరామ్ 2024 ఆగస్టు 16న ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ కోటా ఎంఎల్‌సిల నియామకం పట్ల బిఆర్ఎస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఎంఎల్‌సిల నియామక గెజిట్ నోటిఫికేషన్‌ను అప్పట్లో కొట్టివేసిన విషయం తెలిసిం దే.

**వివిధ రంగాలలో అనుభవం ఉన్న వారు సభలో ఉంటే సమర్థవంతమైన పాలన : మహేష్ కుమార్‌గౌడ్**

మంత్రి మహమ్మద్ అజారుద్దీన్,ప్రొఫెసర్ కోదండరామ్‌లను గవర్నర్ కోటా ఎంఎల్‌సిలుగా గవర్నర్ శివ ప్రతాప్ ఆమోదించడం పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్‌సిలుగా మాజీ క్రికెటర్ , తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ పేర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం శుభ పరిణామమని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజానికి సేవ చేసిన వ్యక్తులకు శాసన మండలిలో స్థానం కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు.ప్రజా జీవితం, క్రీడా రంగం, సామాజిక ఉద్యమాల్లో విశిష్ట సేవలను అందించిన అజారుద్దీన్‌కు ఎంఎల్‌సిగా అవకాశం రావడం సముచిత నిర్ణయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరామ్ పోషించిన పాత్ర చారిత్రాత్మకమన్నారు. ప్రజాస్వామ్యంలో వివిధ రంగాల అనుభవం ఉన్న వ్యక్తులు శాసనసభలు, శాసన మండలిలో ఉండటం ద్వారా పాలన మరింత సమర్థవంతంగా ఉంటుందన్నారు.

## 'రాష్ట్రీయ శరణాగతి సంఘ్'

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నాయకుడు, ఇరాన్, రష్యా నుండి చమురు కొనుగోలును ఆపడానికి భారత దేశం అంగీకరించిందని, అలాగే అమెరికా విధించిన అధిక సుంకాలను కూడా అంగీకరించిందని చెప్పారు. అయితే, మాధవ్ తరువాత క్షమాపణలు చెప్పారు. తాను చెప్పింది వాస్తవానికి తప్పు అని, ఎందుకంటే రష్యా నుండి చమురు దిగుమతులను ఆపడానికి భారతదేశం అంగీకరించలేదని, పైగా ట్రంప్ ప్రభుత్వం విధించిన 50 శాతం సుంకాన్ని తీవ్రంగా నిరసించిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ ఎక్స్‌బ్లాగ్‌లో పెట్టిన ఒక పోస్టులో 'రాష్ట్రీయ సంఘ్ లొంగిపోయింది. నాగ్‌పూర్‌లో ఫర్జీ జాతీయవాదం. అమెరికాలో పచ్చి దాస్యభావం. రామ్ మాధవ్ మాత్రమే సంఘ్ నిజ స్వరూపాన్ని బయటపెట్టారు' అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తన పదవిలో కొనసాగే అధికారాన్ని కోల్పోయారని, మోదీ వాషింగ్టన్ పాటలకు నాట్యం చేస్తున్నారని ఒక సీనియర్ ఆర్ఎస్ఎస్ నాయకుడు స్పష్టంగా అంగీకరించారని కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఒకప్పుడు బంగాళాఖాతంలో అమెరికా 7వ నౌకాదళం ఉన్నప్పుడు, భారతదేశం కదలలేదు. ఇక నేడు రాజీపడిన ప్రధాని భారత దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాకు అప్పగించారు' అని వేణుగోపాల్ ఎక్స్ అనే బ్లాగ్‌లో పెట్టిన ఒక పోస్టులో ఆరోపించారు. ప్రపంచ వేదికపై భారతదేశం తన స్వతంత్ర స్వరాన్ని కోల్పోయిందని, ఈ లొంగుబాటు తర్వాత, నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా కొనసాగే అధికారాన్ని కోల్పోయారని స్పష్టమవుతోందని వేణుగోపాల్ అన్నారు. కాగా, ఓ వీడియోలో మాధవ్ ఇలా అంటున్నట్లు వినిపిస్తుంది... 'ఇరాన్ నుండి చమురు కొనుగోలును ఆపడానికి భారత దేశం అంగీకరించింది. మన భారతీయ ప్రతిపక్షం నుండి ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ, రష్యా నుండి చమురు కొనుగోలును ఆపడానికి మేము అంగీకరించాము. మేము 50 శాతం సుంకానికి అంగీకరించాము... అంగీకరించాము అంటే మేము ఏమీ అనలేదు. మేము మా సహనాన్ని పాటించాము. 'ఈ రోజు, కొత్త వాణిజ్య ఒప్పందంలో కూడా మేము 18 శాతం సుంకాలకు అంగీకరించాము, ఇది గతంలో ఉన్నదానికంటే ఎక్కువ... అంటే, సగటు సుంకం కంటే ఎక్కువ. వాషింగ్టన్‌లోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాధవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. తరువాత, ఎక్స్ పోస్ట్‌లో, రష్యా నుండి చమురు దిగుమతిని ఆపడానికి భారతదేశం అంగీకరించనందున తాను చెప్పింది తప్పు అని ఆ ఆర్ఎస్ఎస్ నాయకుడు యూటర్న్ తీసుకున్నారు. 'నేను చెప్పింది తప్పు. రష్యా నుండి చమురు దిగుమతిని ఆపడానికి భారతదేశం ఎప్పుడూ అంగీకరించలేదు. అలాగే 50 శాతం సుంకం విధించడాన్ని తీవ్రంగా నిరసించింది. నేను ఇతర ప్యానలిస్ట్‌కు పరిమితంగా ప్రతివాదన చేయడానికి ప్రయత్నించాను. కానీ అది వాస్తవం కాదు. నా క్షమాపణలు' అని మాధవ్ తన వీడియోను పంచుకుంటూ అన్నారు.

## పాక్ వెళ్లొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తాజా ప్రకటనతో పాక్‌లో రెండో విడత చర్చలకు బ్రేక్ పడినట్లయ్యింది. అంతకుముందు.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ బృందం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఉన్నతాధికారులతో సమావేశమైంది. తమ డిమాండ్ల జాబితాను వారికి అందజేసి.. పాక్ నుంచి వెళ్లిపోయింది. ఈ భేటీకి సంబంధించి పాక్ ప్రధాని సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ప్రస్తుత పరిస్థితులు సహా పలు అంశాలపై చర్చించామన్నారు. అయితే, అమెరికా చర్చల విషయాన్ని మాత్రం ప్రస్తావించలేదు. ఈ భేటీలో పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ప్రత్యక్ష చర్చలు జరిపేది లేదు : ఇరాన్**

అయితే, అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతినిధి బృందం కూడా సుముఖత వ్యక్తం చేయలేదు. అమెరికా ప్రతినిధులతో ప్రత్యక్ష భేటీకి ఎలాంటి ప్రణాళికలు లేవని ముందుగానే పేర్కొంది. 'ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య ప్రత్యక్ష భేటీకి ఎలాంటి ప్రణాళికలు లేవు. దానికి బదులుగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య సందేశాలను పాక్ అధికారులు బదిలీ చేస్తారు. అరాగ్చీ బృందం పాక్ ఉన్నతాధికారులతోనే సమావేశమవుతుంది. అగ్రరాజ్యానికి మేం చెప్పాలనుకున్న విషయాలను వీరికే వివరిస్తాం' అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

**ఇస్లామాబాద్‌లో లాక్‌డౌన్–జనం కష్టాలు ప్రత్యక్ష చర్చలపై ఇంకా అనిశ్చితి**

అమెరికా–ఇరాన్ చర్చల పేరుతో ఇస్లామాబాద్‌లో లాక్‌డౌన్ పరిస్థితులు నెలకున్నాయి. పొరుగున రావల్పిండి నగరంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. భారీస్థాయిలో వేలాదిమంది సైనికులను భద్రత నిమిత్తం మోహరించారు. గడచిన వారం రోజులుగా ఇస్లామాబాద్–రావల్పిండి నగరాల్లో లాక్‌డౌన్ పరిస్థితి ఉండగా, ఇరాన్–అమెరికా మధ్య ముఖాముఖీ చర్చలపై ఇంకా అనిశ్చితి నెలకుని ఉంది. ఇస్లామాబాద్‌లో రోడ్లన్నీ మూసేశారు. కీలకమైన ప్రభుత్వ భవనాలను,దౌత్యకార్యాలయాలను పూర్తి భద్రతావలయంలో ఉంచారు. మార్కెట్లు నిర్మానుష్యంగా మారాయి. కేఫ్‌లలో సరఫరాలు అరకొరగా ఉన్నాయి. ప్రభుత్వ రవాణా కూడా స్తంభించింది. నివాసితులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇటీవలి వారాల్లో ఇది రెండో లాక్‌డౌన్. మొదట ఏప్రిల్ 11,12 తేదీల్లో లాక్‌డౌన్ ప్రకటించారు. చర్చలు విఫలమయ్యాక లాక్‌డౌన్ తెరిచారు. అంతకు ముందు ఫిబ్రవరి 27న అబ్బాస్ అరాఘ్చీ,ఇద్దరు ట్రంప్ దూతలు ఇరాన్ అణు కార్యక్రమంపై జెనీవాలో అనేక గంటలసేపు పరోక్ష చర్చలు నిర్వహించారు. ఈ చర్చలు ఇంకా పూర్తికాకముందే మరునాడే ఫిబ్రవరి 28న ఇరాన్‌పై యుద్ధం ప్రకటించి అలీ ఖమేనీ సహా ఆయన కుటుంబాన్ని, ఇతర ఉన్నతస్థాయి నాయకులను హతమార్చారు. యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకూ ఇరాన్‌లో 3,375 మంది మరణించగా, లెబనాన్‌లో 2,490 మంది పైగా మరణించారు. ఇజ్రాయెల్‌లో 23 మంది గల్ఫ్,అరబ్ దేశాలలో మరో 12 మంది మరణించారు. లెబనాన్‌లో 15 మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించగా, ఇజ్రాయెల్ దాడుల్లో ఆరుగురు శాంతి సైనికులు మరణించారు. ఇరాన్ యుద్ధంలో మొత్తం 13 మంది అమెరికా సైనికులు మరణించారు.

## 'డిజిటల్' జనగణన

(మొదటి పేజీ తరువాయి)

తమ వివరాలను తామే నమోదు చేసుకునే 'స్వీయ నమోదు' ప్రక్రియను ఈ నెల 26 నుంచి మే 10 వరకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జనగణన రాష్ట్ర డైరెక్టర్ భారతి హోళికేరి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో భారతి హోళికేరి, కర్ణన్ ఈ వివరాలను వెల్లడించారు. సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, సంక్షేమ పథకాలకు సంబంధించి కూడా ఈ వివరాలు వినియోగించరాని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నేటి నుంచి మే 10 వరకు తెలంగాణలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశాం. se.census.gov.in పోర్టల్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు వీలు కల్పించాం. 15 రోజుల పాటు సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం ఉంటుంది. మొదటిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కలు సేకరిస్తున్నాం. ప్రజలు స్వతహాగా వివరాలు నమోదు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ 16 భాషల్లో అందుబాటులో ఉంటుంది అని భారతీ హోళికేరి అన్నారు.

**పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నమోదు ప్రక్రియ..**

గతంలో మాదిరిగా ఇంటింటికీ వెళ్లి కాగితాలపై వివరాలు సేకరించే విధానానికి బదులుగా ఈసారి పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నమోదు ప్రక్రియ కొనసాగనుందన్నారు. ప్రజలు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్ ద్వారా మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చు అని అన్నారు. ఈ సేవ ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఒక మొబైల్ నెంబర్‌తో ఒక కుటుంబం మాత్రమే నమోదు చేసుకోవాలని, ఇంటి యజమాని పేరు నమోదు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని భారతీ హోళికేరి సూచించారు. జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నామని, మొదటి దశలో 'హౌస్ లిస్టింగ్' ద్వారా ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లు, గుడిసెలు, విద్యాసంస్థలు వంటి నిర్మాణాలను గుర్తించి సంఖ్య కేటాయిస్తారన్నారు. రెండో దశలో వ్యక్తిగత వివరాలను సేకరిస్తారని, స్వీయ నమోదు పూర్తి చేసిన వారికి ఒక ప్రత్యేక ఐడి ఇస్తారని చెప్పారు. ఈ ఐడిని ఎన్యూమరేటర్లకు అందజేస్తే, వారు అవసరమైన సవరణలు చేస్తారన్నారు. హైదరాబాద్ నగరాన్ని 21,866 ఎన్యూమరేషన్ బ్లాక్లుగా విభజించినట్లు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా జిహెచ్‌ఎంసి కమిషనర్, అదనపు అధికారులుగా సిఎంసి, ఎంఎంసి కమిషనర్లు పర్యవేక్షించనున్నారని చెప్పారు. నగరంలో ఉన్న విద్యావంతుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మంది ఆన్‌లైన్‌లో స్వీయ నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు కీలకమని అధికారులు తెలిపారు. అందువల్ల ప్రతి పౌరుడు బాధ్యతగా ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com